కథలు
పద్దెనిమిది

మోహచిత్రం

అఖిలం సత్యప్రసాద్

"చూడాలని వుంది" చిత్రం

అసలు కథ

ప్రచురణలు

Ooha Chitram

An anthology of short stories

by

Aripirala Satyaprasad

Published by: Gna Prachuranalu

First edition: November, 2013

Cover Design: Sri Bapu, Anwar

Layout & DTP: Mallesh Sampangi

Printers: Anupama Graphics,
126, Shantinagar, Hyderabad
Ph: 040-23391364

Copies: In all leading book stores

e-books: www.kinige.com

Price: Rs. 120/-

satyaonline@gmail.com

aripirala.satyaprasad

palakabalapam.blogspot.com

+91 9966907771

అమ్మకి –

ఇదీ వరుస

❖ **కథాప్రాసాదంలో సత్యప్రసాదాలు**

❖ **నా మాట**

❖ **నెనర్లు**

స్వప్న శేషం	15
తుది బంధం	23
ఐదు వందల రూపాయల నోటు	28
ఊహాచిత్రం	35
చిరాకు రామనాథం	41
ఏడు తరువాత..	47
మంత్రిగారి సమాధి	52
చినుకులా రాలి...	57
వానర వీరుడు	63
చిలక రాయబారం	72
మబ్బుతునక	76
ఈరేశంగాడి ముచ్చట..!!	82
ఓపెన్ టైప్	86
మేరా భారత్ మహాన్	98
పద్మావతీ శ్రీనివాసం	101
మంచినీళ్ళ బావి	107
కలిసివచ్చిన ఇల్లు	117
భూదేవతమ్మ	125

❖ **కథానుబంధం**

కథాప్రాసాదంలో సత్యప్రసాదాలు

భాషను బ్రతికించేది సాహిత్యం. అందరికీ అందుబాటులో ఉండే సాహితీప్రక్రియ కథ.

కథ ఒక విచిత్రమైన వంటకం. కథకులలో దైవత్వాన్ని వెలికిదీసి, వారి చేతి మహాప్రసాదంగా లభ్యం కాగలదు. ఆ ప్రసాదం పాఠకుల్లో దైవత్వాన్ని ప్రేరేపించగలదు.

కథ ఒక జీవనదీప్రవాహం. కాలానుగుణంగా మారే సమాజపు ప్రక్షాళనకీ, దాహార్తికీ అనువైనది. అందుకోసం ఎప్పటికప్పుడు కొత్త కథకుల ఆవిర్భావం ప్రతి సమాజంలోనూ రివాజు. తెలుగునాట మాత్రం ఈ రివాజు వివాదాస్పదం: ఎందుకంటే– తెలుగుకు భాషగా తెలుగునాటనే ఆదరణ లేదనీ, తెలుగు కథనరంగంపట్ల యువతరానికి ఆసక్తి లేదనీ ఇప్పుడు చాలామంది నమ్ముతున్నారు. తెలుగు భాష త్వరలో అంతరించనున్నదన్న అనుమానం అంతర్జాతీయంగా ప్రచారమౌతోంది.

అలాంటి నమ్మకాల్నీ, అనుమానాల్నీ– నిర్ద్వంద్వంగా తొలగిస్తుంది– 'ఊహాచిత్రం' కథా సంపుటి.

'ఊహాచిత్ర'కారుడు అరిపిరాల సత్యప్రసాద్ 35 సంవత్సరాల ఆధునిక విద్యాధిక యువకుడు. ఆంగ్ల మాధ్యమానికి ప్రాధాన్యమిచ్చే కార్పొరేట్ వ్యవస్థలో భాగస్థుడు. ఐనా అతడికి తెలుగు భాషమీద పట్టుంది. తెలుగుతనం పట్ల అవగాహన ఉంది. తెలుగు సాహిత్యపు నేపథ్యముంది.

అతడి శైలి– ఆలోచనలో కొడవటిగంటికి సాటొస్తుంది. ఆవేదనలో రాచకొండలా స్పందిస్తుంది. నిరసనలో రంగనాయకమ్మగా కనిపిస్తుంది. ఆహ్లాదంలో మల్లాదిలా మురిపిస్తుంది. ఆకట్టుకోవడంలో యండమూరికి దీటస్తుంది. ఒకరా, ఇద్దరా– సమకాలీనంగా ఉన్నత శిఖరాలకు చేరుకున్న మహాకథకులందర్నీ అతడు కాచి వడబోసినట్లు తోస్తుంది. ఐతే ఇతడు ఎవర్నీ అనుకరించడు. సంపుటనిలో ప్రతి కథా కేవలం అరిపిరాలది.

మరి తెలుగు తెలతెలబోతోందనగలమా? తెలుగుకి భావి లేదనగలమా?

సూక్ష్మంగా చూస్తే– కథాంశాలు విభిన్నం, శైలి విశిష్టం. స్థూలంగా పరిశీలిస్తే–

కొన్ని కథలు– భాష, శైలి పోటీ పడిన సొగసైన కవితలు: ఓ చిత్రకారుడి మరణాన్ని వినూత్నంగా విశ్లేషించిన 'ఊహాచిత్రం'– ఆద్యంతం చిత్రకారుడి దృష్టికీ, దృక్పథానికీ– చైతన్యస్రవంతిగా మారి, కొందరికే పరిమితమైన ఆ తరహా కథనాన్ని అందరికీ ఆమోదయోగ్యం చేసింది. 'మానాన్న పేరు మేఘం. అమ్మ పేరు ధరిత్రి. నాన్న అమ్మకి రాసిన ప్రేమలేఖనే నేను. నా పేరు చినుకు'– అంటూ మొదలైన 'చినుకులా రాలి...' కథ– పురోగతి పేరిట నేలమీది జీవధారల్ని కాలుష్యం చేసి తన మనుగడకే ముప్పు తెచ్చుకుంటున్న మనిషి తీరుపట్ల– ఓ చినుకు స్పందన. ఇందులో హెచ్చరికని సందేశంగానూ, మందలింపుని పరిష్కారంగానూ, వాస్తవాన్ని కల్పనగానూ, విశ్లేషణని కథగానూ మలచిన తీరు అర్థవంతం, ప్రయోజనాత్మకం, ప్రతిభావంతం. 'చిలక రాయబారం'– ఆధునిక దాంపత్యానికి అపురూప విశ్లేషణ; కొసమెరుపు– నవ్విస్తూనే నిట్టూర్చేలా చేస్తుంది.

కొన్ని కథలు– డబ్బే సర్వస్వమనుకునే ఈతరం తీరుపై అపూర్వ స్పందనలు: తనకు నచ్చే ప్రపంచం, తానుండే ప్రపంచం ఒకటి కాని– భావుకుని 'స్వప్నశేషం'. భావుకత నిండిన అనుబంధానికి 'తుదిబంధం'. నేడు సాధారణమై వేధిస్తున్న అంశాన్ని కొసమెరుపుతో అసామాన్యం చేసిన 'మబ్బుతునక'. నేటి కార్పొరేట్ ఉద్యోగుల జీవితాన్ని– 'పద్మావతీ శ్రీనివాసం'గా, 'భూదేవతమ్మ'గా అన్వయం. మంచినీటి వ్యాపారానికి సింబాలిజంగా 'మంచినీళ్ల బావి'.

కొన్ని కథలు– నియమోల్లంఘనలో మంచిచెడులకు నిష్పక్ష విశ్లేషణలు: మనోవిశ్లేషణతో కళ్లకు కట్టిన 'ఐదు వందల రూపాయల నోటు' ముగింపు అసాధారణం. నియమపాలనని ఎగతాళి చేసే మన సంప్రదాయాన్ని 'చిరాకు రామనాథం' అపహాస్యం చేసిన తీరుకి మనసు విచలితమౌతుంది. 'ఓపెన్ టైప్'లో ఉష విచ్చలవిడితనాన్ని ఒప్పించిన కథనశిల్పం చలానికి మాత్రమే సాధ్యమనిపిస్తుంది.

మిగతావాటిలో: ఇల్లలుకుతూ పేరు మరచిన ఈగ తరహాలో నడిచిన 'ఏడు తరువాత'లో– ఏడు అంకెమీద చమత్కారంతోపాటు జీవనవేదాంతాన్ని ఇమిడ్చిన కథనకౌశలానికి– ముగింపు పరాకాష్ఠ. 'వానర వీరుడు'లో ఇతివృత్తం, ముగింపు సాధారణమైనా– పురాణజ్ఞానం, అవగాహన కథనాన్ని ప్రతిభావంతం చేశాయి. అపవాదుతో కాంప్లెక్సుని జయించిన 'ఈరేశంగాడి ముచ్చట' యాసలో రచయిత

సునాయాసకి మెచ్చుతునక. 'మేరా భారత్ మహాన్'– తమవారిని సంస్మరించడంలో తెలుగువారి సంకోచానికి అద్దం పట్టింది. గతంలో చందమామలో వచ్చిన 'అందమైన వాకిలి' అనే పిల్లల కథను స్ఫురింపజేస్తూ– మధ్యతరగతి ఆపేక్షల్ని హృద్యంగా వ్యక్తంచేసిన 'కలసి వచ్చిన ఇల్లు'– సందేశానికి పిల్లల కథ, వాస్తవానికి పెద్దల కథ.

కథలన్నింట్లో భాష, శైలి, భావప్రకటనల్లో సహజ ప్రతిభ ప్రస్ఫురితం. కొన్నింట కథనం, కొన్నింట సంభాషణా చాతుర్యం, కొన్నింట ముగింపు, కొన్నింట సెంటిమెంటు– అద్భుతం. అనేక సందర్భాల్లో– స్ఫురించే సామాజిక స్పృహ, వినిపించే సందేశం– అంతర్లీనం కావడం వినుతం. ఇక హాస్యం విషయంలో రచయిత విభిన్న శిల్పానికి 'మంత్రిగారి సమాధి' ప్రస్తుతం: శ్మశానంలో మినిస్టరు పాపయ్య పక్కనున్న గోడనెవరో బద్దలు కొట్టారు. వాళ్లు తన మనుషులేననీ, శ్మశానాన్ని కబ్జా చేస్తారనీ, తనకి మిగిలిన ఈ కాస్త నేలా కూడా లేకుండా పోతుందనీ ఆత్మ ఘోషిస్తే– పాపయ్య దెయ్యమై తన ఘోషని కాటికాపరికి వినిపిస్తాడు. హాస్యం అంటే ప్రతివాక్యం కితకితలు పెట్టాలన్న భావనకి విరుద్ధమైనా– ఓ పత్రిక నిర్వహించిన హాస్యకథల పోటీలో నెగ్గిన ఈ కథ– నేటి రాజకీయవాదులపై వ్యంగ్యాస్త్రం. ఎక్కడా పాఠకుణ్ణి నవ్వించే తాపత్రయం కనపడదు కానీ– కథాంశం, మంత్రి ఆత్మఘోష, కాటికాపరి ఆలోచనలు– అన్నీ హాస్యమయం. భావప్రకటనలో ఆకాశమంత ఎత్తు, సముద్రమంత లోతు చేరుకుని– ఉదాత్త గంభీర హాస్యానికి మచ్చుతునకగా నిలచిన విలక్షణ హాస్య కథ ఇది.

కథనంతో చదివిస్తూ వ్యాఖ్యలతో అలరిస్తే ఉత్తమ కథ అనడం కద్దు. ఈ సంపుటిలో అలరించిన వ్యాఖ్యలు విభిన్నం, విశిష్టం, ప్రత్యేకం. మచ్చుకి కొన్ని:

కూర్చుంటే 'రాయి చాలా మెత్తగా ఉంది'– అపూర్వం. 'మనం మేధావి ఐతే, నాకు తెలియదని చెప్పాల్సిన అవసరమే ఉండదని అర్థమైంది'– సుభాషితంలాంటి చురక. 'భారత స్వాతంత్ర్య దినోత్సవం– అంటే అదేరా, ఇండిపెండెన్స్ డే'– తెలుగువాడి తెలుగు ప్రజ్ఞ. 'కంపెనీ కొన్నప్పుడు ఆ కంపెనీని వృద్ధిలోకి తీసుకొచ్చిన ఉద్యోగస్థులు ఆ కంపెనీలో భాగం కాకుండా పోతారా?'– ఉద్యోగం పోగొట్టుకున్నవాడి ఆవేదన. 'పొలం భూదేవతమ్మ. తల్లితో సమానం. అమ్మనెలా అమ్మమంటావ్?'– సంకోచంలాంటి సందేహంలో సందేశం. 'భూదేవతంటే లక్ష్మీదేవి కాదు. అన్నపూర్ణ. పదిమందికి అన్నం పెట్టే తల్లి'– అసలుసిసలు ప్రగతి పాఠం. 'ఏమ్మా, ఇదేనా రావడం– అమ్మా నాన్నని పిల్చుకు రాకపోయారా– ఈయనేనా మీ ఆయన? ఏదన్నా విశేషమా– ఇంకా ఎప్పుడే– ఎవరే ప్రశ్న అడుగుతున్నారో అర్థమయ్యేలోపలే పది పదిహేను ప్రశ్నలు దూసుకొచ్చాయి'– యథాలాపం పట్ల దీనాలాపం.

ఇక ఆధునిక జీవితం గురించి రచయిత చేసిన వ్యాఖ్యలు అపూర్వమూ, అద్భుతమూ, ఆలోచించవలసినవీనూ. మచ్చుకి కొన్ని: 'నేనున్నది ట్రెడ్‌మిల్‌మీద. నా కాళ్లకింద బెల్ట్ పరుగెడుతుంటే పడిపోకుండా చేసే ప్రయత్నాన్ని నేను పరుగనుకుంటున్నాను. ఎంత పరుగెత్తినా అక్కడే ఉంటాను. ముందుకు తీసుకెళ్లే పరుగు కాదది'; 'తోటి సైనికుడు చనిపోతే కనీసం అటువైపు చూడనైనా చూడకుండా యుద్ధంలోకి పరుగెత్తే సైనికుల్లా కొలీగ్స్'; 'సంసార కాలం మొత్తం ముళ్లు ఏరి పారెయ్యడానికే సరిపోయింది. పూల దారులు పక్కనే ఉన్నా, ముళ్లు ఏరే పనిలో వాటిని గుర్తించనే లేదు'.

ఓ కథలో– బావి, నీరు గురించి రచయిత ఎన్ని రకాలుగా చెబుతారో: 'ఆ బావి చలివేంద్రంలా రోజంతా జలదానం చేస్తూనే ఉండేది'; 'బావిలో నీళ్లు నవ్వుతూ సుడులు తిరిగేవి'; 'ఆ బావి పెద్ద బొట్టు పెట్టుకున్న ముత్తైదువలా చేతనైనంతవరకూ జలదానం చేసింది'; 'ఒరల బావి అప్పుడే చీర కట్టడం నేర్చిన కుర్రపిల్లలా ఉండేది. అక్కడ నీళ్లు చెరకురసంలా కాకపోయినా చక్కెరనీళ్లలాగా బాగుండేవి'.

కథాప్రాసాదంలో 'ఊహాచిత్రం'– కథానిక ప్రక్రియకు బాలభోగం మాత్రమే. ఈ సత్యప్రసాదాలు సేవించిన కథాప్రియు లందరూ– రాజభోగాలు, పవళింపు సేవలు, కల్యాణాలు ఎవగైరా ఎన్నో వేడుకలకోసం ఎదురుచూసేలా చెయ్యగల అపూర్వ బాలభోగమిది. దీనికి పెద్దల దీవెన కథామతల్లికి వీవెన. పిన్నల మన్నన తెలుగు సాహితికి ఉప్పెన. ఈ కథాసంపుటికి మా అభివందనాలు!

– "వసుంధర"

జూలై 12, 2013

నా మాట

నిజం చెప్పద్దూ, మా ఇంట్లో వెనక ఏడు తరాలు చూసుకున్నా రచయితలు ఎవరూ లేరు దూరపు చుట్టాలలో సంగీతజ్ఞులు, ఇదే ఇంటిపేరుతో కొంతమంది రచయితలు వున్నా వారితో అనుబంధం తక్కువ. మరి నాలో ఈ సాహిత్యాభిలాష ఎక్కడిదా అని వెతుక్కుంటూ నాలోకి నేనే చూసుకుంటే –

ముందు మా అమ్మ జ్ఞాపకం వస్తుంది. గత పాతికేళ్లుగా ఆమె జ్ఞాపకంగానే మిగిలింది. పాత సినిమాపాటలో, లలిత సంగీతమో బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్‌గా లేకుండా ఆమె నాకు గుర్తుకురాదు. రేడియో పాడుతుంటే, ఆమె పనులు చేసుకోవటం ఆమె గురించి గుర్తున్న సంతోషకరమైన జ్ఞాపకాలలో ఒకటి.

ఇక అదే రేడియోలో ఏ రాత్రిపూటో నాన్న పెట్టే కర్ణాటక సంగీతం – తెలియకుండానే త్యాగరాజునీ, శ్యామదాసునీ, పురంధరదాసునీ పరిచయం చేసేవి. సుబ్బలక్ష్మి, శమ్మంగుడి, మహారాజపురం, కున్న కూడి, పట్టమ్మాళ్ ఇలా ఒక్కొక్కళ్లే మా గోడమీద చెక్కస్టాండ్ స్టేజి పైకి ఎక్కి టేప్ రికార్డర్ రూపేణా కచేరీలు చేస్తుండేవాళ్లు. వీళ్లంతా నాన్న సేకరించిన వందలకొద్దీ సంగీతం క్యాసెట్లలో సంగీత సామ్రాట్టులు. వీరందరి మధ్యలో అక్కడక్కడ కనిపించే నాలుగైదు సినిమా పాటల క్యాసెట్లలో నుంచి ఎ.ఎమ్.రాజా, ఘంటసాల, లీల, సుశీల గొంతు సవరించేవాళ్లు. వీళ్లంతా అమ్మకోసం నాన్న రికార్డ్ చేయిస్తే ఇంటికి వచ్చిన అతిథులు, ఈ సంగీతం, సినీగీతం మధ్యలో ఎక్కడో కళల గురించి ఆసక్తో, అభిరుచో మొదలైంది.

వేమన్నని, పోతన్నని పరిచయం చేసింది మేనత్త. తొలి అడుగులు వేస్తున్నప్పటి నుంచే తెల్లవారు ఝామున లేపి, నీళ్లు పోసి, దేవతార్చనకి పూలు కోసే నెపంతో నన్ను పక్కింటికి తీసుకెళ్లి “శుక్లాంబర ధరం’తో

మొదలుపెట్టి, 'ఇంతింతై వటుడింతై' అంటూ పోతనని పలకరించి, ఆ తరువాత పాద్యమి విదియ తదియలు, ప్రభవ విభవలు చెప్పించేది.

తెల్లవారుఝామున చెప్పిన పద్యాలు, చదివిన చదువులు, నందివర్ధనం చెట్టు మీద నుంచి రాలిపడిన మంచుబిందువులంత స్పష్టంగా గుర్తున్నాయి. అక్కడ తెలుగుతో పరిచయం అయ్యింది.

"నానమ్మా కథ చెప్పవూ" అనే మాటతోనే రాత్రుళ్లు మొదలయ్యేవి మాకు. రాజకుమారుడు, తెల్లగుర్రాలు, పూటకూళ్లపెద్దమ్మలు, కాశీమజిలీలు, భోజరాజు కథలు, విక్రమార్కుడు... నిద్ర... కథ..! వింటూ నిద్రపోతూ, కథల్లో తాగుతూ, కలల్లో కథని చూస్తూ, మనమే యువరాజులై గుర్రం పైన స్వారీ చేస్తూ వుంటే... ఇంతలో రాక్షసుడొస్తే పక్కనే ధైర్యం చెబుతూ నానమ్మ. కొంత వూహ తెలిసాక రామాయణం, మహాభారతం ఆ తరువాత ధృవుడు, ఇంకోరోజు హరిశ్చంద్రుడు... "లోహితా, లోహితా అంటూ హరిశ్చంద్రుడు ఎంత ఏడ్చాడోకానీ, నానమ్మ ఆ కథ చెప్పిన ప్రతిసారీ ఏడవడం ఒక ఆశ్చర్యకరమైన జ్ఞాపకం. కథతో, అందులో వుండాల్సిన ఎమోషన్‌తో తొలి పరిచయం.

ఆ తరువాత ఇంకేముంది – మనకి చదవటం వచ్చేసింది. పాఠ్య పుస్తకాలలో – మొక్కపాటి, పానుగంటి, జాషువా, కరుణశ్రీ, సర్ ఆర్థర్ కానన్ డాయల్, సోమర్ సెట్ మామ్, బయట పుస్తకాలలో – యండమూరి, మల్లాది, సూర్యదేవర, యద్దనపూడి వీళ్లందరూ పరిచయం అయ్యారు. వీళ్లందరినీ చదివి అవన్నీ చాలక కనపడ్డ పుస్తకమల్లా నమిలేస్తూ, నెమరేస్తూ – కిరాణా కొట్టులో కట్టిచ్చిన పొట్లాల కాగితంతో సహా చదివేసి తృప్తిగా తీరుబడిగా కూర్చున్నాక ఒక శుభముహూర్తాన శ్రీశ్రీ కనపడ్డాడు. ఆయన వెంట మొదలుపెట్టిన పరుగు 'కలం కల' అంటూ కవితై మయూరి వారపత్రికలో అచ్చైంది. ఆ తరువాత కథలు – 1995 తొలి కథ ఆంధ్రప్రభ ఆదివారం పత్రికలో దీపావళి కథలపోటీలో సాధారణ ప్రచురణ. అప్పుడే రైల్వే జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కథలపోటీలో మొదటి బహుమతి. తొలి అడుగులలో నాలుగు అచ్చు, పధ్నాలుగు రొచ్చు..!!

సాహితీవైద్యం కోసం వసుంధరగారికి రాయచ్చో రాయకూడదో అనుకుంటూ, ఒక రోజు ధైర్యం కూడగట్టుకొని 'ఈరేశంగాడి ముచ్చట' పంపించాను. 'కథాంశం బాగుంది. మీకంటూ ఒక శైలి ఏర్పడాలంటే మీరు ఎక్కువగా చదవా'లని వారి నుంచి ఉత్తరం. పెద్దల మాట చద్దన్నం మూట అని నాన్నమ్మ చెప్పిన మాట. అప్పుడే మరిన్ని పుస్తకాలు చదవాలని నిర్ణయించుకున్నాను!

అదే మొదలు. ఇట్నుంచి షిడ్నీ షెల్డన్, అగాథా క్రిస్టీ అట్నుంచి ముళ్లపూడి, కొకు, బుచ్చిబాబు, చలం... చదువుతున్న కొద్దీ కుంచించుకుపోయి, నేను రాసినవీ కథలేనా అని ఆ మహామహుల రచనలలో ఆవగింజంత స్థాయైనా అందుకునేదాకా రాయకూడదని ఆరేడు సంవత్సరాలు అజ్ఞాతవాసం. నేను రాసేది నాకు నచ్చేదాకా చదవటమే ఒక పని (ఇప్పటికీ కొనసాగుతోంది). గుజరాత్‌లో చదువులు ఆ తరువాత కార్పొరేట్ ఉద్యోగం. వూళ్లు తిప్పింది. కొత్త ప్రాంతాలు, కొత్త మనుషులు, కొత్త పుస్తకాలు... కొత్త కొత్త కథలు. ఇందోరులో వున్నప్పుడు ఉజ్జయిని మంచినీటి కటకట గురించి పేపర్లో చదివిన తరువాత మళ్లీ కలం కదిలింది. కొత్తగా పరిచయమైన టెక్నాలజీ సాయం తీసుకొని బ్లాగులు, అంతర్జాల పత్రికలకే పరిమితమై వుండిపోయాను.

ఆ తరువాత పరిచయమైన సాహితీ మిత్రులు వెన్ను తట్టి ప్రోత్సహించారు. బ్లాగుల్లో గుట్టుగా వున్న నన్ను అచ్చోసిన రచయితని చేశారు. వసుంధరగారిని మళ్లీ పలకరించాను. "మీ కథలకి ఇక సాహితీవైద్యం అవసరంలేదు. పుష్టిగా వున్నా"యన్నారు. పత్రికలో నా కథ వచ్చినప్పుడల్లా చదివి అభినందించారు. ఆశీర్వదించారు. ఆ ఆశీర్వాదం ఇచ్చిన ధైర్యమే ఈ పుస్తకానికి వాళ్లనే ముందుమాట అడిగేదాక తీసుకొచ్చింది. వారి వాత్సల్యానికి, ప్రోత్సాహానికి నా సగౌరవ నమస్సులు.

చివరిగా ఒక్క మాట – ఇదంతా సోత్కర్షలా వుంటుందని తెలిసినా చెప్పే ధైర్యం చేశాను. చెప్పాల్సిన అవసరం వుందనిపించింది కాబట్టే ఆ సాహసం.

తెలుగు భాషని మరుగుపరుస్తున్నారన్న అపవాదు మోసే తరంలో వాడిని నేను. ఆంగ్ల మాధ్యమంలో చదువులు, కార్పొరేట్ వుద్యోగాల పరుగుల మధ్యలో తెలుగు భాషాభిమానాన్ని, సాహితీ ఆసక్తిని సజీవంగా వుంచుకోవచ్చని చెప్పడానికి నేను ఒక చిన్న ఉదాహరణ మాత్రమే. నాలాంటివారు ఎందరో వున్నారు. తెలుగు భాష అంతరించిపోతోందని బాధపడటం వల్ల ప్రయోజనం లేదు. మనప్రయత్నం మానకూడదు. రేపటి తరానికి రెండు కథలు, నాలుగు పద్యాలు, కాసిన్ని సామెతలు చెప్పి తెలుగు భాషని రుచి చూపించండి. ఆ తరువాత పఠనాసక్తిని కలిగించి వదిలిపెట్టండి. ఏ మాధ్యమంలో చదివినా, జీవనానికి మరే భాష అవసరం అయినా తెలుగు మీద మక్కువ ఎక్కడికి పోదు. అందుకు నేనే సాక్ష్యమని చెప్పడానికే ఈ ముందుమాట.

భవదీయుడు

అరిపిరాల సత్యప్రసాద్

నెనర్లు

- అక్షరాక్షతలతో ఆశీర్వదించిన బొమ్మల దేవుడు
  శ్రీ బాపుగారికి నమస్సులు
- నా కథలను ప్రచురించిన –
  వసంతలక్ష్మి, జగన్నాధశర్మ, పూడూరిరాజిరెడ్డి, 'రచన' శాయి,
  యజ్ఞప్రసాద్, కిరణ్‌ప్రభలకు, ఇతర సంపాదకులకు కృతజ్ఞతలు.
- ఎప్పటికప్పుడు నన్ను అభినందిస్తూ వెన్నుదన్నుగా నిలుస్తున్న–
  వసుంధర, విహారి, ఖదీర్‌బాబు, వేంపల్లి షరీఫ్, అరుణపప్పు, కస్తూరి
  మరళీకృష్ణ, సాయి బ్రహ్మానందం గొర్తి, జి.ఆర్.మహర్షి, కుప్పిలి
  పద్మ, అఫ్సర్‌లకు ధన్యవాదాలు
- కథల ఎంపికలో సహకరించిన – వెంకట్ సిద్దారెడ్డికి
- ఊహాచిత్రాన్ని స్నేహమనే రంగుతో వేసిన – అన్వర్‌కి
- బ్లాగానుబంధం నుంచి కథానుబంధం దాకా ప్రోత్సహించిన –
  ఎస్. నారాయణస్వామికి
  నెనర్లు.
- అక్షర దోషాలు సవరించిన టి.చంద్రశేఖరరావుకి ధన్యవాదాలు
- ఈ పుస్తకం రూపొందడంలో సహకరించిన మల్లేష్‌కు, ముద్రించిన
  అనుపమ ప్రింటర్స్ వారికి, ధన్యవాదాలు
- తొలి శ్రోత, అర్ధాంగి శ్రీలక్ష్మికి
- తొలి విమర్శకులు నాన్న అరిపిరాల రామ్మోహనశర్మగారికి, చెల్లెలు
  ప్రశాంతికి కుటుంబ సభ్యులకు శుభాభినందనలు
- అల్లరితో నన్ను ఎక్కువ రాయనివ్వకుండా చేసి, పరోక్షంగా మంచి
  కథలు మాత్రమే రాసేలా చేస్తున్న పిల్లలు నవమౌక్తికకు, ఆదివేద్‌కు
  ఆశీస్సులు...

స్వప్న శేషం

ఏ అర్ధరాత్రో మెలకువ వచ్చినప్పుడు

చిక్కని చీకటిలో జారిపోయిన కలని నేను...

పూర్తికాని స్వప్న శేషాన్ని వెతుక్కుంటూ

ఆశను మోస్తూ తిరుగుతున్న గాలిపాటని...

"ఏం చేస్తున్నావ్?" అడిగింది దివ్య. తపస్సు చెదిరిన మహాఋషిలా నేను. సమాధానం ఇవ్వాలా వద్దా?

"మళ్లీ కవిత్వమా? పడుకోరాదూ... రెండు దాటింది"

"ఊఁ" అన్నాను. లైటాపాను. నిద్రకి మెలకువకి మధ్య ప్రపంచంలో కేలండర్ ఒక గడిలోంచి ఇంకో గడిలోకి ప్రయాణం.

పరుగెడుతున్నాను. ఇంకా వేగంగా... గసపెడుతూ ఆయాసపడుతూ... ఇంకా ఇంకా... పరుగు... పరుగు...

తరుముతున్నది ఎవరో.... చేరాల్సింది ఎక్కడికో... ఏదీ తెలియని పరుగు. హైవేలో వెళ్తూ హారన్ కొడితే చెల్లా చెదరై పరుగెత్తిన గొర్రెల గుంపులో నేనూ ఒకణ్ణి... ఏ గుట్టచాటుకో తప్పించుకొని పోయిన గొర్రెపిల్లను వెతుక్కుంటూ పిచ్చిగా అరుస్తున్న కాపరిని... అంతం ఎక్కడో తెలియని తారోడ్డుని... చీకటి సొరంగంలో నిధులున్నాయని పరుగెత్తి పరుగెత్తి చివరికి అది సొరంగం కాదని గబ్బిలాల గుహ అని తెలుసుకొని వెనక్కి దారి వెతుక్కుంటున్న అభిమన్యుణ్ణి...

"ఆగద్దు... ఆగద్దు... ఆగితే నువ్వే మిగలవు... అభిమన్యుడిలా అంతం అయిపోతావు... పరుగెత్తు... పెరుగెత్తు... ఇంకా స్పీడుగా" దివ్య అరుస్తోంది.

ఆమె చుట్టూ గబ్బిలాలు తిరుగుతున్నాయి. నల్లటి చీకటి ఆమెను మింగేస్తోంది. క్రమంగా చీకట్లోకి కలిసిపోయిన దివ్య స్థానంలో చిన్న వెలుగు రేఖ. అది క్రమంగా విస్తరించి భయంకరమైన తెలుపు రంగుగా మారి సూదుల్లా వచ్చి కళ్లలో పొడుస్తుంటే...

మెలకువ వచ్చింది...!

"గుడ్ మార్నింగ్... కాఫీ తాగుతావా?" దివ్య నన్నే చూస్తూ అడిగింది. తలాడించాను.

రుచీ పచీ లేని బ్రేక్ ఫాస్ట్. అట్టముక్కల మధ్య నలిగిపోయిన ఫ్రూట్ జ్యూస్. తినక తప్పదు కదా..!

"ఏదన్నా మాల్‌కి వెళ్దామా" దివ్య అడిగింది.

"ఎందుకు? ఏమన్నా కొనాలా?"

"కొనడానికే వెళ్లాలా?... సరదాగా.."

"ఒద్దు... నాకు నచ్చదు..."

"ఏం నచ్చదు?" కోపం ఆమె గొంతులో.

"ఆ మాల్ తుడిచే ముసలాడు... గేటు బయట బుడగలమ్మే మాసిన బట్టల పిల్లాడు.. చినిగిపోయిన బట్టల్ని యూనిఫార్మ్‌తో కప్పుకునే సెక్యూరిటీ గార్డ్..."

"వాళ్లని ఎందుకు చూస్తావు?"

"ఏం చెయ్యమంటావు... వాళ్ల కాళ్ల కింద ఉండే భూమి ఒకప్పుడు వాళ్ల సొంతమేమో అనిపిస్తుంటుంది... మాల్ పేరుతో ఆక్రమించిన రియల్ ఎస్టేట్ దురాశకి వాళ్లంతా మూగ సాక్షుల్లా కనిపిస్తారు నాకు..."

"అవన్నీ కాదు... రంగు రంగుల ప్రపంచాన్ని చూడు... ప్రపంచం మొత్తం వడ్డించే రకరకాల ఆహారాన్ని చూడు..."

"ప్చ్.. నీకు పిజ్జా తెచ్చి సర్వ్ చేసే కుర్రాడు... ఆ హోటల్ వెనక పారేసిన ఉల్లితొక్కల మధ్య కూర్చోని ఇంటి నుంచి తెచ్చుకున్న చద్దన్నం తింటాడు తెలుసా?"

"నీతో వాదించలేను... పోనీ మల్టీప్లెక్స్...?"

"తెరలాగేవాడి జీవితానికి తెరదించేసిన ఏసీ రాక్షసి..."

"ఇంకేం చేద్దాం? వీకెండ్ రెండు రోజులు..."

"బతుకుదాం.."

"వస్తావా రావా?"

ఏం చెప్పాలి? ఇద్దర్లో ఒకరన్నా సంతోషంగా వుండచ్చు కదా? వస్తానన్నాను.

వీకెండ్ రంగులరాట్నం రెండు రోజులు తిరిగింది. తెల్లవారితే ఫార్మల్ బట్టలు. క్లీన్ షేవ్... టై... బూట్లు... పరుగు ప్రారంభం... చెరో దిక్కుకు...

"దించడం నా వల్ల కాదు... నువ్వు ఆటోలో వెళ్లిపో" చెప్పాను.

"ఈవినింగ్ కాన్ఫరెన్స్ వుంది. రాత్రికి లేటౌతుంది... హోటల్ నుంచి ఏమన్నా తెచ్చి వుంచుతావా?" అడిగింది హడావిడిలో మాటలు వదులుతూ.

"నాక్కూడా క్లైంట్ మీటింగ్ వుంది..."

"సర్లే... క్యాంటీన్‌లో ఏదో ఒకటి తినేస్తాలే... మరీ నువ్వు.."

"నేనూ అంతే..."

విడిపోతాం... కాదు కాదు... విడిపోయే ముందు యాంత్రికంగా పెట్టుకున్న ముద్దు బుగ్గలపైన మరకలుగా మాత్రమే మిగులుతుంది. ఆ తరువాత ఉద్యోగం బరువు లాప్‌టాప్‌గా మారి భుజానికి ఎక్కుతుంది.

ఎండిపోయిన కొమ్మ మీద నుంచి పంజరంలోకి వలసెళ్లిన పిట్టలమౌతాం. క్యూబికల్ జైల్లో కఠిన కారాగార శిక్ష... పరుగు... పరుగు... పరుగు...

"సార్ దిగండి..." ఆటోవాడు తట్టి లేపాడు. ఎదురుగా అద్దాల మేడ... మేడ మొత్తం గదులు... గది గదికి తలుపు. ఏ తలుపు తెరిస్తే రాకుమారి దొరుకుతుందో అని వెతికి వెతికి...

లిఫ్ట్‌లో పైకి కిందకి... కిందకి పైకి... మెట్లెక్కి... మెట్లు దిగి...

ఫాల్స్ సీలింగ్‌లో నించి పొడుచుకొచ్చిన వెలుగు చుక్కలు రాలిపడేదాకా...!!

"మిస్టర్ అనిల్... ఏం ఆలోచిస్తున్నారు?" రాకుమారిని బంధించిన మాయలఫకీర్ గొంతు.

"ఏం లేదు సార్..."

"ఆర్ యూ లాస్ట్ సమ్‌వేర్...??"

యామ్ ఐ లాస్ట్? ఆర్ డిడ్ ఐ లూస్ సమ్‌థింగ్...??? సమాధానం వెతుక్కోవాలే తప్ప ప్రశ్నలు అడగకూడదు.

"సారీ సార్..."

❖ ❖ ❖

"ఏంట్రా ఎప్పుడూ ఆలోచిస్తుంటావు?" ఒక స్నేహితుడు మెషిన్ కాఫీ తాగుతూ అడిగాడు.

"సమాధానం వెతుక్కోవాలే తప్ప ప్రశ్నలు అడగకూడదు..." చెప్పాను.

"ఇంకా కవిత్వం రాస్తున్నావా?"

"ఇంకా రాయడమేమిటి? కవిత్వం ప్రవాహం... మధ్యలో ఆగేందుకు అవకాశమే లేదు.."

"ఐ యాం సర్‌ప్రైజ్డ్... ఇంత భావుకత్వంతో ఈ కార్పొరేట్ ప్రపంచంలో ఎలా బతుకుతున్నావు రా?"

నేనొక వారధిని... శిథిలమైన వారధిని... జీవితానికి చావుకు మధ్య పరుచుకున్న కవిత్వాన్ని... ఐదు రోజుల పోరాటాన్ని... కొసమెరుపులా మెరిసే వారాంతపు భావుకుణ్ణి...!!

"ఏంటి మళ్లీ ఆలోచిస్తున్నావు?"

"ఏం లేదు... ఒక కాగితం ఇస్తావా?"

❖ ❖ ❖

బట్టలు కొంటున్నారు.

ఫాస్ట్ ఫుడ్ ఫాస్ట్ ఫాస్ట్‌గా కొంటున్నారు.

భూములు కొంటున్నారు.

గాలిలోకి లేచిన చిరునామాలు...

డూప్లే ఇళ్లకీ, పొడుగైన కార్లకీ నెల నెలా కరిగిపోయే సంపాదనలు...

అందమైన యక్షిణి మాయలో చిక్కుకున్న రాకుమారులు...

ఇక మిగిలింది నా లాంటి పిచ్చివాళ్లు...

అవును...

ఫైన్ ఆర్ట్స్ మర్చిపోయి ఎకనామిక్స్ మాత్రమే బోధించే జీవితపు విశ్వవిద్యాలయంలో భావుకత్వం ఇక భ్రమ.

భావుకుడు ఒక పిచ్చివాడు.

❖ ❖ ❖

"నీకేమైనా పిచ్చి పట్టిందా?" దివ్య అనే ఒక ఆడగొంతు.

"ఏం?"

"ఇప్పుడు మనకి పిల్లలు అవసరమా?" ఇప్పుడా గొంతులో ఆడతనం లేదు.

"అవసరానికి కంటామా?"

"నీ కవిత్వం వినే ఓపిక నాకు లేదు... ఇప్పుడిప్పుడు కెరీర్ దారిలో పడింది. ఈ పరిస్థితిలో మనకి ఇదంతా బర్డన్... నా వల్ల కాదు... ప్లీజ్ అర్థం చేసుకో..."

అర్థం చేసుకో...

ఎలా అర్థం చేసుకోమంటావు?

ఒక్క ఇంక్రిమెంట్ కోసం వద్దనుకున్న శిశువు

రేప్పొద్దున్న కలలో కనిపించి నిర్దయగా నన్ను చూసి నవ్వితే

సమాధానం నువ్వు చెప్తావా?

నా కలలోకి నువ్వు వస్తావా?

"నాకు ఈ పిల్స్ తెచ్చిపెట్టు... నేను చూసుకుంటాను..."

బయటెక్కడో గొడ్డలి ఆఖరి దెబ్బకి మహావృక్షం ఒకటి నేలకొరిగిన చప్పుడు...

❖ ❖ ❖

"ఈ నెల జీతం ఎక్కువ వచ్చినట్లుంది?" దివ్య అడిగింది.

"సేలరీ పెరిగింది..."

"అదే ఎందుకు?"

"ప్రమోషన్..."

"వాట్... నిజమా? చెప్పనేలేదు..."

"ఏముంది చెప్పడానికి. బానిస పోస్ట్ నుంచి సీనియర్ బానిస పోస్టుకు, అక్కడ్నుంచి ఇప్పుడు హెడ్ బానిస పోస్టుకు వచ్చాను... రేపెప్పుడో ఛీఫ్ బానిస పోస్టు కూడా ఇస్తారు..."

"ఓహ్... స్టాపిట్... ఎందుకలా మాట్లాడతావు?"

"నాకు నచ్చే ప్రపంచం... నేనుండే ప్రపంచం ఒకటే కానప్పుడు మాటలు ఇలాగే రాలిపడతాయి..."

"వాట్ ఆర్ యూ అప్సూ..? ఏం చేద్దామని?"

సమాధానం లేదు.. వెతకాలి.

వెనక్కి పరుగెత్తే అవకాశం వుందా?

బూటకపు అప్పర్ మిడిల్ క్లాస్ నుంచి నిజమైన మిడిల్ క్లాస్‌లోకి

జనరల్ కంపార్ట్‌మెంట్‌లో ఖాళీలు వున్నాయా?

గొడ్లచావిడి పక్కన వేపచెట్టు.

నులకమంచం మీద పడుకొని వివిధ భారతి వింటూ... అచ్చం మా నాన్న లాగా...

డబ్బులతో సంబంధంలేని అమ్మ చిరునవ్వు దివ్య ముఖంలో విరుస్తుందా?

"ఆలోచనలు ఆపండి సారూ... యూ నీడ్ ఏ బ్రేక్... ఎక్కడికన్నా వెళ్దామా? గోవా? బ్యాంకాక్..? నువ్వు కార్పొరేట్ ప్రపంచాన్ని తిట్టుకుంటావు కానీ, చూడు ఫ్యామిలీతో గడపమని పదిరోజుల కంపల్సరీ లీవ్ ఇస్తున్నారు మా ఆఫీస్‌లో...."

"హ... హ.... అలా అర్థం అయ్యిందా నీకు... నువ్వు లేకపోయినా కంపెనీ నడవాలని నీకు శెలవ ఇస్తున్నారు. రేప్పొద్దున నీ చేతిలో పింక్ స్లిప్ పెట్టాలనుకున్నప్పుడు వరసలో మరో బలిపశువుని సిద్ధం చేసే మహా మాయ ఇది..."

"యు ఆర్ సిక్ ఐ సే.." దివ్య చిరాకు పడింది.

గోవాకి టికెట్లు బుక్ అయ్యాయి. రెండు నెలల జీతాన్ని క్రెడిట్ కార్డ్ మింగేసింది.

తిరిగి వచ్చాక కథ పునరావృతం...

పరుగు... పరుగు... పరుగు...

"ఒక్కసారి ఆగుతాను..." అరిచాను...

"నీకేమన్నా పిచ్చా... ఆగావంటే ముందుకు పడతావు... నువ్వు పరుగెత్తేది ట్రెడ్ మిల్ పైన..."

కిందకి చూసుకున్నాను.

అవును నిజమే... నేను ఇన్ని రోజుల్నుంచి పరుగెత్తుతున్నది ట్రెడ్ మిల్ మీద. కాదు... కాదు... నేను పరుగెత్తడంలేదు... నా కాళ్ల కింద బెల్ట్ పరుగెడుతోంది.... పడిపోకుండా నిలబడటానికి చేసే ప్రయత్నాన్ని నేను పరుగనుకుంటున్నాను... అలా ఎంత పరుగెత్తినా అక్కడే వుంటాను... ముందుకు తీసుకెళ్లే పరుగు కాదిది...!!

"దివ్యా... ఈ ట్రెడ్ మిల్ ఎలా ఆఫ్ చెయ్యాలి?"

"ఆఫ్ బటన్ లేదు దీనికి... ఇంకొంచెం సేపు పరుగెత్తి..."

"అలిసిపోయాను... చెమటలు పడుతున్నాయి... ఆపేస్తాను... ప్లీజ్..."

"పరుగెత్తు.... పరుగెత్తు..."

నేను ఆగిపోయాను... ధబ్బున పడిపోయాను... మంచం మీద నుంచి..! కల మిగిలిపోయింది.

❖ ❖ ❖

"అనిల్ రిజైన్ చేశాడు" క్షణాల్లో ఆఫీస్ మొత్తం గుప్పుమన్న వార్త.

ఆ పని అనుకున్నంత కష్టమేమీ కాదు. ఆఫీసులో కొన్ని కాగితాల మీద సంతకం నా మెడకు బిగించిన బానిస పతకం ముడి విప్పడం, బరువెక్కి భుజాన కూర్చున్న లాప్ టాప్‌ని వదిలించుకోవడం. అంతే!

తోటి సైనికుడు చనిపోతే కనీసం అటు వైపు చూడనైనా చూడకుండా యుద్ధంలోకి పరుగెత్తే సైనికుల్లా కొలీగ్స్.

అద్దాల మేడలో రాకుమారి వుండదురా అని అరవాలనిపించింది. అంతలోనే అవసరం లేదనిపించింది. ఉపయోగం వుండదనిపించింది.

దివ్యకి మాత్రం కోపం వచ్చింది.

"నీ ఇష్టం వచ్చినట్లు చేసుకో..." అరిచింది గట్టిగా...

"అదే చేద్దామనుకుంటున్నాను..." చెప్పాను.

"అదే ఏంటది?"

"ఒక కాలేజీలో లెక్చరర్‌గా చేరుతున్నాను. కవిత్వం రాయాలనుకుంటున్నాను... అమృతం కురిసిన రాత్రి వందసార్లు చదవాలనుకుంటున్నాను.... పాటగా మళ్లీ పుట్టాలనుకుంటున్నాను... ఇంకా..."

తీక్షణంగా చూపులతో పొడిచి వెళ్లిపోయింది.

ఒక్కడినే ఇంట్లో... ఇల్లూ ఒంటరిదే... మనస్ఫూర్తిగా నవ్వుకున్నాను.

ఇప్పుడు నేను...

ఆకులు రాలిపోయి ఎండిన చెట్ల మధ్యలో నిలబడి...

పచ్చటి వసంతాన్ని ఆవాహన చేస్తున్నాను.

(ఆదివారం ఆంధ్రజ్యోతి 24 ఫిబ్రవరి 2013)

తుది బంధం

"ఎలా చెప్తే అర్థం అవుతుంది మీకు..." ఈ మాట ఎన్నిసార్లు అన్నానో నాకే గుర్తులేదు. ఎన్నిసార్లు అన్నా ఎలా చెప్తే ఈయనకి అర్థం అవుతుందో నాకు అర్థం కాలేదు. ఎలా చెప్పినా కొన్ని విషయాలు మగవాళ్ళకి అర్థం కావు, అంతే. "నేను మా వూరు వెళ్లి వస్తాను..." చెప్పాను ఆ రోజు సాయంత్రం.

"ఎందుకు అనవసర ఖర్చులు... మీ అన్నయ్య వాళ్ళే హైదరాబాద్ మారిపోతున్నారు కదా... వాళ్ళు వచ్చిన తరువాత ఒకసారి కలిస్తే సరిపోదూ.." అన్నాడు మోహన్.

"అన్నయ్య వస్తున్నాడనే నా బాధ.. అసలు అందుకే వెళ్ళాలి" అని చెప్దామనుకున్నాను. అలా చెప్తే అర్థం కాదు. ఎలా చెప్తే అర్థం అవుతుంది అని ఆలోచించినా నాకు ఏ ఆలోచనా రాలేదు.

"నేను వెళ్ళాలి అంతే.." అన్నాను గట్టిగా.

"సరే వెళ్దువులే... దానికి ఎందుకంత కోపం.." అన్నాడు పేపర్ చదువుతూ. నాది నిజంగా కోపమే అయితే ఇలా పేపర్ చదువుతూ సమాధానం చెప్పేవాడా? అసలు కోపంగా అనడానికి, స్థిరంగా అనడానికి చాలా తేడా లేదూ?.

అగ్రెషన్‌కి ఆస్సెర్షన్ కీ తేడా లేదూ...?

"ఎప్పుడు వెళ్ళను?" అని మాత్రం అన్నాను.

"అది కూడా ఏదో అనుకొనే వుంటావుగా... అదీ నువ్వే చెప్పు.." ఆ గొంతులో నాకు అలవాటైన వెటకారం. అందుకే ఆ వెటకారానికి నేను స్పందించను. స్పందించకూడదు అని కూడా అనుకుంటూ వుంటాను. కానీ అంతలోనే నా గొంతులో నుంచి మాటలు దొర్లుకొస్తాయి–

"అవును... నువ్వే అంటావుగా దేనికైనా ప్లానింగ్ అవసరమనీ..." చివర్లో దీర్ఘం తీస్తున్నప్పుడు మాటకి ప్రతిమాట చెప్పానని గుర్తొస్తుంది. నా మాటలు ఆగిపోతాయి. అతని చూపులు నాలో దిగబడతాయి.

"విసిగించకుండా విషయం చెప్పు..." అంటాడు విసిగిపోయిన ముఖం పెట్టి. ఒక్క మాటకి విసిగిపోయిన ముఖాలే ఇట్లా వుంటే, సంవత్సరాల తరబడి విసుగుని భరించే ముఖాలు ఇంకెంత ఛెండాలంగా వుండాలి? మరి నా ముఖం అలా వుండదే?

"సరే వచ్చే బుధవారం వెళ్తున్నాను... రెండు రోజులు వుంటాను. పిల్లల్ని ఇక్కడే వదిలి వెళ్తున్నాను. సత్తెమ్మకి రోజు రమ్మనమనీ, మీకూ పిల్లలకీ బాక్స్ పెట్టమనీ చెప్పాను... గ్యాస్ వస్తుంది పెట్టించండి..." గడగడా చెప్పేశాను. ఆయన దగ్గర్నుంచి సమాధానం రాదు. తల పేపర్లో నుంచి తీసి–

"ఏంటి.. ఏం చెప్పావు?".. అన్నాడు. మళ్ళీ చెప్పాలా వద్దా?

చెప్పలేదు.

❖ ❖ ❖

బస్సు బయల్దేరింది. చీకటి గుహలోనుంచి బయటపడ్డ చిలకల రెక్కల్లా నా చీర చెంగు గాలిలోకి ఎగురుతోంది. ఏ.సీ. గదిలో నుంచి, ప్రకృతి వడిలోకి పరిగెత్తుతున్నట్లు వీస్తోంది గాలి. దారం తెగిన గాలిపటంలా రెపరెపలాడుతున్న జుట్టు.

కిటికీ పక్కన సీటు.

ఎప్పుడూ అన్నయ్య సొంత ఆస్థిలా ఆక్రమించిన స్థలం. స్కూల్ బస్‌లో బడికి వెళ్ళినంతకాలం. నాకు కాకుండా పోయిన నా ఇష్టమైన స్థలం. వాడు నాకు అన్నయ్య కాకుండా వుంటే? తమ్ముడై వుంటే? ఈ సీటు మీద ముందు నేనే అధికారం చెలాయించేదానినా?

నాన్న మాత్రం – "పోనీలేమ్మా ఆ కిటికీ పక్కన కూర్చుంటే నీ జుట్టంతా గాలి ఎగిరిపోయి చిక్కుపడిపోతుంది... ఎంచక్కా ఈ పక్కనే కూర్చుంటే బాగుంటుంది.." అంటుంటేవాడు. నాకు అలా గాలికి ఎగిరే జుట్టే ఇష్టమని చెప్దామని అనుకున్నాను. ఎలా చెప్తే నాన్నకి అర్థం అవుతుందో తెలియక అసలు చెప్పనే లేదు. ఎప్పటికైనా బస్సులకి మినిష్టర్‌ని అయ్యి, కిటికీ పక్కన సీట్లన్నీ అమ్మాయిలకే అని ప్రకటించేయాలని బలంగా అనుకునేదాన్ని. కోరుకునేదాన్ని. వేడుకునేదాన్ని.

నవ్వు వస్తుంది తల్చుకుంటే...!

ఆ తరువాత అన్నయ్యకి బస్సులో కిటికీ సీటు మీద మోజు పోయి, సైకిల్ మీద ఇష్టం మొదలైంది. నాకు సైకిల్ అంటే అసహ్యం. ఇంతవరకూ నేను సైకిల్ ఎక్కనేలేదు. అది తొక్కుతుంటే ఆయాసం వచ్చి, కాళ్ళ నొప్పులు కూడా వస్తాయట కదా? ఈ మాటే అన్నయ్యని అడిగితే – "అందని ద్రాక్షపళ్ళు పుల్లన.." అంటూ నవ్వేశాడు. అవును నాకు అందని ద్రాక్షలు పులుపే. పులుపు మాత్రమే కాదు చేదు కూడా..!!

ఇష్టం లేనివి తల్చుకోవడం కన్నా పేపరు మేలని రెండు పేజీలు తిప్పానో లేదో మా వూరు వచ్చేసింది.

❖ ❖ ❖

"ఏమ్మా రాజ్యం? కులాసాగా వున్నావా? బావగారు బాగున్నారా?" అడిగాడు అన్నయ్య నన్ను చూస్తూనే.

"బాగున్నాం అన్నయ్యా..." అన్నాను లోపలికి అడుగుపెడుతూ. వదిన ఎదురొచ్చి చేతిలో బ్యాగ్ తీసుకుంది.

"ఏంటి విశేషాలు.." అడిగింది వదిన.

"అవ్వాల్సిన రెండు విశేషాలు అయినాయి కదా... ఇంక అంతకన్నా మా సంసారంలో విశేషాలు ఏముంటాయి...?" చెప్పాను నేను. వదిన నవ్వేసి "భలే పిల్లవే".. అంటూ వంటింటిలో టీ పొడిమీద యుద్ధానికి పోయింది.

నేను ఇల్లు మొత్తం పరికించి చూసాను. ఎలా వుండేదో అలాగే వుంది కానీ అక్కడక్కడా పెచ్చులూడిపోయాయి. అప్పుడెప్పుడో నా పెళ్ళికి అన్నయ్య కొట్టించిన సున్నం అది. మా సంసారంలోనే పెచ్చులూడుతున్నాయి, సున్నం ఎంతసేపు అనుకున్నాను నేను. చెక్కతలుపులు మాత్రం అలాగే వున్నాయి.

ఇంటి పెరట్లో బాదంచెట్టు, మామిడిచెట్టు అలాగే పాతుకుపోయి వున్నాయి. మామిడి పూత పూయటమే తప్ప కాయ కాయటం లేదని రెండేళ్ళుగా అన్నయ్య వంక పెడుతున్నాడు. అంచేత ఆ చెట్టును కొట్టేయాలని ఆయన అభిప్రాయం. ఇంతకు ముందు, పడకగది చిన్నదిగా వుందని వెనకాల మూడడుగులు పెంచినప్పుడు రెండు కొబ్బరి చెట్లు కొట్టించేశాడు. ఆ చెట్లతో పాటే ఎన్ని జ్ఞాపకాలు కూలిపోయాయో... కొబ్బరి ఆకులతో చేసి వూదుకున్న పీకలు, రెండు చెట్ల మధ్య ఆడిన తొక్కుడుబిళ్ళ, లేత కొబ్బరి నీళ్ళు...!!

బెడ్ రూం బాగానే పెరిగింది కానీ, ఇల్లు స్వరూపమే మారిపోయింది. కట్టుడు పళ్ళు, కొయ్య కాళ్ళు పెట్టించుకున్న ముసలమ్మలా తయారైంది. అందుకే నాకు కోపం వచ్చింది

"ఈ సారి ఇంటికి ఏ మార్పు చేసినా నాకు చెప్పి చెయ్యి అన్నయ్యా.." అన్నాను నేను.

"ఎప్పుడో తాతలనాటి ఇల్లు... ఇంకా ఏముందమ్మా ఈ ఇంటిలో..." అంటాడు అన్నయ్య.

"ఎలా చెప్తే అర్థం అవుతుంది...!!" అనుకున్నాను తప్ప చెప్పలేకపోయాను.

❖ ❖ ❖

'ఇల్లు అమ్మక తప్పేటట్టు లేదు..." అన్నాడు అంతకు వారం రోజుల ముందు ఫోన్‌లో. బేరం కూడా కుదిరింది... అపార్ట్‌మెంట్ కడతారట... అరవై ఇచ్చి నాలుగు ఫ్లాట్లు కూడా ఇస్తామంటున్నారు... పిల్లలిద్దరికి చెరొకటి ఇచ్చి, ఒకటి అద్దెకి ఇచ్చుకున్నా... పిల్ల పెళ్ళి ఖర్చులకి ఇంకొకటి అందివస్తుంది.... అన్నట్టు సంబంధం కూడా కుదిరేట్టే వుంది చెప్పాడు.

పెళ్ళి కుదిరింది. బేరం కుదిరింది.

ఇంక ఏం చెప్పాలి నేను. ఆ ఇల్లు అమ్మొద్దని చెప్పొద్దు మరి పెళ్ళికి డబ్బుల సంగతి అంటాడు. వుండటానికి అత్తగారింట్లో కోట్లు వున్నాయి, కానీ అవి ఆయన కష్టార్జితం.. పోనీ ఆ ఇల్లు నిలుపుకుందామా అంటే అది అన్నయ్య పిత్రార్జితం. నా దగ్గర ఏముందని నిలుపుకోగలను.

"నేను హైదరాబాద్ వస్తున్నాను... కాగితాలు తీసుకొస్తాను నువ్వు కూడా సంతకం పెడితే.." అన్నాడు.

"వద్దు... నేనే వస్తాను.." ఫోన్ పెట్టేసాను..

❖ ❖ ❖

వీధి గుమ్మానికి ఆనుకొని వున్న అరుగులపైన కూర్చుంటే అమ్మ వళ్ళో కూర్చున్నంత హాయిగా వుంది. చిరు చీకట్లు కమ్ముకుంటుండగా వీధి వెంట గొడ్లను అడవి నుంచి ఇంటికి తీసుకెళ్తున్న గోపయ్య వచ్చి రేగికాయలు, కలేకాయలు చేతిలో పెట్టాడు.

అన్నయ్య అసహనంగా వున్న సంగతి మధ్యాహ్నం నుంచీ తెలుస్తూనే వుంది. కారణం తెలుసుకోవాలనిపించలేదు. కొంత చీకటి పడేదాకా ఆగి-"ఇంక చాలు రా... చీకటి పడుతోంది..." అన్నాడు లోపలి నుంచే.

"ఫర్యాలేదులే అన్నయ్యా... ఇక్కడ చాలా బాగుంది" అన్నాను మిణుగురు పురుగులను చూస్తూ. అన్నయ్యే బయటికి వచ్చాడు.

"ఏమిటి విషయం" అన్నాడు నెమ్మదిగా.

"విషయం ఏముంది.. ఏమీ లేదు.."

"నేను వస్తానన్నాను కదా.. ఇంత హడావిడిగా రావాల్సిన పనేముంది..?" అడిగాడు జంకుతూ..

"భయపడద్దు అన్నయ్యా...ఈ ఇల్లు అమ్ముకునేందుకు నీకు అన్ని హక్కులూ వున్నాయి. నేనేం నీకు అడ్డం పడదామని రాలేదు.." చెప్పాను నేను. అన్నయ్య గట్టిగా నిట్టూర్చాడు.

"మరి ఇంకెందుకు వచ్చినట్టు?" మొహమాటంగా అడిగాడు.

"ఈ ఇంటికీ నాకూ చుట్టరికం వుందన్నయ్యా... ఈ ఇల్లే కాదు, ఈ వూరికీ నాకు కూడా ఒక అనుబంధం వుంది. ఇప్పుడు ఈ ఇల్లు నువ్వు అమ్మేస్తానంటే ఏదోగా వుంది.. అందుకే ఒక్కసారి చూసి పోదామని..." చెప్పాను నేను.

"భలేదానివే... దానికోసం ఇంత దూరం రావాలా? అయినా హైదరాబాద్‌లో నేను ఇల్లు తీసుకుంటున్నానుగా... అది మాత్రం నీ ఇల్లు కాదూ.. ఎప్పుడూ కావాలంటే అప్పుడు రా... నిన్ను కాదనేదెవరూ.." అన్నాడు.

ఎలా చెప్తే అర్థం అవుతుందీ అని ఆలోచించాను...

"ఈ ఇంటి ఆడపిల్లగా నాకు ఆస్థి హక్కు వుండచ్చు... కానీ అది కేవలం చట్టపరంగా మాత్రమే... మాకే అభ్యంతరాలు లేవని చెప్పమని మోహన్ అనేస్తాడు... నువ్వు ఇల్లు అమ్మేస్తావు.. నా హక్కు కేవలం కాగితాలపైన సంతకం మాత్రమే...

ఇది నేను పుట్టి పెరిగిన ఇల్లు... ఆ ఇంటికి వస్తే నాకు కలిగే ఆనందం నీకు తెలియదు. ఇల్లు అమ్మేయటం అనే ఒక్క నెపంతో ఆ ఆనందాన్ని నాకు కాకుండా చేస్తావు... పుట్టింటికి వెళ్ళడం అనే సాకుతో వచ్చి నేను నడచిన నేలని, నేను పెంచిన చెట్టుని అప్పుడప్పుడు చూసుకునే అవకాశం లేకుండా చేస్తావు... నీకు తెలియదన్నయ్యా ఈ ఇల్లు నాకూ నా జ్ఞాపకాలకీ మధ్య వున్న తుది బంధం... అది తెగిపోతోందనే నా బాధంతా...!!"

ఇదంతా చెప్పాలని వుంది. చెప్తే అర్థం అవుతుందో లేదో...!! ఆలోచిస్తూ వుండిపోయాను.

(నవ్య, 13 జూన్ 2012)

(స్త్రీవాద పత్రిక భూమిక, అక్టోబర్ 2012)

ఐదు వందల రూపాయల నోటు

"హైద్రాబాద్.. హైద్రాబాద్.." అరుస్తున్నారు బస్సు డ్రైవర్లు. ఒకప్పుడు ఎవరు ఎక్కారో లేదో సంబంధం లేకుండా వుండే ఆర్టీసీ వుద్యోగుల్లో ఇలాంటి మార్పు అనివార్యమైపోయినట్టుంది.

"హైటెక్.. నాన్‌స్టాప్.. రండి సార్.. వెళ్ళిపోవడమే.." గుక్క తిప్పుకోకుండా అరుస్తున్నాడు అతను. పేరుకి ఖాకీ చొక్కా వేసుకున్నా అందులో ఆరింట నాలుగు గుండీలు పెట్టుకోలేదు. లోపల బనియను చెమటకి తడిసిపోయివుంది. అదే ప్రైవేటు బస్సు డ్రైవరైవుంటే ఇలా వుండేవాడా..? తెల్లగా తళతళలాడే చొక్కా వేసుకొని వుండేవాడేమో. అక్కడైతే అతని పని బస్సు నడపడమే, కానీ ఇక్కడ –బస్సు అద్దాలు తుడుచుకునే క్లీనర్, జనాలని పిలిచి ఎక్కించే ఏజెంటు, టికెట్లు కొట్టే కండక్టరు అన్నీ డ్రైవరే..

"ఎక్కండి సార్.." అన్నాడతను నన్ను చూసి. "మన బస్సే ముందు బైల్దేరుతుంది.." చెప్పాడు. ఈ పోటీ ప్రపంచంలో బస్సుల మధ్య కూడా పోటీనే..!

"హైద్రాబాద్‌కి ఒక టికెట్ ఇవ్వండి" అన్నాను అతని చేతిలో టికెట్ మెషీన్ చూసి.

టికెట్ ఇవ్వడం అలవాటు లేదేమో కొంచెం తడబడ్డాడు. చివరికి ఎలాగో టికెట్, చిల్లర తీసుకొని బస్సు ఎక్కి కండక్టర్ సీటు వెనకాల కిటికీ సీటులో కూర్చున్నాను. ఏదో మాట వరసకి చెప్పడమేకానీ కండక్టర్లే లేకపోతే కండక్టర్ సీటు ఎక్కడిది? నాతోపాటు మరో ఇద్దరు ఎక్కారు. ప్రేమ జంటో కొత్తగా పెళ్ళైన జంటో అయ్యుండాలి. అమ్మాయిని కూర్చోపెట్టి అతను మంచినీళ్ళు తెస్తానని ఒకసారి, కూల్‌డ్రింక్ తెస్తానని ఒకసారి కిందకి దిగాడు. దిగిన ప్రతిసారి ప్లాట్‌ఫారం మీద నిల్చున్న

డ్రైవర్ దగ్గరకు వెళ్ళి వెంటనే వచ్చేస్తానని చెప్పి ప్లాట్ ఫాం మొత్తం పరుగులు తీస్తున్నాడు. అతను అనవసరంగా కంగారు పడటమే కానీ, బస్సు ఇంకా కదలనే లేదు.

నాకన్నా ముందే మనవరాలితో బస్సు ఎక్కిన ముసలి జంట డ్రైవర్ వైపు రెండో వరసలో కూర్చున్నారు. మూడేళ్ళ పిల్ల.. పాపం ఆ ఉక్కపోతకి ఏడుపు అందుకుంది. ఆయన సీటు కింద నుంచి బ్యాగు లాగి అందులోనుంచి బిస్కెట్ పేకెట్ తీసి పాప చేతికిచ్చి బుజ్జగిస్తున్నాడు.

"ఏమిటండీ ఎంతకీ కదలదు.." అంటూ బస్సు గురించి అడిగిందామె.

"నాకు మాత్రం ఏమి తెలుసే.." అన్నాడాయన చిరాకుగా.

"ఇందాక ఆ డీలక్స్ దొరికినా బాగుండేది.. ఈ పాటికి కర్నూల్ దాటేసేవాళ్ళం." అన్నది ఆమె.

"తమరు రాణీ గారిలాగా నడుచుకుంటూ వస్తే బస్సు నీకోసం వుంటుంది.." నిష్టూరంగా అన్నాడాయన.

"నా మోకాళ్ళ నొప్పుల సంగతి మీకు తెలియదా.. అందుకే కొంచెం ముందే బయల్దేర్దామంటే వింటేనా?" ఆమె ప్రతి నిష్టూరమాడింది. జరగబోయే సంగతి అర్థం అయ్యిందనుకుంటా పాప మళ్ళీ ఏడుపు మొదలుపెట్టింది.

హైదరాబాద్‌లో ఏదో హాస్టల్‌లో వుంటూ చదువుకునే ఆడపిల్లలు నలుగురు ఎక్కారు. అందరూ ఒకే చోట వుండాలని నాలుగు వరసలు దాటి కొంచెం వెనగ్గా కూర్చున్నారు. కిటికీలోనించి ఈ విషయం చూసి ఒక తండ్రి అరిచాడు– "ఒక్కరవ్వ ముందుకెళ్ళి కూకోకూడదంటే.. మరీ టైరు పైన కూకుండావే?" అని.

"ఫర్లేదులే నాన్నా.. అందరం కలిసి వుంటే సేఫ్.." అంటూ "సేఫ్టీ" అనే బ్రహ్మాస్త్రం వదిలింది. అవతల తండ్రి ఏం మాట్లాడకుండా తల పంకించి టికెట్ కొనడానికి డ్రైవర్ దగ్గరకి వెళ్ళాడు. ఆడపిల్లలు ముసి ముసిగ నవ్వుకుంటున్నారు. మరో కుర్రాడు సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వచ్చి, వాళ్ళనే చూస్తూ, బ్యాగ్‌ని సీటుపైన కంపార్ట్‌మెంట్‌లో ఇరికించేందుకు కష్టపడుతున్నాడు.

అప్పటికే నేను ఎక్కి పావుగంట కావడంతో కొంచెం చికాకనిపించింది. కర్చీఫ్ సీట్లో వేసి కిందకి దిగాను. డ్రైవర్ దగ్గర టికెట్ల కోసం పది మందిదాకా వున్నారు. టికెట్లు కొట్టడం చేతకాక అతను ఇబ్బంది పడుతున్నట్లు వుంది. ఎంతలేదన్నా ఇంకో ఐదు

నిముషాలైనా పట్టేట్లుంది కదాని చెప్పి నేను అతనితో చెప్పకుండానే వెళ్ళి ఒక కూల్ డ్రింక్ తాగి ఏదో ఒక వారపత్రిక కొనుక్కొని తిరిగి వచ్చాను.

డ్రైవర్ దగ్గర జనం ఇంకా వున్నారు. సాయం కోసం వేరే బస్సు కండక్టర్‌ని పిలిపించుకొని టికెట్లు కొట్టిస్తున్నాడు. నేను బస్సు ఎక్కి నా సీట్లో కర్చీఫ్ తీసి కూర్చున్నాను. నేను కూర్చున్న సీటు వెనకాలే ఒక జంట కూర్చొని వుంది. వాళ్ళ పదేళ్ళ పిల్లాడు కిటికీ డోర్‌తో ఆటలు మొదలెట్టాడు. రెండుసార్లు నా మోచేతిని కిటికీతో పొడవడంతో నా చెయ్యి లోపలికి పెట్టుకోక తప్పలేదు. "చేతులు బయట పెట్టరాదు" అన్న ఆర్టీసీ సూక్తిని అమలుపరిచే బాధ్యత ఈ పిల్లాడు తీసుకున్నట్లున్నాడు.

"ఏమైనా మా అన్నయ్య బాగా ఘనంగా చేశాడు కదండీ పెళ్ళి.." అన్నది ఆ ఇల్లాలు.

"ఏడ్చాడు.. సొంత బావకి మర్యాద చెయ్యడం తెలియదు కాని ఘనంగా చేశాడట పెళ్ళి.." సన్నాయి నొక్కులు నొక్కాడు భర్త.

"ఊర్కే ఆడిపోసుకోవడం కాకపోతే మీకేం తక్కువ చేశాడండీ?" ఈ మాట అంటుంటే మరో మాటకి ఏడుపు వచ్చేట్లుంది ఆమె గొంతు.

"ఏం చేశాడా? నాకు పెట్టిన బట్టలు చూశావా? మనవాడి బారసాలకి మేనమామ అని ఎంత మంచి బట్టలు పెట్టాం? కనీసం ఆ కృతజ్ఞతైనా వుండద్దూ.." ఆయనింకా చెప్తూనే వున్నాడు. ఆమె గొంతు మాత్రం మళ్ళీ వినపడలేదు. చిన్నగా ఏడుస్తున్నట్లు వినిపిస్తోంది.

కింద ప్లాట్ ఫారం మీద గొడవ మొదలైంది. మనవరాలితో ఎక్కిన ముసలాయన, ప్రేమజంటలో కుర్రాడు డ్రైవర్‌తో గొడవ పెట్టుకున్నట్లున్నారు. నేను దిగి వాళ్ళ దగ్గరకు వెళ్ళాను.

"నాకు టికెట్లు కొట్టడం రాదు సార్.. అందుకే ఆలస్యమైంది.. ఇంక బయల్దేరడమే.." చెప్తున్నాడు.

"ఏమిటయ్యా బయల్దేరేది. మేం టికెట్ కొనిన తర్వాత మూడు బస్సులు పొయ్యాయి. వెంటనే కదలనప్పుడు టికెట్లెందుకిచ్చావు?" అన్నాడు పెద్దాయన.

"అవును.. వెంటనే బయల్దేరు లేకపోతే మా డబ్బులు మాకిచ్చెయ్యి" అన్నాడు కుర్రాడు.

"లేద్సార్.. వెళ్ళిపోదాం.." అంటూనే "ఇంకా ఎవర్సార్ హైద్రాబాద్.." అంటూ ప్లాట్‌ఫారం మీద జనాలకోసం అరిచాడు.

"అరిచింది చాలు ఇంక పదండి" అన్నాను నేను. అందరం బస్సు ఎక్కి కూర్చున్నాం. బస్సు స్టార్ట్ చేశాడు డ్రైవర్. స్టార్ట్ చేశాడు కానీ బస్సుని బయటికి తియ్యలేదు. దాదాపు అయిదు నిముషాలు అలాగే వుంచి లోపలికి వచ్చాడు. మొదటి సీటు నించి చివరిదాకా లెక్కపెట్టుకుంటూ వెళ్ళాడు.

"ఇంకా ఎవరో రావాలి సార్" ప్రకటించాడు. నేను వెనక్కి తిరిగి చూశాను. –ముసలి జంట, పడుచు జంట వున్నారు, పెళ్ళికెళ్ళి వస్తున్న జంట వున్నారు, హాస్టల్ పిల్లలు వున్నారు – ఆ సెల్‌ఫోన్ పట్టుకొని వచ్చిన కుర్రాడు?

"అదుగో ఆ సీట్లో ఒక కుర్రాడు వుండాలి" చెప్పాను డ్రైవర్‌తో.

వెనుకనుంచి ఎవరో అసహనంగా "ఛ" అనడం వినిపించింది.

ముసలి దంపతుల దగ్గర పిల్ల మరింత గట్టిగా ఏడుస్తోంది.

"నీకు చెప్పి వెళ్ళలేదా?" నా వెనకాలతను అడిగాడు.

"లేదండి.." అని డ్రైవర్ అంటుండగానే అతను వచ్చాడు. బస్సులో వున్న జనమంతా అతన్ని చిత్రంగా చూస్తుండటంతో చేతిలో మంచినీళ్ళ బాటిల్ చూపించి జనాంతికంగా "నీళ్ళకోసం" అన్నాడు. వెనకాల హాస్టల్ పిల్లల నవ్వులు చిన్నగా.

"అసలే ఈయన టికెట్టు కొట్టటం లేటు, బండి తీయడం లేటు, దానికితోడు ఇదొకటి.." ముసలాయన గొణిగాడు. డ్రైవర్ తిరిగి తన సీట్లోకి వెళ్ళి బండి బయటికి తీసాడు. వూర్లో మరో ఐదారుగురు ఎక్కారు. మరో ఆర్టీసీ వుద్యోగి అనుకుంటా ఎక్కి డ్రైవర్ దగ్గరే చేరి కబుర్లలో పడ్డాడు. బస్సు నడుపుతూనే టికెట్లు కొడుతున్నాడు డ్రైవర్. బస్సు వూరు దాటగానే లైట్లు ఆరిపోయాయి. డ్రైవర్ సీట్‌పైన మాత్రమే లైట్ వెలుగుతోంది.

నా వెనక సీట్లో పెళ్ళికి వెళ్ళొచ్చిన జంట లోగొంతులో ఇంకా వాదించుకుంటూనే వున్నారు.

"అంతే లెండి మా వాళ్ళంటే మీకు ఏనాడు పడింది గనుక.." ఆమె ఏడుస్తున్న సంగతి అర్థమౌతోంది.

"అల్లుడన్న గౌరవం వాళ్ళకుంటే.. వాళ్ళకి మర్యాదిచ్చే వాణ్ణి.." నిష్ఠూరమాడుతూనే కిటికీతో ఆడుతున్న కొడుకు రెక్క పట్టుకుని లాగుతున్నాడు.

ముసలి జంట కిటికీకి దగ్గరగా చేరి, ఆ గాలికి చిన్న పిల్లని నిద్రపుచ్చారు. ఆమె ఇంకా చిన్నగా "రామా లాలి.." పాడుతూనే వుంది. అవతల ప్రేమ జంట – లైట్లు

ఆరిపోగానే సీట్లోనే కొంచెం కిందకి జారి గుసగుసగా మాట్లాడుకుంటున్నారు. ఆ అమ్మాయి గాజుల చప్పుడు, ముసి ముసి నవ్వులు తప్ప ఇంకేం వినపడటంలేదు. కనపడటం లేదు.

చెక్‌పోస్ట్ దాటక ముందే బస్సు ఆగింది. మరో నిముషంలో లైట్లు వెలిగాయి. ప్రేమ జంట గబగబా కదిలినట్లు గాజులచప్పుడు. ఇద్దరూ నిటారుగా కూర్చున్నారు. నా వెనక వున్న ఇల్లాలు కన్నీళ్ళు తుడుచుకుంది. పెద్దామె లాలిపాట ఆగిపోయింది. డ్రైవర్ ఉన్నట్టుండి దూసుకువచ్చాడు–

"అయ్యా.. ఎవరికైనా చిల్లర ఎక్కువిచ్చానా.. చూడండి.. లెక్క తేలడం లేదు.. "అన్నాడు. పసిపిల్ల లేచి మళ్ళీ ఏడుపు అందుకుంది.

"మళ్ళీ ఇదేమిటయ్యా.." అడిగాడు ముసలాయన.

"ఇట్లా అయితే మనం హైదరాబాద్ చేరినట్లే" కాలేజీ పిల్ల కాస్త గట్టిగానే అని కుర్రాడి వంక చూసింది.

"కాదండి.. డబ్బులు షార్ట్ పడితే నా జేబులో నించి కట్టాలి.. ఒక్కసారి చూసుకొని చెప్పండి.."

"ఎంత తగ్గిందిరా.." ఇంతకు ముందెక్కిన ఆర్టీసీ వుద్యోగి సాయంగా నిలబడి అడిగాడు.

"నాలుగు వందలు.."

"ఇంకేం... ఎవరో అయిదు వందలు ఇచ్చి వుంటారు.. వాళ్ళకి చిల్లర ఇవ్వబోయి వందకి బదులు మళ్ళీ అయిదొందలు తిరిగి ఇచ్చి వుంటావు.." అనుభవం మీద చెప్పినట్లు ఖచ్చితంగా చెప్పాతను. "ఎవరెవరు అయిదొందలు ఇచ్చారో గుర్తు చేసుకో.." అంటూ సలహా కూడా ఇచ్చాడు.

"ఎవరెవరో గుర్తులేదు.. ఐదారుగురు ఇచ్చారు.." డ్రైవర్ ముఖం నీరసంగా మారింది.

"క్యాష్ బ్యాగ్‌లో ఎన్ని ఐదొందలు వున్నాయి?"

"అయిదు"

"అంటే ఆరు అయిదొందల కాగితాలు నీ దగ్గరకి వచ్చాయి.. ఒకటి వెనక్కిచ్చావ్.." చెప్తున్నాడతను

"ఏమిటండీ ఈ డిస్కషను? త్వరగా పోనివ్వయ్యా.." అరిచాడు నా వెనకున్న గృహస్తు.

"సార్.. ఒక్క నిముషం సార్.. మీ దగ్గర చూసుకోండి.. వంద బదులు అయిదొందలు

ఇచ్చాను. మీ దగ్గర వుంటే చూసి చెప్పండి.. ప్లీజ్"

ఎవ్వరి దగ్గర్నించి సమాధానం రాలేదు. ఎవ్వరూ కనీసం పర్స్ తీసి చూసుకున్నట్లు కూడా కనిపించలేదు.

"సరే చెప్పావుగా వుంటే ఇస్తార్లే.. ఇంక పోనీ" ముసలాయన గదిమాడు. తప్పని పరిస్థితిలో ముఖం వేలాడేసుకొని డ్రైవర్ సీటు దగ్గరకు వెళ్ళిపోయాడు. బస్సు కదిలింది –లైట్లు ఆరిపోయాయి.

మళ్ళీ ప్రేమజంట గుసగుసలు, సంసారుల రుసరుసలు మొదలయ్యాయి. కాలేజీ పిల్లల మొబైల్‌లో ఏవో కొత్త పాటలు వినపడుతున్నాయి. ఎవరో సన్నగా గురక తీస్తున్నారు. బస్సు చాలా నెమ్మదిగా పోతోంది. బహుశా డ్రైవర్ పోయిన నాలుగు వందల గురించి ఆలోచిస్తూ నడుపుతున్నాడేమో. బస్సు నిండా చీకటి. బస్సు బయటకూడా చీకటే. ఒక రెండు గంటల తరువాత బస్సు ఒక హోటల్ దగ్గర ఆగింది. మళ్ళీ లైట్లు వెలగడంతో ఎవరికి వారు సర్దుకున్నారు.

డ్రైవర్ బస్సులోకి వచ్చాడు.

"సార్.. దయచేసి ఎవరికైనా ఎక్కువ ఇచ్చానేమో చూడండి.. చెకింగ్ జరిగిందంటే వుద్యోగం పోతుంది.." అన్నాడు దీనంగా. నా ఆలోచన కరెక్టే, ఇదే విషయం ఆలోచిస్తూ వున్నట్లున్నాడు.

"ఏమిటయ్యా నీ గోల.. ఎన్ని సార్లు ఆపుతావు" మండిపడ్డాడు కుర్రాడు.

"నీ డబ్బులు మేమేదో దోచేసినట్లే మాట్లాడుతున్నావే? మమ్మల్ని హైద్రాబాద్ చేరుస్తావా లేక ఇట్లాగే.." ముసలాయన ఏదో అంటుండగా డ్రైవర్ అందుకున్నాడు.

"అహా.. లేదు సార్.. దాని కోసం ఆపలేదు.. భోజనానికి ఆపాను.. అదుగో హోటల్.. బస్సు పదిహేను నిముషాలు వుంటుంది.." చెప్తూనే వెనక్కి తిరిగి వెళ్ళిపోయాడు. దాదాపు అందరూ దిగారు. చివరిగా దిగింది నేనే. డ్రైవర్ అక్కడే నిలబడి బీడీ కాలుస్తున్నాడు.

"మీరు రారా భోజనానికి?" అడిగాను.

"ఏం తినబుద్ధవుతుంది సార్.. నాలుగొందలు పోగొట్టుకున్నా ఇవాళ.." అన్నాడతను బీడీ పొగ వదుల్తూ.

"వుద్యోగమన్నాక ఇలాంటివి తప్పవు కదా.. దానికే భోజనం మానేస్తారా?" అన్నాను నేను.

"మీకు తెలియదు సార్.. దాదాపు ప్రతి డ్యూటీలో ఎంతో కొంత పోతూనే వుంటుంది.. అలవాటు లేని పని కదసార్.. అప్పట్లో ఎనిమిది పాస్ అయితే క్లీనర్ వుద్యోగం ఇచ్చారు.. తరువాత డ్రైవరయ్యా.. ఈ టికెట్టు లెక్కలు ఎక్కడ వెయ్యగలను చెప్పండి.. కాకపోతే ఇయ్యాల లేవగానే ఎవరి ముఖం చూశానో నాలుగొందలు పొయినాయి.. నాలుగు వందలు.." అన్నాడతను బాధగా. నేనేమీ మాట్లాడలేదు. అతనే మళ్ళీ అన్నాడు–

"నెలాఖరు కద్సార్.. ఎవడో ఒకడి దగ్గర అప్పన్నా చెయ్యాలి ఇది కట్టాలంటే.. మధ్యలో చెకింగ్ అయితే సస్పెండ్ చేస్తారు.. అయినా అది కాదు బాధ.. పొరపాటున డబ్బులు ఎక్కువ వస్తే వెనక్కి ఇచ్చే నిజాయితీ ఒక్కడికి కూడా లేద్సార్.. అదుగో ఆ హోటల్లో ఎవరో ఒకళ్ళు నా డబ్బుల్తో భోజనం చేస్తున్నారు.." కసిగా అంటుంటే అతని కళ్ళల్లో నీళ్లు తిరిగాయి. నేను మౌనంగా హోటల్‌కేసి నడిచాను.

హోటల్ కౌంటర్ దగ్గర భోజనం టోకెన్ తీసుకుంటుంటే కనపడిందది – ఐదు వందల రూపాయల నోటు.. నా పర్సులో. నేను సామాన్యంగా పెద్ద నోట్లు చిన్న నోట్లు ఒక వరసలో పెడతాను. ఈ నోటు మాత్రం రెండు వంద రూపాయల నోట్ల మధ్య వుంది. అది ఖచ్చితంగా డ్రైవర్ పొరపాటున ఇచ్చిందే.

నిజం చెప్పద్దూ.. ఆ నోటు చూడగానే తిరిగి ఇవ్వాలనే అనిపించింది. కానీ మీరనుకున్నట్లు ఆ నోటు తిరిగి ఇవ్వలేదు, ఇస్తే ఈ కథే లేదు..!! బస్సులో హైద్రాబాద్ వచ్చే వరకూ తర్జన భర్జన పడుతూనే వున్నాను. హైదరాబాద్‌లో దిగిపోయాను – నా జోబులో నోటు అలాగే వుండిపోయింది. ఆ తరువాత ఎక్కడ ఖర్చుపెడదామన్నా ఎందుకో మనసు వొప్పలేదు. మళ్ళీ ఆ డ్రైవర్ కనపడకపోతాడా, నేను నోటు తిరిగి ఇవ్వకపోతానా అని ఎదురు చూస్తున్నాను. ఆ అయిదువందల రూపాయల నోటు మాత్రం రోజూ, నేను పర్సు తీసినప్పుడల్లా కనపడి వెక్కిరిస్తుంటుంది.

(సాక్షి ఫన్ డే, 19 సెప్టెంబర్ 2010)

ఊహాచిత్రం

నేను లేచాను. ఇంకా మత్తుగా వుంది. లేచిన చోట అలాగే కూర్చుని గట్టిగా కళ్లు నులుపుకొని కిందకి చూశాను. కాళ్లకింద ఆ బొమ్మ.. "ఆన్ క్రాస్" చార్‌కోల్ ఆన్ తార్ రోడ్. దాదాపు ఇరవై సంవత్సరాల క్రితం నేను గీసిన బొమ్మ లాగానే వుంది. ఇంకా ఇలా రోడ్డు మీద వుండటమే ఆశ్చర్యం. దీనంగా గీసిన క్రీస్తు ముఖంలో చిన్న చిరునవ్వు.. నన్ను ఆహ్వానిస్తున్నట్టు నవ్వు. నేనున్న చోటు నుంచి ఆ బొమ్మని చెరపకుండా వుండాలని జాగ్రత్తగా కదిలాను. అదృష్టవశాత్తు పాదాలు నేలకి ఆనడం లేదు.

ఎదురుగా ఏముందో కనపడటం లేదు... మొత్తం మంచుతెర. మసక మసకగా ఎక్కడో దూరంగా ఏదో జరుగుతున్నట్టు అలికిడి. మంచు కరుగుతోంది.. అలా ముఖం మీద రంగులై జారుతోంది. అంతా ఏదో సర్రియలిజం పెయింటింగ్‌లాగా... ఇంకా చెప్పాలంటే మాన్ సర్రియలిజంలాగా కనపడుతూ.. కరుగుతోంది..!

ఎదురుగా ఒక టీ బండి. అలాగే చూస్తూ వుండిపోయాను. అదేదో కలిసిపోయిన రకరకాల పెయింటింగ్స్ గేలరీలాగా వుంది. ఆ గోడని చూస్తుంటే అక్కడక్కడ పెచ్చులూడి, రంగులు వెలసి ఒక అబ్‌స్ట్రాక్ట్ ఎక్స్‌ప్రెషనిజం.. అదిగో అక్కడ గోడ కిందుగా ఆ మరకలు. అవి ఒంటికాలిపైన నిలబడి టీ తాగుతూ, రెండో కాలు గోడ మీద ఆన్చే మనుషుల రకరకాల బూటు గుర్తులు, చెప్పు గుర్తులు.. వాటిపైన ఎవరో పాన్ తిని వూసిన గుర్తులు. చూస్తుంటే డెబ్భయిల్లో వచ్చిన ఏదో మినిమలిజం తాలూకు పెయింటింగ్ లాగా వుంది. జామెట్రిక్ అబ్స్‌టాక్ట్ అన్నా కాదనలేను కాకపోతే ఆ మరకల్లో సిమెట్రీ లేదు! ఆయన పేరేంటి – అదే జామెట్రిక్ అబ్స్‌ట్రాక్ట్ కనిపెట్టిన రష్యన్.. కాజిమీర్.. కాజీమీర్.. ఏదో వుండాలి! "ఒక టీ" చెప్పాను బండి వాడితో.

పక్కనే ఒక పెద్ద రాయి. దాని మీద కూర్చున్నాను. రాయి చాలా మెత్తగా వుంది. నా వెనక గోడ మీద సగం చించేసిన సినిమా పోస్టర్. చించేసిన సగంలో నుంచి వారం క్రితం అంటించిన మరో పోస్టర్ కనపడుతోంది. కొలాజ్.. 'రివీలిజయం' అనొచ్చా.. అట్లాంటిది ఒకటి వుందా? ఏమో తెలియదు. టీ అమ్మే అతని వైపు చూశాను. నేనొకణ్ణి ఉన్నానన్న స్పృహే లేకుండా తన పని తాను చేసుకుంటూ పోతున్నాడు. ప్రత్యేకమైన ముఖం. మా గురువుగారు చెప్పినట్లు వృత్తం, త్రిభుజం, చతుర్భుజం ఈ మూడింటితోనే అతని ముఖం తయారైంది. రోజులో సగం కూడా గడవలేదు కాబట్టి.. ఇంకా ఫ్రెష్‌గానే వున్నాడు. సాయంత్రం వచ్చి అతను చెమటతో తడిసిపోయి వున్నప్పుడు ఒక లైవ్ ఆర్ట్ చెయ్యాలి.

తల తిప్పి మళ్లీ ఎదురుగా చూశాను. నేను దాటి వచ్చిన కిటికీ ఎక్కడో దూరంగా వుంది. చూస్తుండగానే వెనక్కి వెనక్కి వెళ్లిపోయింది. ఎదురుగా జనం.. పెద్ద గుంపుగా జనం. ఎంత అద్భుతంగా వుందో చెప్పలేను. అసలు జనాన్ని చూడటమే ఒక అద్భుతమైన అనుభవం. ఇంతింత చిన్న చిన్న ముఖాలలో ఎన్ని వేల ఎక్స్‌ప్రెషన్లు వుంటాయో! అదుగో అటు చూడండి.. కూరగాయలకోసం వచ్చి అదంతా మర్చిపోయి గుంపు మధ్యలోకి తొంగి చూస్తున్న బట్టతలాయన.. ఆయన ముఖంలో ఆత్రుత.. ఆదుర్దా! ఆయన చెయ్యి పట్టుకొని "వెళ్దాం" అంటూ లాగుతున్న మూడేళ్ల పిల్ల. ఆ పిల్ల ముఖంలో చిరాకు, తొందర. పక్కనే వున్న ఆ అమ్మాయిని చూశారా..! అహహ.. ఆమె కాదు.. ఆ లావుగా, మెరూన్ కలర్ చీర పక్కన.. ఆ అదే ఆ కుక్కపిల్ల. ఆ అమ్మాయి కట్టుకున్న ఎర్ర రంగు చీరచెంగు గాలికి ఎగిరి పక్కనే వున్నాయన నల్లటి పాంట్‌మీద పడుతుంటే భలే వుంది. ఎరుపు నలుపు కాంబినేషనే అంత..!

ఇలాగే ఈ గుంపుని బొమ్మ గీసేస్తే బాగుంటుందేమో అనిపిస్తోంది.. క్యూబిజంలో అయితే బాగుంటుందేమో..! ఆ అమ్మాయిని మాత్రం క్యూబిజంలో ఇరికించేసి అన్ని వైపుల్నించి ఆ అమ్మాయి ముఖం గీసేస్తే... మాస్టర్ పీస్ చెయ్యొచ్చు!

"ఎంతసేపు టీ ఇవ్వడానికి?" గట్టిగా అరిచి మళ్లీ గుంపువైపు తిరిగాను.

గుంపు మధ్యలోనించి ఏదో కదులుతూ బయటికి వస్తోంది. రంగు.. ఎర్రటి రంగు.. ఆ రంగుని చూడగానే మనసు వురకలేస్తోంది.. క్యూబిజం పక్కన పెట్టి క్లాసికల్ రియలిజం వైపు మనసు పోతోంది. అవును అలాగే వెయ్యాలి. అప్పుడే నా ప్రతిభ తెలుస్తుంది. రియలిజం.. నియోక్లాసిజం కలిపి... అవును నా బ్రష్‌లు ఎక్కడ పెట్టాను? నా ఇంట్లోకి ఎలా వెళ్లాలి? నల్లటి వర్షం మొదలైంది.

ఎన్ని నీళ్లు పడ్డా ఆ ఎర్రరంగుకి ఏం కావడం లేదు. అది రంగు కాదు.. నాకర్థమైంది.. రక్తం! గుంపు మధ్యలో ఎవరిదో రక్తం.. ఆదుర్దాగా లేచాను.. పరిగెత్తాను. ఆ గుంపుని చీల్చుకొని లోపలికెళ్లి చూశాను.

ఆ శవం.. ఆ శవం..

నాదే..!!

నేనే అక్కడ పడివున్నాను.. ముదురు గోధుమరంగు ముఖం నాది.. నా ముఖం మీద ఎర్రటి రక్తం.. ఎంతైనా చెప్పండి.. కాంబినేషన్ కుదరలేదు.. వర్షం పచ్చగా మారింది.

❖ ❖ ❖

"నువ్వు నారాయణగారి పెయింటింగ్ వెయ్యాలి.."

ఈ మాట వినగానే ఎగిరి గంతేసాను. నా చేత్తో మా గురువుగారి బొమ్మగీసే భాగ్యం.. అంత కన్నా ఇంక కావాల్సిందేముంది..! ఆయనంటే నాకెంత అభిమానమో చెప్పలేను..!

అసలు మొదటిసారి ఆయన్ని చూసినప్పుడు కత్తి తీసుకొని పొడిచేద్దామనిపించింది.. చంపేస్తే ఏమౌతుంది? అని ఒక క్షణం ఆలోచన వచ్చింది... ఈర్ష్య సార్.. మహా చెడ్డది ఈ ఈర్ష్య!

ఆయన వయసు అరవై దాటుతోంది! అయినా ఏదైనా బొమ్మని చూస్తే ఇంకా పిల్లాడే..! ప్రతి బొమ్మనీ, ప్రతి గీతనీ ఆ కళ్లద్దాల సందుల్లోంచి తదేకంగా చూస్తుంటాడు.. ఎంత చిన్న పిల్లాడు గీసిన బొమ్మైనా సరే.. అది తినేసే చూపు! ఆ తరువాత తను గీస్తాడు.. మళ్లీ మళ్లీ గీస్తాడు. తాను చూసిన ఆ ఆర్ట్ ఏదైనా సరే.. తనకి పట్టుబడేదాకా వూరుకోని పట్టు వదలని విక్రమార్కుడు.. అందుకే పోర్ట్రేట్స్ దగ్గర్నుంచి అబ్స్‌టాక్ట్ దాకా, ఇలస్ట్రేషన్స్ నుంచి క్యారికేచెర్స్ దాకా అన్నీ చేశాడు. ఇంకా చేస్తూనే వున్నాడు.

"ఆకలి చాలా ముఖ్యం.. ఆకలికి దాసోహమనని కళ లేదు" అన్నాడొకసారి.

"అవును వ్యాన్‌గో అంత గొప్ప బొమ్మలు గీసాడంటే పాపం కడుపులో రగుల్తున్న ఆకలే కారణం.. కదా గురువుగారూ?" అన్నాను అజ్ఞానంగా. ఆయన నవ్వేశాడు.

"నేను చెప్పేది ఆ ఆకలి గురించి కాదు.. కొత్తది ఏమైనా నేర్చుకోవాలనే ఆకలి.. అది మనసులో భగభగ మండుతుంటే ఇలాంటివి ఇంకా ఎన్నో నేర్చుకోవాలనిపిస్తుంది..." చెప్పాడాయన. ఆ తరువాత తెరిచాడు ఆయన సేకరించిన రకరకాల బొమ్మల ప్రపంచాన్ని.

ఎక్కడో చైనాలో గీసిన అబ్స్‌ట్రాక్ట్ బొమ్మలు, జర్మనీ పత్రికల్లో వచ్చిన కార్టూన్ స్ట్రిప్స్, ఇంకెక్కడో మధ్య ప్రాచ్యంలో గీసిన పోస్టర్ డిజైన్స్... ఇలాంటివి ఎన్నో. ఒక్కొక్క బొమ్మ ప్రత్యేకతని, ఆ గీతల నైపుణ్యాన్నీ చూపిస్తుంటే.. ఆయనలో మరింత ఉత్సాహం.. నాలో నైరాశ్యం! ఆ ప్రపంచాన్ని వదిలి ఏ రాత్రి వేళో ఇల్లు చేరాక నా మీద నాకే అసహ్యం వేసింది. అన్ని బొమ్మలు చూశాక, అంత మంది ఆర్టిస్టులను కలిశాక ఇంక నన్ను నేను ఆర్టిస్ట్‌నని చెప్పుకోడానికి అర్హత లేదనిపించింది. నా ఎదురుగా వున్న నాలుగు పెయింటింగ్స్.. నేను గీసినవే.. నన్ను వెక్కిరిస్తున్నట్లు.. వాటి మీద కసి కొద్దీ రంగులు చల్లేశాను. ఇండియన్ ఇంక్ బాటిల్ మొత్తం కుమ్మరించాను.

❖ ❖ ❖

ఎర్రటి రక్తం రోడ్డు మీద పరుచుకుంటోంది. ఆ రక్తం నాదే.. నా శవానిదే. నేను చచ్చిపోయాను అని తెలియగానే భలే ఏడుపొచ్చింది. నా భార్యా పిల్లలు గుర్తుకు రాలేదు. అమ్మా, నాన్న, బంధువులు, మిత్రులు... వీరెవ్వరూ గుర్తుకు రాలేదు! మా గురువుగారు కూడా గుర్తుకురాలేదు.

నా కళ్లముందు అస్పష్టంగా కనిపించింది. నేను వేస్తున్న నారాయణగారి పోట్రెయిట్ పెయింటింగ్! ఇంకా పూర్తి కాలేదు. స్ట్రక్చర్ అయిపోయింది. బేస్ కలర్స్ వేసేశాను. ఇంకా చెయ్యాల్సిన పని చాలా వుంది. అదంతా ఎవరు పూర్తిచేస్తారు అనిపించింది. అసలు పూర్తిచేస్తానా? అని అనుమానం వచ్చింది. నా వూహల్లో తయారైన చిత్రం.. దానికి ఈ భూమి మీద పుట్టే అవకాశం లేకపోయింది.. నా చావుతో.. ఆ బొమ్మ పుట్టకముందే చచ్చిపోయింది. ఇలాంటిదొకటి మొదలు పెట్టానని ఎవరికీ తెలిసే అవకాశం కూడా లేదు. నాకు అడ్వాన్స్ ఇచ్చిన వ్యక్తి ఆ డబ్బుల కోసం వస్తాడేమో కాని, నేను గీసి సగంలో ఆగిపోయిన బొమ్మని తీసుకెళ్లడానికి మాత్రం రాడు.. ఆ బొమ్మ అలా దీనంగా 'ది క్రయింగ్ చైల్డ్' బొమ్మలాగా అలా ఒక మూలన పడుండాల్సిందే!

ఏదో ఒక రోజు మా ఆవిడకి అదంతా అడ్డంగా తోస్తుంది. ఆ రోజు ఏ పాత సామాన్ల బండిమీద పడిపోతుందో..

అంతకన్నా ఏం చెయ్యగలదు చెప్పండి.. అంటే నా భార్యకి బొమ్మలంటే ఇష్టంలేదని కాదు, బొమ్మ మొత్తం గీస్తే అది బాగుందో లేదో చెప్పగలదు గానీ, ఏం బాగుందో చెప్పలేదు. అలాంటప్పుడు పూర్తిగా గీయని బొమ్మను చూసి, అది అర్థాంతరంగా ముగిసిపోయిన మాస్టర్‌పీస్ అని గుర్తించడం అసంభవం.

"ఏమిటా ఆ పరధ్యాన్నం" అంటుండేది అప్పుడప్పుడు.

"అబ్బే ఏం లేద"నే చెప్పాను చాలాసార్లు. అంతకన్నా ఏం చెప్తాను? నా మనసులో ఏదో మూల ఒక రష్యన్ చిత్రకారిణి గీసిన పెన్సిల్ ఆర్ట్ తొలుస్తోందని చెప్పనా? డావించీ కుంచె నా గుండెల్లో కస్సున దిగి రంగులు పులుముతోందని చెప్పనా.. లేకపోతే నేను గీయబోతున్న బొమ్మ తాలూకు పురిటి నొప్పుల గురించి వివరించనా..

"ఇదిగో.. ఒక కాలికి ఒక రకం చెప్పు, రెండో కాలికి ఇంకో రకం చెప్పు వేసుకున్నారు" చెప్పింది నేను బయలుదేరినప్పుడు.

కాళ్లవైపు చూసుకున్నాడు. అవును కరెక్టే. ఇందాక వేసుకునేటప్పుడే అనుకున్నాను సిమెట్రీ లేదు అని. నవ్వేసి "మా గురువుగారింటికి వెళ్లొస్తా.." అన్నాను చెప్పులు మార్చుకుంటూ..

"అలా ఏదో ఆలోచిస్తూ బండి నడపకండి.." జాగ్రత్త చెప్పింది పాపం.

ఆ మాటలు విన్నాను.. కానీ ఆలోచనలు వూహలు కలలు మన చేతుల్లో లేవు కదా! అవి వచ్చి నన్ను కమ్మేసి ముద్దుల్లో ముంచేస్తుంటే.. అరెరే నేను కుడి వైపు సందులోంచి వెళ్లాల్సింది. మాటల్లో పడి మర్చిపోయాను. కొంచెం ముందుకు వెళ్లి టర్నింగ్ తీసుకోవాలి. గురువుగారి పెయింటింగ్ ఎలా వెయ్యాలో దాదాపు ఖరారైంది.. కొన్ని రిఫరెన్స్‌లు తీసుకోడానికి గురువుగారి దగ్గరకే వెళ్తున్నా.. ఆయనకి బాగా పేరుతెచ్చిన మేజిక్ రియలిజం స్టయిల్లో ఆయన బొమ్మ గీయాలి. దాటేస్తున్నా.. దాటేస్తున్నా.. మర్చిపోయి మళ్లీ కుడివైపుకి తిరగడం మర్చిపోయి, వున్నట్టుండి తిప్పడం.. ఆ వెనకే వస్తున్న లారీ ఢీ కొట్టడం.. అసలు ఎప్పుడు జరిగిందో తెలిసేలోగా నేను నేల మీద పడ్డాను..! నా బొమ్మ అనాథ అయిపోయింది.

❖ ❖ ❖

నేనొక పిచ్చోణ్ణి. నా ముందు మసక మసకగా వున్న చిత్రాన్ని చూసి సర్రియలిజమో ఇంకేదో అనుకున్నా.. ఆత్మలకి అలాగే కనిపిస్తాయేమో! పైగా టీ ఇవ్వలేదని కోపమొకటి! అలా ఎంతసేపు పెయింటింగ్‌కి పోజిచ్చినవాడిలా కూర్చోవాలో మరి. ఆత్మ అంటే ఎగురుకుంటూ పైకి వెళ్లి ఆకాశంలో కలిసిపోవాలి కదా!

నా శవం చుట్టూ జనం పెరుగుతున్నారు.

"అరెరే.. హెల్మెట్ పెట్టుకోకపోతే చూశారూ.." ఆయనెవరో నీతి సూత్రం చెప్తున్నాడు.

"నేను చూస్తూనే వున్నా.. అడ్డదిడ్డంగా నడుపుకుంటూ వస్తున్నాడు. తాగున్నాడేమో అనుకున్నా.. వున్నట్టుండి తిప్పాడు" మరో ప్రత్యేక సాక్షి..

నాకు అక్కడ వుండబుద్ధి కావటం లేదు. కాని ఈ ప్రపంచాన్ని వదిలి వెళ్దామంటే వెళ్లనివ్వకుండా ఏదో పట్టి లాగుతోంది.

భూమ్మీదే ఏదో శక్తి ఆపుతోంది.

పోలీసులు వచ్చారు. నా మొబైల్ తీసుకొని అందులో నెంబర్లకి ఫోన్‌లు చేస్తున్నారు. నాకు అర్థమయ్యింది. నా భార్యాపిల్లల్ని చూసుకోవాలనే అనుకుంటా నా ఆత్మ ఆరాటం.

అంబులెన్స్ వచ్చింది. నా భార్యాపిల్లలూ వచ్చారు. ఆమె ఒకటే ఏడుపు. నాకు ఏడుపు రాలేదు. ఎందుకో! ఇంక అయిపోయింది. ఇంకాసేపట్లో తీసేస్తున్నారు. ఇకనైనా నా ఆత్మ కదలాలి.. లేదే.. ఇంకా ఏదో ప్రతిబంధకం!!

"ఏమైంది?" గుంపు చివర నిలబడి పక్కనే వున్న కుర్రాణ్ణి అడిగాడు ఒక ముసలాయన.

"ఏక్సిడెంట్.. స్పాట్‌లో పోయాడు.." ఎవరో చెప్తున్నారు.

"అయ్యయ్యో.. ఎవరో తెలిసిందా?"

"ఎవరో బొమ్మలేస్తాడట.. ఆర్టిస్ట్" చెప్పాడతను. ముసలాయన గుంపును తోసుకొని లోపలికి వచ్చాడు. నా శవం వైపు చూస్తూ చేతులు జోడించి నిలబడ్డాడు.

"ఏం బొమ్మ నీ కళ్లముందు కనపడతా వుండిందో నాయనా.. నీ సావు నీకు కనపడలా.." అని బయటికి వచ్చాడు అతను. అదే నేను వినాలనుకుంది. నా చావుతో నా బొమ్మ మిగిలిపోయింది. నా వూహలో బొమ్మ అర్థాంతరంగా ఆగిపోయింది. కానీ, కనీసం ఒకరికైనా నా చావుకు కారణం తెలిసింది. అదే నేను వినాలనుకున్నది. నా ఆత్మ గాల్లోకి లేచింది.

ఆ ముసలాయన రోడ్డు మీద గీసిన క్రీస్తు బొమ్మపైన చిల్లర ఏరుకుంటున్నాడు.

(ఆదివారం ఆంధ్రజ్యోతి, 27 మార్చి 2011)

(సారంగ సాహిత్య వారపత్రిక, 20 మార్చి 2013)

చిరాకు రామనాథం

"రా"మనాథం గారు పోయారట" అమ్మ చెప్పింది. నేనేమి పలకపోవడంతో మళ్ళీ తనే అంది – "మీ నాన్నగారు, ఆయన మంచి స్నేహితులు, వూర్లోనే వున్నావు కదా పోనీ ఒకసారి వెళ్ళి చూసిరారాదూ"

"సరే వెళ్తాలే" అన్నాను చదువుతున్న పేపరు పక్కన పెట్టి.

నాన్న బతికున్నప్పుడు కూడా రామనాథంగారి గురించి చాలా సార్లు చెప్పేవాడు. ఆయన తరచుగా స్నేహితులతో చుట్టపక్కాలతో గొడవపడే విషయాలే ఎక్కువగా చెప్పినట్లు గుర్తు. రామనాథంగారికి మా నాన్న తప్ప ఇంకెవరూ స్నేహితులు లేరని కూడా చెప్పారు. నాన్న ఎలాగూ లేరు కాబట్టి ఆయన తరఫున కనీసం నేనైనా వెళ్ళి చూసి రావాలని అమ్మ ఆలోచన.

❖ ❖ ❖

నేను అక్కడికి వెళ్లేసరికి అట్టే జనం కూడా లేరు. ఒక మనిషి పోతే కనీసం పది మందైనా రాకపోతే ఇంక ఆయన బ్రతికి ఏం సాధించినట్లు అనుకున్నాను. నన్ను కనీసం గుర్తుపట్టి పలకరించేవాళ్ళు కూడా లేరక్కడ. సాంప్రదాయబద్ధంగా శవాన్ని పడుకోబెట్టి, దండలూ అవీ వేస్తున్నారు. తల దగ్గర దీపం పక్కనే వాళ్ళ అబ్బాయి అనుకుంటా కూర్చోనున్నాడు. గడప అవతలగా ఇద్దరు ఆడవాళ్ళ మధ్యలో రామనాథంగారి భార్య కూర్చోని చెంగు నోటికి అడ్డం పెట్టుకోని చిన్నగా ఏడుస్తోంది.

నేను శవం దగ్గరగా వెళ్ళి నమస్కారం చేసుకున్నాను. పల్చటి మనిషి, చామనఛాయ, తలమీద ఎక్కువగా వెంట్రుకలు లేవు, చిరాకుగా వున్నట్టు వుంది ముఖం. కొందరి ముఖాలంతే... ప్రతి దానికి చిరాకు పడుతున్నట్టు వుంటాయి. అలాంటి మనిషి అందరితో గొడవలు పెట్టుకున్నాడంటే

అందులో ఆశ్చర్యమేమీ లేదు. అక్కడినుంచి రెండడుగులు వెనక్కి వేసి వాళ్ళ అబ్బాయిని పలకరించాలా లేదా అని ఆలోచించాను. అంతలో అతనే గుర్తుపట్టాడు– "భీమేశ్వర్‌రావు గారి అబ్బాయా మీరు..?" అడిగాడు అనుమానంగా.

"అవునండీ.." అన్నాను ఇంకేం చెప్పాలో తెలియక.

"నాన్నకి మీ నాన్నగారు ఒక్కళ్ళే మంచి స్నేహితుడు.. ఎప్పుడూ ఆయన్నే తల్చుకుంటుండేవారు.." అన్నాడు బాధగా.

"బాధ పడకండి.. మళ్ళీ స్నేహితులు కలుసుకొని వుంటారు" అన్నాను పైకి చూపించి. అతను చిన్నగా నవ్వాడు.

"ఇంకెవరైనా రావాలా?" అడిగాను ఏదో ఒకటి అడగాలి కాబట్టి.

"అన్నయ్య నాగ్‌పూర్ నుంచి బయల్దేరాడు. ఇంకొంచెం సేపట్లో రావాలి. నేను బాంబేలో వుంటాను. నాన్నకి ఆరోగ్యం బాగాలేదని తెలిసి నిన్నే వచ్చాను" చెప్పాడతను.

"సరే" అంటూ మళ్ళీ రామనాథంగారికి చేతులు జోడించి బయల్దేరాను.

ఆ వీధి చివర ఒక చిన్నపాకలో టీ కొట్టు చూసి అక్కడ ఆగి టీ చెప్పాను. అప్పటికే అక్కడ నలుగురైదుగురు కూర్చోని మాట్లాడుకుంటున్నారు.

"ఎవరో పోయారట?" అడిగాడు అప్పుడే లోపలికి అడుగుపెడుతున్న బట్టతలాయన.

"అదే మన చిరాకు రామనాథం లేడూ.. రామనాథం.." ఒకాయన అన్నాడు వెటకారంగా.

"హమ్మయ్య.. పోయాడా? ఇంక మనకు రోజూ ఆ పిచ్చోడితో గొడవలు తప్పినట్లే.." అన్నాడా మొదటి వ్యక్తి నవ్వుతూ.

"మరి లేకపోతే ఈ పాటికి ఇంత ప్రశాంతంగా వుండేదా? ఎవరిమీదో అరుస్తూ గోల చేస్తుందేవాడు కాదూ" ఇంకెవరో గట్టిగా నవ్వారు.

చనిపోయిన వాళ్ళ గురించి అలా మాట్లాడుకోవడం తప్పుగానూ, ఇబ్బందిగానూ అనిపించింది నాకు.

"ఎందుకండీ చనిపోయినవాళ్ళ గురించి అట్లా మాట్లాడతారు" అన్నాను నేను కల్పించుకొని,

"మీరెవరు? మీ బంధువా?" అడిగారు.

"లేదండి.. తెలిసినాయన. చూడటానికి వచ్చాను" చెప్పాను టీ అందుకుంటూ.

"తెలిసినాయనా? ఆయన గురించి పూర్తిగా తెలియదనుకుంటా.. లేకపోతే మీరు ఇలా మాట్లాడరు"

"ఏమైనా చనిపోయిన తరువాత ఎవరినీ అలా కించపరిచేలా మాట్లాడకూడదు" అన్నాను నేను. అక్కడ వున్న వాళ్ళందరూ ముఖముఖాలు చూసుకుంటున్నారు.

"ఆయన మమ్మల్ని పెట్టిన ఇబ్బందుల గురించి వింటే మీరు కూడా మాలాగే అదే మాటంటారు.. ఈ వీధిలో వున్న వాళ్ళందరితో గొడవపడందే రోజు గడవదు ఆయనకి తెలుసా" చెప్పాడు మధ్యలో కూర్చున్న వ్యక్తి. ఈ వ్యవహారం ఏదో కొత్తగా వుంది నాకు. నాన్న చెప్పినంతలో రామనాధంగారి గురించి ఇంత చెడుగా ఎప్పుడూ చెప్పలేదు. ఏవో ఆదర్శాలు, నియమాలు అంటూ చాలా మందితో గొడవలు పడేవారని నాన్న చెప్పినా, అతనంటే పడనివాళ్ళు ఇంతమంది వున్నారా అని ఆశ్చర్యం కలిగింది. అసలు అదేమిటో తెలుసుకోవాలని వాళ్ళ ఎదురుగా కూర్చున్నాను.

"ఏం చేసేవాడు?" అడిగాను.

"ఏం చేసేవాడా? ప్రతి దానికి చిరచిరలాడుతుంటాడు.. అందుకే చిరాకు రామనాథం అని పేరు పెట్టారు మా వీధి కుర్రాళ్ళు. ఆయనకి అదో రకమైన పిచ్చి.. అన్నీ రూల్ ప్రకారమే జరగాలంటాడు.. సిగ్నల్ పడ్డ తరువాతే బండి కదలాలంటాడు... రోడ్డుకి ఎడమవైపే నడవాలంటాడు.. అదేంటి.. ఆ .. జీబ్రా క్రాసింగ్.. అక్కడే రోడ్డు దాటాలంటాడు..ఎవరైనా అట్లా చెయ్యకపోతే మనిషికి ఎంత చిరాకో చెప్పలేము..." చెప్పాడు నా కుడివైపున్న వ్యక్తి.

"అందులో తప్పేముంది?"

"మీకు అలాగే అనిపిస్తుంది... అక్కడికి మేమేమీ రూల్స్‌కి విరుద్ధంగా నడుచుకుంటామని కాదు.. కానీ ఈ ట్రాఫిక్‌లో అవన్నీ ఎక్కడ సాధ్యమౌతాయి చెప్పండి.."

"అయితే"

"అయితే ఏమిటి.. ఆ రామనాథం వీధి వెంట పోతుంటే ఎవరో టర్నింగ్ తిరుగుతూ చెయ్యి చూపించలేదనో, రోడ్డుకు అడ్డంగా నడుస్తున్నాడనో పట్టుకునేవాడు.. ఇహ వాళ్ళతో వాదన.. రూల్స్ ఒప్పజెప్పడం, సెక్షన్లు చెప్పి నువ్వు చేస్తున్న పనికి ఇంత జరిమానా వుందని ఒకటే గొడవ..." చెప్పాడు మరొకాయన.

"డబ్బులు తీసుకునేవాడా?" అడిగాను.

"తీసుకొని వదిలేసినా బాగుండు... ఇచ్చినా తీసుకునేవాడు కాదు.. పైగా లంచం ఇస్తావా అని మరో గొడవ చేసేవాడు..."

"మరి?"

"ఎవరైనా ట్రాఫిక్ రూల్ తప్పితే బలవంతంగా పోలీసు దగ్గరకి తీసుకెళ్ళి చెలాన వ్రాయమనేవాడు.." అంటూ అతను పక్కనే వున్న ట్రాఫిక్ కానిస్టేబుల్‌ని చూపించాడు. అతను తల నిలువుగా వూపుతూ అన్నాడు.

"అమ్మో.. అతను వీధిలో నడుస్తుంటే మాకే భయం వేసేది.. ఎవడో సిగ్నల్ దాటేసి వెళ్ళాడని మమ్మల్ని పట్టుకొని వాయించేసేవాడు.. మీరు వుండి ఏం చేస్తున్నారని నిలదీసేవాడు." అంటూ నిట్టూర్చాడు కానిస్టేబుల్.

వాళ్ళు ఎంత చెప్పినా అతను చేసినదాంట్లో నాకేమీ తప్పు కనిపించడంలేదు. అదే అన్నాను వాళ్ళతో.

"మీకు అలాగే అనిపిస్తుందండి.. రూల్స్ మాట్లాడటం చాలా సులభం... పాటించాలంటేనే తెలిసొస్తుంది.." చెప్పాడు బట్టతలాయన.

"ఆయన పాటించేవాడు కాదా?" అడిగాను మరింత కుతూహలంగా. సదరు రామనాధంగారి విషయాలు కొత్తగానూ, విచిత్రంగానూ అనిపించసాగాయి నాకు.

"ఎందుకడుగుతారులే..ఆయన పాటించక పోవడమా? మిన్ను విరిగి మీద పడ్డా తప్పేవాడు కాదు.. అదే సమస్యంతా... ఆయన చెయ్యడు ఇంకొకళ్ళని చెయ్యనివ్వడు.. మొన్నా మధ్య సిగ్నల్ దగ్గర ఆయన బండి మీద వున్నాడు. వెనకెవరో హారన్ కొట్టాడని బండి దిగి అతనితో గొడవ పెట్టుకున్నాడు.. ట్రాఫిక్ అంతా ఆగిపోయింది.." చెప్పాడు కానిస్టేబుల్. మరొకళ్ళు అందుకున్నారు–

"ఆ ఇంట్లో వాళ్ళు ఈయనతో ఎట్లా భరించారో గానీ.. సినిమా హాలుకి వెళ్తాడా.. ఎవరో లైన్ తప్పి వచ్చి టికెట్ తీసుకున్నాడని వాడితో గొడవ.. సినిమా అయినా వొదులుకుంటా కానీ ఇలా లైన్ తప్పి వచ్చేవాళ్ళను వదలను అంటాడు.. పిచ్చి కాకపోతే ఏమిటి?" అన్నాడు.

"ఆయనగారి రూల్స్ పిచ్చి తట్టుకోలేకే "చిరాకు రామనాధం" అనేవాళ్లు అందరూ.. ఆయనకేమో మమ్మల్ని చూస్తే చిరాకు.. మాకు ఆయన్ని చూస్తే చిరాకు.." గట్టిగా నవ్వారు అందరూ.

"పొద్దున్నే నీళ్ళ పంపు దగ్గర గొడవ.. లైన్‌లో రమ్మంటాడు.. మొన్నా మధ్య ఆ కనకయ్యని కొట్టినంత పని చేశాడు.."

"అవును... అదే కోపంతో మా ఇంట్లో కరెంట్ మీటర్ టాంపర్ చేశానని పట్టించాడు.. నానా గడ్డి కరిచి లంచాలిచ్చి మళ్ళీ మీటర్ వేయించుకుంటే.. లంచాలెందుకు ఇచ్చావని మళ్ళీ గొడవకొచ్చాడు.." చెప్పాడు కనకయ్య. అప్పటి దాకా వింటున్న టీ కొట్టు కుర్రాడు కూడా వంత పాడాడు–

"ప్లాస్టిక్ కవర్లు వాడద్దని నా మీద ఒక రోజు గొడవ... పర్యావరణం అంటాడు.. కవర్లతో ప్రమాదం అంటాడు.. మీరే చెప్పండి నేనొక్కణి వాడితే ప్రపంచం పాడైపోతుందా? నేనొక్కడ్నే మానేస్తే ఆగిపోతుందా?" అన్నాడు.

ప్రతి ఒక్కరికీ ఆయనతో గొడవలున్నాయని అర్థం అయ్యింది. అర్థం కానిదల్లా ఒక్కటే– రామనాథంగారు చెప్పినవన్నీ సబబుగానే వున్నాయి ఆ విషయాన్ని వీళ్ళెందుకు అర్థం చేసుకోవటం లేదు అని. టీ డబ్బులు ఇచ్చేసి మళ్ళీ రామనాథంగారింటికి వెళ్ళాను. లోపలికి వెళ్ళగానే ఆయన చిన్నబ్బాయి కనిపించాడు. "అన్నయ్య వచ్చాడు.. బయట వున్నాడు కలిసారా?" అన్నాడు.

"కలుస్తాను" అని బయటికి వచ్చాను. బయట పురోహితుడితో మాట్లాడుతున్నాడు అతను. దాదాపు రామనాథంగారిలాగానే వున్నాడు. కాకపోతే తల మీద మరి కాస్త జుట్టు వుంది. పురోహితుడు వెళ్ళిపోయాక నేను పలకరించాను.

"నమస్తే నేను భీమేశ్వర్రావు గారి అబ్బాయిని" చెప్పాను.

"ఓ.. మీరేనా.. ఇందాకా వచ్చి వెళ్ళారని చెప్పాడు తమ్ముడు..?" అంటూ ఆగిపోయాడు.

"మళ్ళీ వచ్చారే?" అన్నట్లు అనిపించింది నాకు.

"ఏం లేదు.. మళ్ళీ ఒకసారి చూడాలనిపించింది.. చివర టీ కొట్టు దగ్గర ఆయన గురించి మాట్లాడుకుంటున్నారు.. అది విని.." చెప్పటం ఇష్టం లేక ఆగిపోయాను.

''ఏమనుకుంటున్నారు? చిరాకు రామనాథం అనా? అందరితో గొడవలు పెట్టుకునేవాడనా?" అతను అంటుంటే అతని కళ్ళలో నీరు.

నేనేమీ మాట్లాడలేదు. అతని భుజం మీద చెయ్యి వేసి ఓదార్పుగా నొక్కాను.

"నాన్నకి రూల్స్ అంటే పిచ్చి అనుకుంటారు అందరూ.. కాదు.. ఆయనకి జనం అంటే పిచ్చి.. అలాంటి నియమాలు వుంటే మన అందరి జీవితాలు బాలెన్స్‌గా

వుంటాయని చెప్పేవాడు. జీవితాంతం ఎలాంటి నియమాన్నీ దాటలేదు ఆయన. ఆయనకి ఇష్టం లేని నియమాలు చాలా వున్నాయి. అయినా అవన్నీ పాటించేవాడు... అలా పాటించని వాళ్ళంటే ఆయనకి చిరాకు, కోపం, జాలి కూడా. అందుకే అందరితో అలా గొడవలు పెట్టుకునేవాడు. ఇంటికొచ్చి ఎంతో మధన పడేవాడు. ప్రపంచం అంతా పద్ధతిగా వుండాలని కలవరించేవాడు.. అలాంటి ప్రపంచం ఇక సాధ్యంకాదని అమ్మతో చెప్పారట.. తెల్లవారేసరికి గుండె ఆగిపోయింది..." చెప్తూనే ఏడ్చాడు అతను.

నేను ఆశ్చర్యం నుంచి తేరుకునే సరికి అతను లోపలికి వెళ్ళిపోయాడు. నాకెందుకో అక్కడి నుంచి వెళ్ళాలనిపించలేదు. ఆయన అంతిమ యాత్రకి ఏర్పాటు జరుగుతుంటే అవన్నీ చూస్తూ స్తబ్దుగా వుండిపోయాను. ఎత్తుబడి జరిగిపోయింది..

"గోవిందా గోవిందా అంటూ పడమటివైపు కదలండి" చెప్పాడు పురోహితుడు. నేను అప్రయత్నంగానే కల్పించుకున్నాను.

"అటు కాదు.. రోడ్డుకి ఎడమ వైపున నడుస్తూ చివరిదాకా వెళ్ళి, అక్కడ క్రాసింగ్ దగ్గర రోడ్డు దాటి ఇటు వెళ్ళండి" చెప్పాను.

"కానీ శ్మశానం ఇటు వుందండీ" అన్నారెవరో.

"ఆయన చెప్పినట్లే చేద్దాం" అన్నాడు రామనాధంగారి పెద్ద కొడుకు నా వైపు చూస్తూ. నేను చెప్పినట్లే అంతిమ యాత్ర మొదలైంది.

ఇప్పుడు మీరు గాని జాగ్రత్తగా గమనిస్తే రామనాధంగారి ముఖంలో చిరాకు మచ్చుకైనా కనిపించదు..!!

(సురభి మాసపత్రిక, అక్టోబర్ 2010)

ఏడు తరువాత..

ఒక రోజు సాయంత్రం భలే విచిత్రం జరిగింది. ఏదో ధ్యాసలో అంకెలు లెక్కపెట్టుకుంటున్నానా, ఉన్నట్టుండి ఏడు తరువాత అంకె ఏదో గుర్తుకురాలేదు. బాగా ఆలోచించాను. ఒకసారి వరసగా లెక్కపెట్టుకుంటూ చూశాను. ఒకటి, రెండు, మూడు, నాలుగు, ఐదు, ఆరు, ఏడు.. అంతే అక్కడే ఆగిపోతోంది. ఆ తరువాత ఇంకా అంకెలు వున్నాయని తెలుస్తోంది కానీ, అవేమిటో గుర్తుకురావటం లేదు. తల బద్దలు కొట్టుకున్నా ఫలితం లేదు.

"ఏమే.. కాంతం.. ఏడు తరువాత ఏమిటి?" అడిగాను భార్యని. చాలా సందర్భాలలో మా కాంతం నా కన్నా ఎక్కువ తెలివైనదని నిరూపించింది కాబట్టి ఆమె దగ్గర నుండి సరైన సమాధానం వస్తుందని వూహించాను.

"ఏడు తరువాత ఏముంది.. 'జీడిపాకం జీవితాలు' సీరియల్ వస్తుంది.." అంది తాపీగా.

"అబ్బా అది కాదే... ఏడు అంకె తరువాత ఏమొస్తుందీ అని..." ఆమెకు అర్థం అయ్యేలా చెప్పాను. ఆమె కూడా కొంచెంసేపు ఆలోచించింది. ఏం లాభం లేకపోయింది. ఏడు తరువాత అంకేదో గుర్తుకురాలేదు.

"చాల్లే సంబడం.. నాకు ఇంకేం పని లేదనుకున్నారా? ఏడు తరువాత ఏముంటే నాకెందుకు... మీరు తీరిగ్గా ఆలోచించుకోండి.." అంటూ విసవిసా వంటింట్లోకి వెళ్ళిపోయింది.సమాధానం తెలియనప్పుడు తెలియదని ఒప్పుకోకుండా తప్పుకోవడమూ తెలివితేటలే అనుకున్నాను. మళ్ళీ శేష ప్రశ్న ముందుకొచ్చింది. ఏడు తరువాత అంకె ఏమిటి?

బయట బజార్లో ఎవరినైనా కనుక్కోని వస్తానని బయల్దేరాను.

మా ఇంటి చుట్టుపక్కల ఇళ్ళలో వున్న వాళ్ళని ఒక్కొక్కర్ని కలిసి అడగటం మొదలుపెట్టాను. ఆశ్చర్యం..!! ఏ ఒక్కడికీ గుర్తు రావటం లేదు.

"ఏడు తరువాత?"

"ఏడు తరువాత ఏముంది.. ఆఫీసు నుంచి ఇంటికి రావటం. టీవీ చూడటం, తినడం, పడుకోవడం.. దాదాపు అందరూ ఇదే సమాధానం. ఈ పనికిమాలిన టీవీ ఒకటి వచ్చిన తరువాత టీవీ చూడటం ఒక పని అయిపోయింది అందరికీ. కుటుంబం, సంసారం, పిల్లలు ఇవేవీ లేవు...!! సరే ఆ విషయాలు మనకెందుకు?

"అది కాదండీ.. ఏడు తరువాత అంకె ఏమిటని నా ప్రశ్న..." అని అడిగితే వెంటనే నిశ్శబ్దం. ఒక్కడూ సమాధానం చెప్పడే. ఒక్కొక్కడు ఒకో తరహా. ఒకడు తల పైకెత్తి ఆలోచిస్తున్నట్లు నటిస్తాడు. ఇంకొకడు మనసులోనే ఒకటి నుంచి మొదలుపెట్టి లెక్క పెట్టుకుంటాడు. ఇంకొక మహా ఇల్లాలు నా వైపు చిరాగ్గా చూసి తలుపేసేస్తుంది. అయినా సరే ఒక్కరి దగ్గరా సమాధానం లేదు. అందరూ మర్చిపోయారు. ఏడు తరువాత ఏంటి?

"పోనీ మా ఇంటి దగ్గర ఒక మేధావి వున్నాడు. చాలా టీవీ చర్చల్లో పాల్గొన్నాడు.. అతణ్ణి అడుగుదామా?" సలహా చెప్పాడు స్నేహితుడు కృష్ణ. ఇద్దరం సరే అనుకొని మేధావి దగ్గరకు వెళ్ళాం.

"మేధావిగారూ మేధావిగారూ.. ఏడు తరువాత ఏమొస్తుందండీ?" అన్నాను గౌరవంగా.

"చూడండీ.. అయిదు తరువాత ఆరు వచ్చింది.. ఆరు తరువాత ఏడు వచ్చింది.. దీని బట్టి చూస్తే ఏడు తరువాత ఏదో వస్తుందనే అనిపిస్తోంది. అయితే ఆరు తరువాత ఏడు రావటంలో ఆరు ప్రోద్బలం ఏమన్నా వుందా? లేదా? అనేది పరిశీలించాలి. దాన్ని ఆధారం చేసుకొని ఏడు తరువాత ఏమొస్తుందో మనం కనుక్కోవచ్చు.." ఆయన టీవీ చర్చల్లో చెప్పినట్లు చెప్పుకుపోతున్నాడు. మనం మేధావి అయితే 'నాకు తెలియదు' అని చెప్పాల్సిన అవసరమే వుండదని అర్థం అయ్యింది.

"పోనీ ఎవరైనా లెక్కల మాస్టర్ అయితే చెప్పేస్తాడేమో... పక్క వీధిలో బాదరాయణ అని కోచింగ్ సెంటర్ నడిపే లెక్కల మాస్టారు వున్నారు. ఆయన్ను కలుద్దామా?" కృష్ణ మళ్ళీ సలహా పారేశాడు. ఇద్దరూ అక్కడికి చేరుకున్నాం.

"బాదరాయణగారూ..ఏడు తరువాత ఏమిటండీ?"

"వుండే వుంటుంది ఏదో... అయినా దానికి విలువెక్కడిదీ.. ఇప్పుడు ఎమ్‌సెట్ ర్యాంకులే తీసుకోండి.. ఒకటి, రెండు, మూడు... అంతే ఆ తరువాత ఏ అంకె వస్తే మాత్రం లాభం ఏముంది? వాటి గురించి, అవి తెచ్చుకున్న వాళ్ళ గురించి తెలుసుకోని మాత్రం

ఏం ఉపయోగం?" అని చెప్పి పిల్లల మీద తన పాఠాల బాదుడు, చదువుల చాదుడు కొనసాగించాడు బాదరాయణ.

కృష్ణ ఇక వల్లకాదని చేతులు ఎత్తేశాడు. నేనొక్కణ్ణే కనపడ్డవాళ్ళందరినీ అడుగుతూ తిరుగుతున్నాను. ఒక పార్క్ కి వెళ్ళి చెట్లు లెక్కపెట్టడం మొదలు పెట్టాను. మళ్ళీ అదే గొడవ.. ఆరు.. ఏడు.. తరువాత ఆగిపోతుంది. అక్కడే గడ్డిలో పడుకోనున్న వ్యక్తి ఏమిటి సమస్య అని అడిగాడు. అతను చిత్రకారుడట. నేను నా సమస్య చెప్పాను. "వున్నవే ఏడు అంకెలు... ఇంక తరువాత ఏముంటాయి? ఇంద్రధనుస్సు చూడండి... ఏడే రంగులు.." చెప్పాడతను. అక్కడే ఆడుతున్న క్రికెటర్ ని అడిగాను

"అసలు ఏడు అనే అంకె వుందా... నాకు తెలియదంకుల్... నాకు తెలిసినంత వరకూ సిక్సరే అన్నింటి కన్నా ఎక్కువ" చెప్పాడు.

నేను అక్కడి నుంచి బయటపడి బస్సు ఎక్కాను. కనపడ్డవాళ్ళందరినీ అడుగుతూనే వున్నాను. మంచి ఫార్మల్ బట్టలు, టై కట్టుకున్న సాఫ్ట్‌వేర్ వుద్యోగి కనిపించాడు.

"బాబూ ఏడు తరువాత ఏమొస్తుందో తెలుసా?" అడిగాను.

"ఓస్ అదేం పెద్ద విషయం... ఏడు తరువాత మళ్ళీ మొదటికొస్తుంది... వారం అంతా గొడ్డు చాకిరీ చేస్తామా, వారాంతంలో రెండు రోజులు నిద్రకి, బట్టలు ఉతుక్కోడానికి, సినిమాకీ, మందుకీ సరిపోతుంది.. ఆ తరువాత మళ్ళీ సోమవారం.. మళ్ళీ అదే ఆఫీసు.. అదే గొడ్డు చాకిరీ" దిగులుగా చెప్పాడతను.

కండక్టర్ వచ్చి టికెట్ ఇచ్చాడు. అతనికి రోజా అంకెలతో, లెక్కలతోనే కదా పని అని ఆయన్ని అడిగాను– "ఏడు తరువాత ఏమిటండీ?" అని.

"ఏడు తరువాత ఏడుంపావలా.. ఏడున్నర..."

"ఆ తరువాత..?"

"అదే లాస్ట్ స్టాప్.."

తల పట్టుకున్నాను నేను. వెనకటికి పేరు మర్చిపోయిన ఈగ కథలా తయారయ్యింది నా బతుకు. ఏడు తరువాత అంకె ఏమిటో గుర్తుకురాదు. అలాగని వదలనీయదు. బస్సు దిగిన తరువాత ఒక్క చోట ఖద్దరు చొక్కా వేసుకున్న చోటా నాయకుడు కనపడ్డాడు.

"అయ్యా... నమస్కారం..." చేతులు జోడించాను భక్తిగా.

"అధికార పక్షమా.. ప్రతి పక్షమా.." అడిగాడు ఆయన.

"ప్రజా పక్షం..."

"ఇదో కొత్తపార్టీనా? సరే ఏమిటి నీ సమస్య..?

"ఏడు తరువాత..??" సణిగాను.

"ఏమిటి ఏడు తరువాత...? ఉన్న టర్మే అయిదేళ్ళు... అది కూడా వుంటుందో వూడుతుందో తెలియని ప్రభుత్వాలు... పదవి కొనుక్కున్న దాంట్లో సగం కూడా సంపాయించుకోక ముందే ఎలక్షన్లు... అయిదేళ్ళే చూడక చాన్నాళ్ళైంది... ఆ తరువాత నాకేం తెలుసు.." అంటూ ముందుకు కదిలాడు ఆయన.

ఆయన వెనక వుండే అనుచరగణంలో ఒకతను నన్ను పక్కకి పిలిచి విషయం చెప్పాడు – "ఏడు తరువాత అయ్యగారు మందు, విందు, పొందు మూడ్‌లో వుంటారు.. నేను ఏర్పాటు చేస్తా... నీ పని కావాలంటే ఏడు తరువాత రా..."

"ఆ ఏడు తరువాతే నా సమస్యరా" అని అనుకొని బాధపడి అక్కడి నుంచి కదిలాను. ఊరంతా తిరిగాను. కనపడ్డవాళ్ళందరినీ అడిగాను. ఏ ఒక్కరూ ఏడు తరువాత అంకె ఏమిటో చెప్పలేకపోయారు. ఉస్సూరంటూ ఇంటికి చేరాను.

"అయ్యిందా మీ రాచకార్యం.." వెటకారంగా అడిగింది కాంతం.

"ఏం కార్యమో... ఊరంతా తిరిగాను. ఒక్కళ్ళంటే ఒక్కళ్ళు కూడా చెప్పలేకపోయారు" కుర్చీలో కూలబడి అన్నాను.

"ఏమిటండీ చెప్పేదీ..?"

"అదే ఏడు తరువాత ఏమిటి అనే ప్రశ్నకి సమాధానం.."

"బాగానే వుంది సంబడం... ఇంకా వదల్లేదా దాన్ని, ఏడు తరువాత ఏముంటే మనకెందుకండీ... అదంతా ఆలోచిస్తే మనకేమొస్తుంది చెప్పండి? రేపు పిల్ల స్కూల్ ఫీజు కట్టాలి... అదెట్లాగో ఆలోచించండి.. ఈ సంసారం ఎట్లా గడవాలో ఆలోచించండి.. పచారి కొట్టు కాంతయ్యకి నాలుగువేలు బాకీ వున్నాం... అది ఆలోచించండి." కాంతం బాధగా కళ్లొత్తుకుంది.

పచారి కొట్టు కాంతయ్య...!! ఆయన్ను అడగడమే మర్చిపోయాను. పెద్ద పెద్ద చక్రవడ్డీ లెక్కలు కూడా లెక్క కట్టి చెప్పేస్తుంటాడు. ఆయన తప్ప ఇంకెవరు నా ప్రశ్నకి సమాధానం చెప్పగలరు? కుర్చీలోంచి ఛివాలున లేచి కాంతయ్య కొట్టుకి పరుగు పెట్టాను.

"కాంతయ్యా... కాంతయ్యా..."

"ఏం బాబూ... బాకీ డబ్బులు తెచ్చావా?" విషయం వినకుండానే విషయానికి వచ్చాడు కాంతయ్య.

"అబ్బ అది కాదు కాంతయ్యా... పొద్దున్నుంచి ఒక సమస్య పట్టి పీడిస్తోంది... ఏడు తరువాత అంకె ఏమిటో గుర్తుకురావటంలేదు... కనపడ్డవాళ్ళందరినీ అడిగాను... ఏడు తరువాత ఏమిటి? అని... అదేం చిత్రమో ఏడు తరువాత..." నేను చెప్తుండగానే మధ్యలో అందుకున్నాడు కాంతయ్య.

"అబ్బబ్బ... కొట్టు ముందు నిలబడి ఏడు.. ఏడు.. ఏడు... అనవాకయ్యా... ఏడు అంటే ఏడుపే అవుద్ది కథ...అందుకే కదా ఆరున్నొక్కటి అనేది..." చెప్పాడు కోపంగా.

"అయితే ఆ ఆరున్నొక్కటి తరువాత ఏమిటి" అడిగాను.

కాంతయ్య ఆలోచించాడు కానీ అతనికీ గుర్తుకురాలేదు. "ఆరున్న రెండు..." అన్నాడు తెలివిగా.

నేను నిరాశగా నిట్టూర్చాను.

"నేను సెప్పనా బాబయ్యా..." అని వినపడి వెనక్కి తిరిగాను. వెనకాల ఫకీరు. మాసిన బట్టలు, పెరిగిన గడ్డం.. వాణ్ణి చూస్తేనే అసహ్యం వేసింది. పైగా వాడికి పిచ్చి అని కూడా అందరూ అంటుంటారు.

"ఏంట్రా... నువ్వు చెప్పేది?" కోపంగా అన్నాను.

"ఏడు తరువాత.."

"ఆ తరువాత..."

"ఏడు ఏడుపైతే ఆ తరువాత వచ్చేది నవ్వే కదా బాబయ్యా... ఏడుపు తరువాత నవ్వు, నవ్వు తరువాత మళ్ళీ ఏడుపు. ఇదే కదా దేవుడి గారడీ..." నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు ఫకీరు.

నేను ఇంటి వైపు అడుగులేశాను.

"వచ్చారా.. ఇదుగో ఇప్పుడే పిల్ల స్కూల్ నుంచి వస్తే మీ ప్రశ్న సంగతి చెప్పాను.. దానికి తెలుసట..." చెప్పింది కాంతం.

నా కూతురు వచ్చి ఎదురుగా చేతులు కట్టుకొని మొదలుపెట్టింది–

"ఒకటి.. రెండు.. మూడు.. నాలుగు.. అయిదు.. ఆరు..ఏడు.. ఎ..." నేను ఆపమన్న సైగ చూసి ఆపేసింది. నాకు వినాలనిపించలేదు. ఎందుకో ఫకీరు చెప్పిన సమాధానమే బాగుందనిపించింది.

(సాక్షి ఫన్ డే, 15 ఏప్రిల్ 2012)

మంత్రిగారి సమాధి

ఇప్పటికి నలభై ఏళ్లయింది, ఈ స్మశానంలో నేను వుండబట్టి. స్మశానంలో వున్నానంటే నేనేదో శవాన్నో, దయ్యాన్నో అని మీరు అనుకుంటున్నారేమో.. స్మశానం అంటే సమాధులు, శవాలు, దయ్యాలే కాకుండా మనుషులు కూడా వుంటారని మీ గుర్తుకు రాకపోవటం ఏమంత ఇసిత్రమేమీ కాదు. మీ తప్పూ కాదు.

అయ్యా, నన్ను కాటికాపరి అంటారు. నా బతుకు, జీవితం అంతా శవాలు, సమాధుల్లోనే వుంది. పది మంది మంచి కోరుకోవాల్సిన మానవ పుటక పుట్టినా, ఈ పాడు కడుపు కోసం పది మంది చస్తే బాగుండు అని కోరుకోవాల్సిన బతుకు నాది. ఏం చేస్తాం.. అట్టా పుట్టించాడు దేముడు.

సరే, ఇంతా నేను చెప్పొచ్చేదేమిటంటే మొన్న నాలుగు రోజుల క్రితం నా అరవై ఏళ్ళ జీవితంలో చూడని రెండు ఇసిత్రాలు చూశాను నేను. అయ్యి ఎట్టాటివంటే మీ లాంటి పెద్ద మనిషికి చెప్పకుండా వుండలేనటువంటివి. నా సంగతి చెప్పనే చెప్పాను కదా.. స్మశానంలో వుండే నాబోటోడికి మాట్టాడుకునేదానికి ఎవడు దొరుకుతాడు? అందుకే మీకు చెప్పుకుంటున్నా.. నాలుగు రోజుల క్రితం తెల్లవారేటప్పటికి చూద్దును కదా స్మశానానికి ఉత్తరం వైపు వున్న గోడ కూలిపోయి వుంది. కూలిపోవడం అంటే కూలిపోవడం కాదు..

ఎవరో జాగ్రత్తగా గడ్డపారతో కొట్టి కూల్చినట్టు ఆ చివర నించి ఈ చివరదాకా ఖాళీగా వుంది. 'రాత్రి తెల్లారేసరికి గోడ ఎట్టా కూలిందిరా?' అని మీరనచ్చు.. 'సరే ఎవడో కూల్చాడనుకో... అప్పుడు నువ్వేం చేస్తున్నావ్?' అని కూడా మీరు అడగచ్చు.

ధర్మప్రభువులు మీరు అడగకపోతే వూర్లోవున్న పెద్దమనుషులు అయినా అడుగుతారు. నేనేం సమాధానం చెప్పేది? ఒక వర్షమా, ఒక పిడుగా

ఒక బూకంపమా? ఏదీ లేక పాయే...!! రాత్రి నాలుగు గుటకలు సారా తాగిన మాట నిజమే కానీ, ఆ విషయం నేనే ఎట్టా చెప్పేది. నేను చెప్పినా చెప్పక పోయినా, 'తాగి తొంగున్నా వట్రా?' అని అడగకుండా వుంటారా అని అనుమానం వచ్చేసింది. 'తాగుబోతోడివి నువ్వు ఈడ వుండద్దు పో' అంటారేమో అని భయపడ్డాను. కానీ అదేందో ఇచిత్రం. ఒక్క పెద్ద మనిషీ ఆ విషయమే అడగలేదు. అటు దిక్కుకు వచ్చినా ఆగోడ వంక చిత్రంగా చూడనైనా చూడలేదు. ఆదేం ఇచిత్రమో నాకర్థంకాలా..!!

అదట్టా వుండనీయండి.. అసలు గోడ కూలగొట్టినోళ్ళు లోపలికి జొరబడి ఏం చేశారు అనేది ఇంకో ప్రశ్న. ఏ సమాధినో తొవ్వి లోపల శవాన్ని ఎత్తుకెళ్ళారా?ఎత్తుకెళ్ళి మాత్రం ఏం చేస్తారు? బయట తిరిగే జనాలమాదిరి శవాలు ఏడువారాల నగలు, పర్సులో డబ్బులు పెట్టుకోని తొంగోరు కదా? వున్న గుడ్డలు కూడా చివికి చివికి చిరుగులు పట్టి వుంటాయి.

ఇంక శవాన్ని తీసుకెళ్ళి ఏ చేతబడులో, మాంత్రికం పనుల్లో చేశారేమో అని అనుకుందామంటే ఇంత వరకు అట్టాటివి ఇనటమే కానీ, చూసింది లేదు. మా అయ్యచెప్పేవాడు, అఘోరాలు, తాంత్రికులు స్మశానాల్లో, శవాల దగ్గర పూజలు చేత్తంటారని.

పుట్టి బట్టకట్టిన తర్వాత ఇంత వరకు అట్టాంటాళ్ళని చూసినట్టు గమనమే లేదు. ఎందుకైనా మంచిదని సమాధి సమాధి తడివి తడివి చూసినా... గుట్ట గుట్ట తట్టి తట్టి వెతికినా.. ఏడా అట్టాటి జాడ అగపడలేదు.

ఇంక ఆ రేత్రికి ఎందుకైనా మంచిదని చుక్కేసుకోకుండా అట్టాగే కూచోని ఏం జరగతదా అని ఆత్రంగా చూస్తావున్నా. అప్పుడే నేను జెప్పిన రెండో ఇచిత్రం నా కళ్ళబడింది. ఎవడో మనిషి.. కూలిపోయిన ఉత్తరం గోడ కొసాన వున్న నల్లరాయి సమాధి మీద కూర్చోని వున్నట్టు గోచరమైంది. దయ్యమో భూతమో అయ్యుంటుందని నాకనిపించలేదు. ఎందుకంటారేమో.. మూడు తరాలుగా ఈ పని చేస్తా వున్నాము. మా తాత గాని అయ్యగాని దయ్యాలు వుండాయా లేదా అనే మాట ఇలావరిగ్గా ఎప్పుడూ చెప్పనే లేదు.

"కోరికలు తీరకపోతే దయ్యమై పుడతార్రా" అన్నాడు నాయన ఒకసారి కల్లుతాగి. అయితే "నువ్వు జూసినావా నాయనా" అంటే "ఒక్కటి గూడా చూల్నే" దన్నాడు–

"అందరూ కోరికలు తీరాకే చస్తాన్నారు గావాల్న" అనుకోని నేను గమ్మునే వుండిపోయినా. ఇంక అట్టాటప్పుడు ఆ ఆలోచన నాకెట్టా వస్తాది?

"ఎవుర్రా అదీ.." అని అరిచినా. సమాధానం రాలా..

"ఎవురంటే పలకరేందిరా.." అన్నా ఇంకా గట్టిగా. ఆ మనిసి ఎవుడోగాని, విన్నా ఇననట్టే అటు తిరిగి అట్టాగే కూర్చోనున్నాడు. కనీసమంటే తల కూడా తిప్పలా. చేతి కర్ర అందుకోని, టార్చిలైటు వేసుకుంటా ఆ చివరికంట పొయినా.

"ఎవర్రా.. ఎవరూ.." అని అంటూనే వెళ్ళా గాని సమాధానం మటికి రాలా. దగ్గరకి పోయి ఆ మనిషి మీద లైటు వేశా. ఏభై ఏళ్ళ పెద్దాయన, ముఖంలో దిగులుతో కూర్చోని వున్నాడు.

"ఎవరు బాబయ్యా.. పిలత్తంటే పలకరేంది.." అన్నా. ఆయన తలెత్తి చిన్నంగా చెప్పాడు.

"నేనెవరో చెప్తా గానీ.. భయపడకూడదు.." అన్నాడు.

"నా స్మశానంలో నాకు భయమేంది.. ఏం చెప్తావో చెప్పు.." అన్నాను కోపంగా.

"నేను.. దయ్యాన్ని.. ఇదుగో ఇదే నా సమాధి.." అన్నాడు నల్లరాయి సమాధి చూపిస్తూ. నమ్మాల్నా లేదా అని చానా సేపు ఆలోచించినా.

"నేను చెప్పేది నిజం.. నేను నాలుగు నెలల క్రితం చచ్చిపోయిన మినిష్టర్ పాపయ్యని" అన్నాడు నల్లరాయి మీద చెక్కిన అచ్చరాలు చూపిస్తూ. అక్కడేమి రాసుందో తెలియదు కానీ, నాలుగు నెలల క్రితం ఎవరో మినిష్టర్ గారు సచ్చి మా స్మశానానికి వచ్చింది మాత్రం నిజమే. ఆ యాళ ఒకటే జనం... తొక్కుకుంటూ తోసుకుంటూ అంతా ఆగం ఆగం జేసినారు.

నాలుగైదు గుట్టల్ని తొక్కి పాడు జేస్తే, మళ్ళీ సరి జెయ్యడానికి నాకు రెండు రోజులు పట్టింది. అయితే అందరూ తలా అంత ఇవ్వడంతో వారం పనిజేస్తే వచ్చే డబ్బులు ఒక్కరోజే వచ్చినాయి.

"భలేటోడివేనయ్యా.. మినిస్టేరునంటావు.. అంత డబ్బులు వుండాయి కదా నీ కాడ.. ఇంకా తీరని కోరికలుంటాయా.. ఇట్టాగ దయ్యమై వచ్చావు.." అనడిగా. నేను భయపడకుండా నిలబడేసరికి ఆ మినిస్టేరు దయ్యం గారికి ఆశ్చర్యం వేసింది. ఆ మాటే చెప్పి అన్నాడు–

"నాలుగు నెలల నించి ప్రశాంతంగానే వున్నా.. నిన్న రాత్రే మెలుకువ వచ్చింది.. ఎవరో నా పక్కనే ఖణ ఖణయని కొడుతున్నట్టు అనిపిస్తే లేచి కూర్చున్నా.. పక్కన చూస్తే ఇదుగో ఈ గోడ పడగొడతా వున్నారు.." చెప్పాడు.

"ఇదేం ఇచిత్రం.. సచ్చినోడికి కూడా ఇనపడేట్టు కొడితే..వూరకే మందు కొట్టి పడుకున్నానే..నా కెట్టా ఇనపళ్ళేదు" అన్నాను నేను.

“ఇనపడపోతే ఏమైంది.. ఇప్పుడు కళ్ళ ముందే కనపడుతోంది కదా..” అన్నాడు.

“సరే సామీ.. ప్రాణమన్నాక పోకుండా వుంటదా గోడన్నాక పడకుండా వుంటదా.. దానికి నువ్వేమిటికి ఇదైపోతున్నావు..” అన్నాను నేను.

“ఈ గోడ పడిపోలేదు.. కూల్చారు..చూడు గోడ కొట్టేసిన తరువాత ఇటుక, మట్టి కూడా మిగలకుండా ఎత్తుకెళ్ళారు..” చెప్పాడాయన.

“అవును సామి.. నాగ్గూడా ఇట్టాటి అనుమానమే వచ్చింది.. అయితే ఇట్టాగ స్మశానం గోడ కూల్చేటికి ఎవరికి అవసరం వుండాది.. అదే అర్థం కాకుండా వుండాదే..” అన్నాను ఆలోచిస్తా..

“అవన్నీ చెప్తాను కానీ, నాకో సహాయం చేసి పెడతావా..?” అడిగాడు.

“అట్టాగే సామీ.. అయినా నీ అంత పెద్దాయనకి నేను జేసి పెట్టేదేముంటాది..” అన్నాను పక్కనే కూర్చుంటూ. “నేను బతికుంటే, పదవిలో వుంటే ఇవన్నీ ఒక్క లెక్కలో తీర్చేసేవాణ్ణి.. అందుకే నువ్వే సాయం చెయ్యాలి..” అన్నాడు.

“అట్టాగే అన్జెప్తున్నా గదా.. అదేందో చెప్పు సామీ..”

“ఏం లేదు.. ఇక్కడ గోడ కూలిపోయిన విషయం నువ్వు వెళ్ళి వూర్లో పెద్ద మనుషులందరికి చెప్పాలి..” హడావిడిగా చెప్పేడయన.

“నాకు జెప్పేదేంది సామీ.. పెద్దమడుషులంతా రోజూ ఇదే దిక్కు తిరగతావుంటారు.. అందరూ చూశారు. ఇంగ నేనుపోయి జెప్పేదేంది..?” అనడిగా బీడీ ముట్టించుకుంటూ. దయ్యాలకు నిప్పు చూస్తే భయమని మా నాయనమ్మ అనేది. మినిస్టరు దయ్యానికి ఆ పట్టింపు లేనట్లుంది, ఆయన మాత్రం తన ధోరణిలో చెప్పుకుంటా పోతున్నాడు–

“తెలిసినా ఎవ్వరూ వచ్చి నిన్నడగలేదా..?”

“లేదు సామీ.. అదే విచిత్రంగా వుంది..”

“ఇందులో ఇచిత్రం ఏముంది.. అందరికీ అంది వుంటాయి..”

“ఏం అందాయి సామీ..”

“డబ్బులు రా డబ్బులు.. నీకర్థం కాదులే..మీడియా.. మీడియాని పిలిచి..”

“ఏంటి దొరా? వీడియోనా..”

“వీడియోకాదురా.. మీడియా.. పేపరు వాళ్ళు, టీవీ.. వాళ్ళని కలువు.. ఇట్లా గోడ కూలిందని పేపర్లో టీవీలో వ్రాయించు..” ఆవేశంగా అరిచాడు.

“ఇంత సిన్న ఇశయానికి పేపర్లో ఎందుకు సామీ..” అన్నాను నేను చప్పరిస్తూ.

"ఇది చిన్న విషయం కాదురా.. ఈ గోడని ఎందుకు కూల్చారో తెలుసా? ఈ స్మశానాన్ని కబ్జా చేస్తున్నారు.. నిన్న గోడ అయ్యింది.. రేపెప్పుడో నా సమాధి కూలుస్తారు రా.. నాకు మిగిలింది ఈ కాస్త స్థలమే.. అది కూడ లేకపోతే ఏ చెట్టుకో వేలాడాలి.. నీకు పుణ్యముంటుంది.. ఎలాగైనా ఆపించరా." అంటూ ఏడ్చేసినంత పని చేసిందా మినిస్టేరు దయ్యం.

"అయ్యా. తవరు చెప్పింది ఇంటే వూరక భయపడుతున్నారని అనిపిస్తంది.. అట్టాటిది ఏమి లేదు.."

"నీకు తెలుసా నాకు తెలుసా.. ఆ వచ్చిన వాళ్ళని చూశావా నువ్వు.. వాళ్ళంతా నా దగ్గర పని చేసినోళ్ళే.. వాళ్ళు చేసే పనేమిటో, ఎలా చేస్తారో నాకు బాగా తెలుసు.. నా మాట విను.. నా సమాధిని కాపాడు.." దణ్ణం పెట్టి మాయమయ్యాడు ఆ దయ్యం సామి.

అయ్యా అదీ కథ.. నేను ఈ విషయం ఏ పెద్దోళ్ళకి జెప్పినా వినీ విననట్లు వూరుకుంటున్నారు. నీకేమైనా పిచ్చి పట్టిందా అంటున్నారు. వూర్లో ఎవరికి చెప్పినా నవ్వుకోని, ఆ మినిస్టేరుకి బాగా శాస్తి జరిగిందని అంటున్నారు. తవరేమన్నా ఆయన సమాధి కాపాడేదానికి ఏమన్నా చేస్తారా..??

(స్వప్న మాస పత్రిక, ఆగష్టు 2011)

చినుకులా రాలి...

మా నాన్న పేరు మేఘం. అమ్మపేరు ధరిత్రి. నాన్న అమ్మకి వ్రాసిన ప్రేమ లేఖనే నేను. నా పేరు చినుకు.

"జాగ్రత్త కన్నా... అపురూపంగా చూసుకున్న నిన్ను అమ్మ దగ్గరికి పంపుతున్నాను. మీ అమ్మ మనసు విశాలమైంది. ఆ సువిశాల సామ్రాజ్యంలో విహరించే హక్కు నీకు ఇస్తున్నాను. అక్కడ నీ కోసం సముద్రుడనే ప్రియుడు ఎదురుచూస్తుంటాడు. అతని గుండె ఎంతో లోతైనది. అతన్ని కలవడమే నీ జీవితానికి పరమార్థం..." చెప్పాడు నాన్న నేను పుట్టగానే.

"సరేలే నాన్నా... అక్కడ అమ్మ వుందిగా" అన్నాను నేను వురకలేసే ఉత్సాహంతో కదులుతూ.

"పిచ్చి తల్లీ... తొందర నీ జీవన లక్షణం. కానీ, అక్కడ ఎన్నో అవాంతరాలు ఉంటాయి... ఎత్తిపడేసే జలపాతాలు, కట్టిపడేసే ఆనకట్టలు వీటన్నింటినీ దాటాలి... నేను నిన్ను ఒక్క కంట కనిపెడుతూనే వుంటాలే... జాగ్రత్తగా వెళ్లిరా" అని నన్ను సాగనంపి ఉత్తర దిశగా వెళ్ళిపోయాడు నాన్న.

'టప్' మని అమ్మకి ముద్దుపెడుతూ నేలపైన రాలాను. నాతోపాటే ఎన్నో వేల చినుకులు... అమ్మ ముద్దుల్లో తడిచిపోతోంది. అయినా ఆమె ముఖంలో ఆనందం లేదు.

"ఇంత మంది నీ కోసం వస్తే ఎందుకమ్మా నిరాశగా వున్నావు?" అడిగాను నేను.

"మీరు వస్తారని ఎంత కాలం నుంచి ఎదురుచూస్తున్నానో తెలుసా? మీ నాన్న నన్ను బొత్తిగా మర్చిపోయాడేమో అని ఎంత కలవరపడ్డానో

తెలుసా? మీ మామయ్య వాయువు ఈ మధ్య చెడిపోయాడు. వంటి నిండా కల్మషాన్ని నింపుకొని, సూర్యుడితో స్నేహం మొదలు పెట్టాడు. సూర్యుడి ప్రతాపంతో నా వళ్లంతా బీటలు వారింది. నీలాంటి ఎన్ని చినుకులు నన్ను చేరాలని ప్రయత్నించినా పుట్టక ముందే ఆవిరై పోతున్నాయి. ఇక మిమ్మల్ని కళ్ళ చూస్తానో లేదో అని ఎంత భయపడ్డానో..” బాధగా చెప్పింది అమ్మ.

“ఏం పర్లేదమ్మా... ఇప్పుడు మేం వచ్చేశాం కదా... చూడు నిన్ను ఎలా నవ్విస్తామో..” అంటూ మిగిలిన చినుకులకు సైగ చేశాను నేను. అందరం కలిసి పిల్ల కాలువగా తయారయ్యాం. అమ్మ వంటి మీదంతా పాకుతూ చక్కిలిగింతలు పెట్టాము. అమ్మ పకపకా నవ్వింది.

అంతలోనే కలవరం.

“పిల్లలూ.. త్వరగా పదండి... ఇక్కడికి దగ్గర్లోనే ఒక నది వుంది.. వెంటనే అక్కడికి వెళ్ళి ఆమెను కలవండి. నదంటే మీ అందరికి అక్కలాంటిది... మిమ్మల్ని జాగ్రత్తగా సముద్రుడి దగ్గరకు చేరుస్తుంది..” చెప్పింది అమ్మ ఖంగారుగా. “అదేమిటమ్మా ఇప్పుడే కదా వచ్చాం అప్పుడే మమ్మల్ని వెళ్లమంటావే?” అడిగాము మేమంతా కలిసి.

“మీకు తెలియదు అమ్మలూ... నా దగ్గర వుంటే ఎన్నో రోజులుగా ఆర్తితో వున్న నా గుండె మిమ్మల్ని నాలోకి కలిపేసుకుంటుంది. నా గర్భంలో జలమై పోతారు..”

“అమ్మ కడుపులో వుండడం కన్నా కావాల్సింది ఏముందమ్మా... నన్ను నీలోనే కలిపేసుకో..” అన్నాను నేను చేతులు చాస్తూ.

“వద్దు తల్లీ వద్దూ... భూగర్భంలో చేరిన ఏ నీటి చుక్కకూ ప్రశాంతత లేదు... మరయంత్రాలు వస్తాయి... నా గుండెల్లో ఇనుప చేతులు దిగబడతాయి... నా కడుపులో వున్న మిమ్మల్ని బలవంతంగా బయటకు లాగుతాయి... ఆ కడుపు కోత నేను భరించలేను బంగారూ... వెళ్లండి నదిలో కలవండి... సముద్రుడ్ని చేరండి..” ఆశీర్వదించింది అమ్మ. ఇక మొదలైంది మా ప్రయాణం. గల గల.. జల జల.. తుళ్లుతూ, దూకుతూ... పచ్చని చెట్లని పలకరిస్తూ వాటిలో ఉత్సాహాన్ని నింపుతూ,సమస్త ప్రాణి కోటికి జవజీవాలను ఇస్తూ జల.. జల.. గల గల... ముందుకి.. ముందుకి..!!

“అదిగో అక్కడే వుంది నది.. పదండి పదండి...” మమ్మల్ని ఉత్సాహపరుస్తూనే వుంది అమ్మ.

నదిలోకి సంగమం... అహా అదో మధుర అభ్యంగనం. తల్లిలా చేరదీసింది నది. పేరు పేరునా పలకరించింది. దారిలో మేము మోసుకొచ్చిన కాగితం పడవలను చూసి చిన్నగా నవ్వింది.

"అదేమిటి అక్కా అలా నవ్వుతావు?" చిన్నబోయి అడిగాను నేను.

"కాగితం పడవలు కాదు చిట్టి తల్లీ... పెద్ద పెద్ద పడవలు చూపిస్తాను. నాతో వస్తారా..?" అడిగింది నది. అందరం ఉత్సాహంగా ఉరకలేశాం.

ఇంతలో ఎక్కడో ఆర్తనాదాలు. ఏదో అపశృతి.

"పిల్లలూ... కుడివైపుకు వెళ్లకండి... ఇటు.. ఇటువైపుకు రండి..." నది అరిచింది భయంగా.

"ఏమైంది అక్కా?" అడిగాను.

"అయ్యో తల్లీ అటు మంచినీళ్ల ఫ్యాక్టరీ వుంది... అటు వెళ్లిన వాళ్లు ప్లాస్టిక్ సీసాలలో బందీలై పోతారు.. మీలా ఇప్పుడే పుట్టిన వాళ్లకు మరీ ప్రమాదం.." చెప్పింది మమ్మల్ని పక్కకు లాగుతూ.

అప్పుడు నిశితంగా గమనించాను అక్కని. మా అందరి కన్నా కొంచెం రంగు తక్కువే.

"ఏమిటక్కా..? స్వచ్ఛంగా వుండాల్సిన నువ్వు ఇలా నల్లబడిపోతున్నావు?" అడిగాను ప్రేమగా.

"పిచ్చి పిల్లా... ఇంకా నువ్వు వేరు నేను వేరు అనుకుంటున్నావా? ఇప్పుడు నాలో నువ్వు కూడా అంతర్భాగం... నీ రంగు కూడా మారుతుంది చూసుకో.." నవ్వింది విషాదంగా.

అవును నిజమే. నా వంటి నిండా బురద అంటినట్టు అసహ్యంగా వుంది. "ఛీఛీ" అంటూ దులుపుకున్నా వదలటంలేదు. నా పాట్లు చూసి చేప పిల్లలు నవ్వాయి.

"ఏమిటా నవ్వు.. మీ దారేదో మీరు చూసుకోక" చిరుకోపంతో అదిలించాను చేపల్ని.

"మా దోవేముందమ్మా.. మీరు ఎటుపోతే అటు రావడమేగా.." చెప్పిందో చేప.

"అయితే దోవతప్పిన చేపల్లాగా పదిమందీ ఇటొచ్చారే... మీ పరివారమంతా ఏది.. కనీసం వంద చేపలు లేనిదే కదలరు కదా.." అడిగాను నాన్న చెప్పిన చేపకథల్ని గుర్తుతెచ్చుకుంటూ.

చేపలు మళ్లీ నవ్వాయి.. అయితే ఈ సారి విషాదంగా..

“ఇంకా ఎక్కడమ్మా వందలచేపలు? మేం పదిమందైనా మిగులుతామో లేదో తెలియని బతుకులైపోయాయి..”

“అదేం?”

“అదిగో అక్కడ పెద్ద పెద్ద గొట్టాలలో పొగలొస్తూ కనిపిస్తోంది చూడు.. అదే ఫ్యాక్టరీ.. దాంట్లో నుంచి నల్లటి నీళ్లేవో వచ్చి మీలో కలుస్తున్నాయి... ఆ నీళ్లు కటిక చేదు.. విషం.. ముందు మీ రంగు మారుతుంది.. మీరు రంగు మారిన ప్రతిసారీ మా గుండెల్లో గుబులు పెరుగుతుంది. ఆ విషం కడుపులోకి చేరిందా మా బతుకులు తేలిపోతాయి..” చెప్పింది చేపపిల్ల ఏడుస్తూ...

ఇంతలోనే ఓ పెద్ద చేప అరిచింది. “తప్పుకోండి.. నల్ల విషం వస్తోంది.. తప్పుకోండి..”

చేపపిల్లలు చక చకా ఈది దూరంగా పారిపోయాయి. ఏం జరుగుతుందో తెలిసేలోపలే విషం వచ్చి నన్ను తాకింది. వొళ్లంతా భగ్గున మండింది. క్రమ క్రమంగా నా రూపురేఖలే మారిపోయాయి. బలవంతంగా నన్ను ఆక్రమించి, నా వంటి నిండా మరకలు చేసి నాలో కలిసిపోయిందా విషం. ఇప్పుడు నాలోనే విషం వుంది. నన్ను చూస్తేనే చేపపిల్లలు పారిపోతున్నాయి.

నన్ను ఇలా మరకలతో సముద్రుడు చేరదీస్తాడో, తిరస్కరిస్తాడో. అడుగుదామంటే నది అక్క కనపడటంలేదు. “ఇప్పుడు నాలో నువ్వు అంతర్భాగం..” అక్క చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి. అంటే ఇప్పుడు నేనే నదిని. కలుషితమైన నదిని.

అంతలోనే అదేదో పెద్ద పడవ కనపడింది. మునుపు కాగితం పడవలతో ఆడుకున్నప్పుడు కలిగిన సంతోషం పెద్ద పడవలని చూసినా కలగడంలేదు. అయినా మొయ్యక తప్పని భారంలా పడవ నా భుజాలమీదకి ఎక్కింది. ఆ బరువు మోస్తూ ఆలోచిస్తున్నాను.

నా పరిస్థితి చూస్తే నాకే జాలేస్తోంది. మంచి నీటినై ఒక ప్రాణి కడుపులోకి వెళ్లినా, దాహం తీర్చానన్న తృప్తి వుండేది. అమ్మ కడుపులోకి ఇంకినా, వున్నంత కాలం వెచ్చగా హాయిగా వుండేది. సముద్రుణ్ణి కలుసుకోవాలని అతని ప్రేమల లోతు కొలవాలని బయలుదేరి ఇలా తయారయ్యాను. ఇంత అపవిత్రమైన తరువాత సముద్రుణ్ణి చేరుకున్నా ఒకటే చేరకున్నా ఒకటే.

నా ఆలోచనలకి భగ్నం కలిగిస్తూ నా వెనకాలే ఏదో కదలిక. తిరిగి చూశాను. అదేదో వింత పదార్థం. జిడ్డు జిడ్డుగా.. జిగట జిగటగా..

"అది ఆయిల్.. దూరంగా పో.. వెళ్లిపో.." మిగతా నీటి చుక్కలు గగ్గోలు పెడుతున్నాయి. నేను అక్కడి నుంచి ముందుకి ఈదాలని చూశాను కానీ నాలో సత్తువ లేదు. అన్ని వైపుల నుంచి ఆ నూనె ఆక్రమించడం మొదలు పెట్టింది. అది కప్పేసిన దారిలో ముందుకు కదలాలన్నా కదలలేని పరిస్థితి. మేం ఆటాడుకున్న కాగితపు పడవలే నయం కాసేపు ఆడించి మాతో కలిసిపోయాయి. మరీ ఈ మరపడవలో.. మా నెత్తిన ఎక్కి మోయించుకుంటూ కూడా వీటికి కృతజ్ఞత లేదు. మాతో కలవని ఆయిల్‌ను తెచ్చి కుమ్మరించాయి. అయిపోయింది. అంతా అయిపోయింది. నేనిప్పుడు పవిత్రత కోల్పోయిన నీటి చుక్కని.

దూరంగా సముద్రుడు కనిపిస్తున్నాడు. ఎన్నో కొండలు, గుట్టలు దాటుకుంటూ తనతో సంగమించడానికి వస్తున్న నదికోసం ఆవేశంగా ముందుకొస్తున్నాడు. అంతలోనే కనిపించిన మాలిన్యాన్ని చూసి నిరాశగా వెనక్కి జారుకుంటున్నాడు. అలాంటి సముద్రుడికి విషం నిండిన మనసుని ఎలా ఇవ్వగలను? మలినమైన శరీరాన్ని ఎలా అందించగలను?

సాగరసంగమానికి అనర్హురాలినై, తిరస్కారానికి గురై ఇంక నేను బ్రతికి మాత్రం ఏం ప్రయోజనం?

"అమ్మా.. నన్ను కాపాడమ్మా.." అరిచాను గట్టిగా.

అమ్మ విషాదవదనంతో కనిపించింది.

"ఈ కలికాలంలో నీటి చుక్కగా పుట్టాక ఈ కష్టాలు తప్పవు తల్లీ.. నీలాంటి ఎన్నో నీటి చుక్కల ఆర్తనాదాలు వినీ వినీ నా గుండె రాయి అయిపోయింది. నాలో క్షమాగుణమే లేకపోయి వుంటే మిమ్మల్ని ఇలా చేసిన వాళ్లని బ్రతకనిచ్చే దాన్ని కాదు.." అంది అమ్మ.

అమ్మ కాకపోతే ఇంక నన్ను రక్షించేది ఎవరు? నాన్న గుర్తొచ్చాడు. అవును నాన్నే కాపాడగలడు..!!

"నాన్నా.. నాన్నా.. నీ దగ్గరకు పిలిపించేది ఎవరు? నాన్నా... ఇక్కడ వద్దు నాన్నా.." పిచ్చిగా అరుస్తున్నాను.

నాన్న ఆకాశం నుంచి జాలిగా చూశాడు.

"నాన్నా.. వద్దు నాన్నా.. ఇలా కలుషితమైన శరీరంతో సముద్రుణ్ణి కలవలేను. నన్ను నీ దగ్గరికి తీసేసుకో.." బ్రతిమిలాడాను నేను.

నాన్న భారంగా తల వూపి, సూర్యుణ్ణి వేడుకున్నాడు. సూర్యుడు సరే అన్నాడు. వెచ్చటి సూర్యకిరణం వచ్చి నా గుండెల్లో దిగింది. నన్ను శుద్ధి చేస్తూ, నా మాలిన్యాలన్నీ కడిగేస్తూ నన్ను పైపైకి లాక్కెళ్లింది సూర్యకిరణం. అలా నేను ఆవిరై నాన్న వైపు పారిపోతూ బాధగా కిందకి చూసాను. సముద్రుడు సహనంతోనే చూస్తున్నాడు. అమ్మకి బాధలో ఆనందం – నేను వెళ్లిపోతున్నానన్న బాధ, ఏ మాలిన్యంలేని దివ్యలోకానికి చేరుతునన్న సంతోషం ఒకేసారి.

నాన్నని చేరిన తరువాత తెలిసింది నాతోపాటు ఎన్నో లక్షల నీటిచుక్కలు సముద్రుణ్ణి చేరకుండానే వెనక్కి వచ్చేశాయని. మేమంతా కలిసి అప్పుడే నిర్ణయించుకున్నాం – ఇక నాన్నని వదిలి ఎక్కడికీ వెళ్లకూడదని. నాన్న కూడా దిగులు కళ్లతో దగ్గరికి తీసుకున్నాడు. "మనింట్లో ఆకాశమంత చోటు వుంది మీరెక్కడికీ వెళ్లాల్సిన పనిలేదు" అన్నాడు. ఆయన కళ్లలో మెరుపు.

ఇక మా సంతోషానికి ఆనకట్టలేదు. కాకపోతే మాపై బెంగతో అమ్మ ఏ ప్రళయమౌతుందో అనే మా భయం అంతా!

(ప్రజాశక్తి 11 మార్చి 2012)

(వాహిని, టి.ఎ.జి.సి.ఎ. (అమెరికా) ఉగాది సంచిక, 2013)

వానర వీరుడు

కేతకి మనసు మనసులో లేదు. ఆ రోజు హనుమంతుడు అశోకవనానికి రెండొవసారి వస్తున్నాడట..!! మునుపు వచ్చినప్పుడు రాక్షస స్త్రీలనందరినీ మాయలో ముంచి, నిద్ర పోనిచ్చి కేవలం సీతమ్మను మాత్రమే కలిసి వెళ్ళాడు. ఈ సారి అలా కాదు, అందరూ మేల్కొని వుండగానే, అందరూ చూస్తుండగానే వస్తాడట..!! తాను హనుమంతుణ్ణి మళ్ళీ చూడబోతోంది..!! ఈసారి అతనితో మాట్లాడాలి.. తన మనసులో మాట చెప్పాలి.. ఇలా ఆలోచిస్తుంటే కేతకికి ఆ రాత్రి నిద్ర కూడా పట్టలేదు.

రావణవధ నెరిపిన వెంటనే శ్రీరాముడు విభీషణ పట్టాభిషేకానికి ఆజ్ఞ ఇచ్చాడు. అరణ్యవాసం చేస్తున్నందున లంకా నగరంలోకి అడుగుపెట్టననీ, లక్ష్మణుడికి పట్టాభిషేక బాధ్యత అప్పజెప్పాడు. ఆంజనేయుడు స్వయంగా సకల నదీనదాల నీరు తీసుకొని రాగా, దేదీప్యమానంగా విభీషణ పట్టాభిషేకం జరిగింది. ప్రజలు, సామంతులు ఇచ్చిన అనేకానేక బహుమతులు, మణులు, రత్న మాణిక్యాలు తీసుకొని విభీషణుడు సముద్ర తీరానికి చేరుకున్నాడు. ఆ కానుకలన్నీ రాముడికి సమర్పించి నమస్కరించాడు.

రఘునందనుడు నవ్వి – "విభీషణా.. అరణ్యవాసికి ఈ కానుకలేల..? నాకు నీవు ఇవ్వవలసినది వేరొకటి వున్నదయ్యా.." అన్నాడు.

"రామచంద్ర ప్రభూ.. సీతామాత క్షేమంగా వున్నది. వెంటనే మీ విజయవార్తను ఆ అమ్మకు పంపిస్తాను" అన్నాడు విభీషణుడు.

"నీవు ఇప్పుడు లంకా ప్రభువు. నీ అనుమతి కోసమే వేచి వున్నాము. నీవు అనుమతిస్తే హనుమ ఆ కార్యం నిర్వర్తిస్తాడు" అన్నాడు రాముడు.

"ఎంత మాట ప్రభూ.. నేను రాజునుకాదు.. నీ దాసాను దాసుణ్ణి.. మీ అనుజ్ఞ ప్రకారమే హనుమను పంపించండి.." అన్నాడు విభీషణుడు.

ఈ సంగతి ఎన్నిసార్లు చెప్పించుకుందో కేతకి. హనుమంతుడు అశోక వనానికి వస్తున్నాడు. ఎంతటి శుభవార్త..!!

యుద్ధభూమి నుంచి నగరంలోకి రోజూ మరణవార్తలు మోసుకొస్తున్న చారులు మొదటిసారి ఈ శుభవార్త తెచ్చారు. వెంటనే త్రిజటను కలవడానికి విభీషణ గృహానికి బయలుదేరింది.

దారి పొడవునా ఆంజనేయుడి గురించి ఆలోచనలే. అసలు ఆంజనేయుడి గురించి తప్ప ఈ మధ్య వేరేమీ ఆలోచించట్లేదు కేతకి. అది ప్రేమా? అభిమానమా? భక్తా? ఏమో తనకీ తెలియదు. అతను ఆజన్మ బ్రహ్మచారి అని తెలిసినప్పుడు మాత్రం కొంచెం బాధపడింది.. కాని అతని మీద అనురాగం మాత్రం తగ్గలేదు. అతని కఠోర బ్రహ్మచర్యం గురించి విని మరింత గౌరవించింది. పూజించింది.

లంకా నగర వీధులన్నీ వెల వెల పోతున్నాయి. ప్రతి ఇంటి ముందు రాక్షస సైనికుల శవాలు, వాటి వెనక విధవలై, అనాధలై భోరున విలపిస్తున్న వారి కుటుంబ సభ్యులు. నాటి లంకా పురీ విభవమ్ము నేడు మచ్చుకైనా కానరావటం లేదు.

"అసలు ఆ రోజు ఆంజనేయుడు వచ్చి ఈ నగరాన్ని తన వాలముతో తగులపెట్టినప్పుడే ఈ నగరం కాంతి హీనమైనది. ఆ నాటి అగ్ని కీలల్లో తగలబడిన మొండి గోడలు అదుగో ఇప్పటికీ కనిపిస్తున్నాయి.. ఒక్క కోతి కారణంగా మయుడిచే నిర్మించిన ఈ మహానగరం ఇలా బూడిద పాలౌతుందని ఎవ్వరూ, ఏనాడూ వూహించి వుండరు.." అలా ఆలోచిస్తూ పుర వీధుల్లోకి అడుగుపెట్టింది కేతకి.

"ఇదిగో ఇక్కడే కదూ.. ఆనాడు ఆ వానర వీరుణ్ణి బ్రహ్మాస్త్రంతో బంధించి, ఈ వీధుల్లోనే కదూ నడిపించాడు మేఘనాథుడు? అప్పుడే తాను ఆ వీరుణ్ణి మొదటిసారి చూసింది. ఎలా వున్నాడు..? బంధించారన్న దిగులు లేదు. రొమ్ము విరుచుకొని, చేతులు వెనక్కి పెట్టుకొని, నగరంలో వీధి వీధిని పరికించి చూస్తూ, వాలాన్ని ఝుళిపిస్తూ, రామ మంత్రాన్ని జపిస్తూ, మధ్య మధ్యలో తనని చూడటానికి వచ్చిన జనులను వానర చేష్టలతో భయపడుతూ.." ఆలోచిస్తూనే అనుకరిస్తోంది కేతకి. చేతులు వెనక్కి పెట్టుకొని, రొమ్ము విరుచుకొని, తల ముందుకు వంచి కోతిలా పళ్ళు చూపిస్తూ "గుర్రి" అంటోంది.

"ఏమిటే ఇది కేతకీ.. కేతకీ.. " చేతులు పట్టుకొని వూపింది కాళనామి. ఆమె కేతకి స్నేహితురాలు.

"ఏమిటే ఇది మళ్ళీ ఆ తోకవీరుడు గురించేనా.." అంది కవ్విస్తూ.

"ఏయ్.. కాళా.. నా మారుతినేమైనా అన్నావో" వేలు చూపించింది కేతకి.

"ఏమిటీ... ఆ బ్రహ్మచారి నీ మారుతి ఎట్లైనాడమ్మా?"

"వీరుణ్ణి అభిమానించడం తప్పా.. నేనేమీ ఆయన్ను పెళ్ళి చేసుకుంటానని చెప్పలేదే"

"సరేలేమ్మా.. నీతో నాకెందుకు.. నాకు అవసరమైన పని వుంది వస్తా"

"ఏమిటే ఆ పని?"

''యువరాణి త్రిజటమ్మగారు చెప్పారు... ఆ పుష్పక విమానాన్ని పూలతో అలంకరించాలట.. అవును నువ్వెక్కడికే?"

"నేనూ త్రిజటమ్మగారి దగ్గరికే.. నాకు ఆ అశోకవనంలో ఏదైనా పని చెప్పమని"

"అశోక వనమేమిటే..?"

"నీకు తెలియదులే.. ఆయన అక్కడికే వస్తున్నాడు" చెప్పి పరుగెత్తింది కేతకి..

❖ ❖ ❖

కేతకి వెళ్ళేసరికి త్రిజట సీతను అలంకరించడానికి నగలు సిద్ధం చేస్తోంది. నగరంలో వున్న సమస్త ఆభరణాలను తెప్పించింది.

"సీత మేని చాయ ముందు ఈ బంగారం దిగదుడుపే.. ఇదిగిదిగో ఈ నీలం చీర చూడండి.. అయ్యో ఇది రాముని మేని చాయముందు దిగదుడుపే.." అంటూ ఒక్కొక్కటే సవరిస్తోంది. కేతకి రావటం చూసి-

"ఏమిటే ఇప్పుడా రావటం.. పద పద.. వెళ్ళి సీతను తీసుకెళ్ళే రథం అలంకరించు.." అంటూ పనిలో మునిగిపోయింది. కేతకి హతాశురాలైంది. ఎలాగైనా అశోకవనం చేరాలి, అక్కడ హనుమంతుణ్ణి చూడాలి.

"యువరాణిగారూ.." అన్నది.

"ఏమిటే.."

"అమ్మా.. నేను అశోకవనానికి వెళ్తానమ్మా.. సీతమ్మను అలంకరిస్తాను.." అన్నది చిన్నగా.

"ఓహూ.. హనుమయ్య అక్కడికి వస్తాడనా? బాగానే వుంది.. ఆయనంటే ఇంత ఇష్టం వున్నదానివి, ఆయన స్వామి భక్తి గురించి తెలిసినదానివి, నేను చెప్పిన దానికి ఎదురు చెప్తావా?" అంది నవ్వుతూ.

"అమ్మా.. అమ్మా.. కాదనకండమ్మా" ప్రాధేయపడింది కేతకి.

"సరేలే.. ఈ నగలు తీసుకెళ్ళి జానకీదేవిని అలంకరించు.. అశోకవనంలో.." అన్నది చివర్లో వత్తి పలుకుతూ. కేతకి నమస్కరించి, చిన్నగా నవ్వుతూ అశోకవనం వైపు సాగింది. రకరకాల మణిహారాలు, కేయూరాలు, కడియాలు, ఇంకా ఎన్నెన్నో చిత్రమైన రంగులు కలిగిన వస్త్రములు తీసుకొని పరిచారికలు ఆమెను అనుసరిస్తూ కదిలారు.

కేతకి నడుస్తూ ఆలోచిస్తోంది–

"త్రిజటమ్మగారు అలా అంటారుగాని.. ఆమెకు తెలియదా తనకి హనుమంతుడంటే ఎంత ఇష్టమో.. ఎన్నిసార్లు ఆమె దగ్గరకు వెళ్ళి హనుమంతుడి కథలు చెప్పలేదు.. ఆ రోజు లంకా నగర రక్షకి లంఖిణిని ఎవరో చంపేశారన్నప్పుడు తాను అశోకవనంలోనే వుంది. త్రిజట ఆ రోజు తన స్వప్న వృత్తాంతం వివరించి, ఎవరో వానరవీరుడు వస్తాడని, లంకా నగర నాశనం తప్పదని చెప్పింది కదా. అప్పుడే కదా తను మొదటిసారి వాయునందనుడి గురించి వినడం.. ఆ తరువాత ఆయన రావటం లంకా దహనం కావించడం.. ఆహా.. వాలానికి నిప్పు పెడితే నిబ్బరంగా గాలిలోకి లేచి ఆ ప్రాకారం నుంచి ఈ ప్రాకారం మీదకి దుముకుతూ, తోకని పెంచుతూ ఈ లంకా ప్రజలను గగ్గోలు పెట్టిస్తుంటే, తనొక్కతే సంభ్రమంగా అలాగే నిలుచోని తదేకంగా అతన్ని చూసిన క్షణాలు.. ఎంత కాలమైనా మరపుకురావుకదా..!! ఆనాడు ఆయనకు ఏ హానీ కలగకూడదని సీతమ్మతోపాటే తానూ అగ్ని దేవుడిని ప్రార్థించింది... అప్పుడు ఆ వీరుడు తనను చూశాడా? ఏమో.." ఇలా ఆలోచిస్తూనే అశోక వనం ముందున్న ఫలతోటలోకి చేరుకున్నారు. పరివారమంతా. కొంతకాలం క్రిందట ఎంత మనోహరంగా వుండేదా తోట. ఎన్నో లోకాలతో యుద్ధాలు జరిపి, అన్ని లోకాల చిత్ర విచిత్రమైన ఫలాలను, పుష్పాలను రావణుడు స్వయంగా మక్కువతో తెచ్చుకొని పెంచిన తోట అది. ఎప్పుడూ దోరమాగిన ఫలాల సువాసనలు వెదజల్లుతూ ఆఘ్రాణింపుకే మైమరపాటునిచ్చే మనోహరమైన తోట.

మరి ఈ నాడు?

విరిగిన ప్రాకారాలతో, ఎక్కడికక్కడ పడిపోయి ఎండిపోయిన మహా వృక్షాలతో, దారికి అడ్డంగా పడివున్న మహా పర్వతాలవంటి రాళ్ళతో.. ఇదంతా ఆ వానరవీరుడి పనే కదూ..!! అతను చెట్లను పెళ్ళగించిన చోట ఇప్పుడు చిన్న చిన్న తటాకాలయ్యాయి. రాళ్ళు విసిరినప్పుడు దాని కింద పడిన రాక్షసులు ఆ రాతికిందే సమాధి అయిపోయి వున్నారు. కొన్ని బండలకింద ఇప్పటికీ రధ శకలాలు వున్నాయి.

కేతకి అక్కడే పడి వున్న ఒక మామిడి చెట్టు దగ్గరకు వెళ్ళింది. చెట్టును వేర్లతో సహా పెళ్ళగించినప్పుడు హనుమంతుడు చేతులు పడిన చోట నొక్కుకుపోయి వుంది. కేతకి ఆ అచ్చులమీద చిన్నగా తాకింది. ఒళ్ళంతా పులకరించినట్లైంది. భక్తిగా నమస్కరించింది.

"ఏం వీరుడివయ్యా? మా రాక్షసుల చేతుల్లో చిత్ర విచిత్రమైన ఆయుధాలు చూశాను. కానీ నీలా చెట్లను, బండరాళ్ళను ఆయుధాలు చేయగలిగిన వాడిని ఇంతవరకు ఎరుగను.."

రామరావణ యుద్ధంలో హనుమంతుడు చేసిన పోరు జ్ఞాపకం వచ్చింది ఆమెకి. యుద్ధం నుంచి రోజూ తిరిగొచ్చిన చారులు ఆ విశేషాలను పూసగుచ్చినట్లు చెప్పేవారు. వారిని అడిగి ప్రత్యేకంగా హనుమంతుడి సంగతులు చెప్పించుకునేది కేతకి. అవే విషయాలు గుర్తుకొస్తున్నాయి. వెంట వస్తున్న పరిచారికలకు ఆ విశేషాలు చెప్పసాగింది–

"ధూమరాక్షసుడు పశ్చిమద్వారం గుండా వెళ్ళినప్పుడు అక్కడ కాలయముడిలా నిలబడ్డాడట హనుమంతుడు. పెద్ద బండరాయిని ఎత్తి అతని రథం మీద విసిరాడట. రథం తునాతునకలైంది. ధూమరాక్షసుడు పరుగులంకించుకున్నాడు.. అతని వెంటే హనుమంతుడు కూడా. మరో పెద్ద రాతిని చేతులతో పైకెత్తి అలాగే పరుగెత్తాడట... రాక్షసుడు గదతో కొట్టినా చలించలేదట.. ఎన్నో యోజనాలు అలా పరుగెత్తి ధూమరాక్షసుడు అలసిపోతే వాడి నెత్తిన ఆ రాయిని విసిరి చంపేశాడు.. తెలుసా." అన్నది.

"అమ్మయ్యో.. ఎంతటి వీరుడో" అన్నది ఒక రాక్షసపడుచు.

"మరి ఏమనుకున్నావు? మరోనాడు అకంపనుడు పధ్నాలుగు బాణాలతో హనుమంతుడి గుండెల్ని చీలిస్తే కూడా లెక్క చేయక పెద్ద చెట్టుతో వాడి తలపై మోదాడుట.. నీలుణ్ణి చంపబోయిన నికుంభుణ్ణి పిడిగుద్దులతో చంపాడు. త్రిశీరుడు కోపగించి వస్తే అతని కత్తితో అతనినే చంపాడు.. ఆనాడు జంబుమాలిని శిరస్సును సైతం గదతో వేయి వక్కల చేయలేదా?" తదాత్మీయంగా చెప్పుకొచ్చింది కేతకి.

"అయితే అమ్మా... రావణుడి రాజ్యంలో పుట్టి శత్రువైన హనుమంతుణ్ణి ప్రేమిస్తున్నారే.."

"నోరు ముయ్యండి.. ప్రేమకాదిది.. ఆరాధన.. ఆయన నాకు దైవంతో సమానం" కోపంగా అంటూ బిర బిరా నడిచింది కేతకి.

అక్కడ అశోకవనంలో సీత కూర్చొని వుంది.రామాలింగనాభిలాషియై క్షణ క్షణం పరితపించిపోతోంది. ఆ రాత్రంతా ఆమె నిద్రపోలేదని ఆమె కళ్ళు చెప్తున్నాయి. శీతలపవనాలతో ఆమెను నిద్రింపచేయాలని ప్రయత్నిస్తూ అశోక చెట్లు అలసిపోయాయి. రావణ సంహారం గురించి త్రిజట చెప్పగానే ఆనందంతో త్రిజటను గట్టిగా కౌగిలించుకుంది. "రాముడొస్తున్నాడు.. నా రాముడొస్తున్నాడని.." ప్రతి చెట్టుకీ చెప్పకుంది. కీరవాణి రాగాల పక్షులను చేరదీసి రామనామం చెప్పింది మురిసిపోయింది. ఇక రాత్రేమిటి పగలేమిటి.. ఎప్పుడెప్పుడు రాముడు వస్తాడా.. ఎప్పుడు తాను అహల్య అయ్యి పాదాలు తాకుతానా, ఎప్పుడు తాను గుహుడు అయ్యి పాదాలు కడుగుతానా అని ఎదురు చూస్తోంది... రామవామాంకాన కూర్చొని ఎప్పుడు ఆ పవిత్ర కరస్పర్శకు పరవశురాలిని అవుతానా అని ఎదురు చూస్తూ నిద్రను ఎప్పుడో తరిమేసింది.

కేతకి సీతను పరిశీలనగా చూసింది. నిద్ర లేమితో ఆమె కళ్ళు మగతగా వున్నాయి. నెమ్మదిగా మూసుకుపోతున్న కళ్ళతో ఒక్క క్షణం నిద్రలోకి జారుకొని, ఆ ఒక్క క్షణంలోనే రాముడు వచ్చేశాడేమో అన్న ఆతృతతో చటుక్కున కళ్ళు తెరిచి చుట్టుపక్కల చూస్తోంది. కేతకి నవ్వుకుంది.

"ఆ రోజు.. హనుమంతుడు సంజీవని తేవడానికి ఉత్తరానికి వెళ్ళినప్పుడు.. తాను ఇలాగే రాత్రంతా నిద్రపోకుండా ఎదురు చూసింది. గగన మార్గంలో తిరిగి వచ్చే హనుమంతుణ్ణి చూడాలని కళ్ళలో దీపాలు వెలిగించి కూర్చుంది. నిద్ర మత్తు వదలకపోతుంటే అటూ ఇటూ గెంతుతూ ఆంజనేయుణ్ణి అనుకరిస్తూ.. ఎప్పుడెప్పుడూ వస్తాడా అని దృష్టంతా అకాశం మీదే నిలిపి వుంచింది.. అంతలో సూర్యోదయం.. సూర్యుడు వుదయిస్తే లక్ష్మణుడు బతకడు.. లక్ష్మణుడు లేకపోతే రాముడు జీవించడు... స్వామి కార్యం నిర్వర్తించలేక పోయాడన్న అపఖ్యాతి హనుమంతుడికి వస్తుంది.. ఆ విషయం తలుస్తూ సూర్యుణ్ణి నిందిస్తూ భోరున విలపించింది... తీరా చూస్తే అది సూర్యబింబం కాదు.. సంజీవని బదులు ఆ పర్వతాన్నే పెకలించుకొని వస్తున్న హనుమంతుడు.. ఆ పర్వత కాంతిలో వెలుగుతూ.. ఓహ్.. ఎంతటి మనోహర దృశ్యమది..!!"

"అమ్మా కేతకమ్మగారు.. ఏమిటమ్మ మీ పరధ్యానం" అంటూ పిలిచారు పరిచారికలు.

కేతకి తేరుకొని తెచ్చిన నగలను, పట్టు వస్త్రాలను సీత ముందు పెట్టించింది. సీతకు

నమస్కరించి – "అమ్మా మిమ్మల్ని అలంకరించమని యువరాణి త్రిజటగారి ఆజ్ఞ.." అన్నది.

సీతమ్మ నవ్వింది. అలంకార భూషణాదులు తిరస్కరించింది. తన భర్త నార వస్త్రాలతో వుంటే తానూ అవే ధరిస్తానని పట్టుబట్టింది.

"అమ్మా ఇంతకాలానికి నీ భర్తను చూడబోతున్నావు.. కొంతైనా అలంకారం లేకపోతే ఎట్లాగమ్మా" అని నచ్చ చెప్పబోయింది కేతకి.

సీతమ్మ నవ్వి నాడు హనుమంతుడు తెచ్చిచ్చిన అంగుళీయకము తీసి చూపించి, తన వేలికి తొడుగుకుంది. కేతకి సంభ్రమముగా చూసింది. సీతారాముల అనురాగానికి చిహ్నమైన ఆ అంగుళీయకము తళుక్కున మెరిసింది. ఆ వుంగరము తెచ్చి ఇచ్చి ఈ నాడు వారి సమాగమానికి కారణమైన ఆంజనేయుణ్ణి తలచుకొని కేతకి భక్తిగా నమస్కరించింది.

ఇంతలో వందిమాగధులు వచ్చి నిలబడ్డారు. కేతకి గుండె వేగంగా కొట్టుకుంది.

"సీతారామసేవాపరాయణ.. మహాబలశాలి.. అంజనీపుత్ర.. వాయునందన.. హనుమ నామ భూషణ వేంచేస్తున్నారు.." అంటూ ప్రకటించారు. సీత దిగ్గున లేచి నిలబడింది. కేతకి అనాలోచితంగా నాలుగడుగులు ముందుకు వురికి హనుమంతుణ్ణి చూడటానికి తహతహ లాడింది.

"ఎందుకమ్మా అంత తొందర?" అన్నారు పరిచారికలు.

"నీకు తెలియదే.. ఒక్కసారి ఆయన్ను చూస్తే చాలు.. ఆ వీరుడు.." చెప్తున్నదల్లా ఆగిపోయింది. అక్కడికి కొన్ని అడుగుల దూరంలో...

అదుగో.. అతనే.. వస్తున్నాడు.. చేతిలో గద, సూక్ష్మ దృష్టి, ఆజానుబాహువులు, కండలు తిరిగిన శరీరం.. ఠీవిగా.. దర్జాగా.. ఆయన వేసే ఒక్కొక్క అడుగుకి భూమి కంపిస్తున్నట్లుంది.. నిరంతర రామ నామ గానం.. అదిగో అదిగో అతనే ఆంజనా దేవి తప:ఫలం.. హనుమంతుడు.

కేతకి అలాగే చూస్తూ వుంది. హనుమంతుడు కొంత దూరమునుంచే సీతను చూశాడు.. అతనిలోని వానరుడు నిద్రలేచాడు. సంతోషంతో దుముకుతూ.. "అమ్మా.. సీతమ్మా.. జయం తల్లీ... విజయం.. శ్రీరామ విజయం.. నీ కష్టాలు తీరాయి మాతా.." అంటూ వచ్చాడు. సీతమ్మ పాదాలకు సమస్కరించాడు.

"అమ్మా నాడు నిన్ను దర్శించి నీ క్షేమ వార్తను రాముడికి తెలిపే భాగ్యం నాకు కలిగింది. ఈ నాడు యుద్ధానంతరం రామ క్షేమ వార్తను నీకు తెలియజేసే భాగ్యం కూడా నాకే దక్కింది తల్లీ.. నా జన్మ చరితార్థమైంది." అన్నాడు కన్నీళ్ళ పర్యంతమౌతూ.

సీతమ్మ కూడా కన్నీళ్ళు వర్షిస్తుండగా – "నాయనా.. ఈ శుభవార్త చెప్పిన నీకు ఏ బహుమతీ ఇవ్వలేని నిర్భాగ్య స్థితిలో వున్నాను.. నిన్ను నా బిడ్డగా స్వీకరించడం తప్ప ఇంకేమీ ఇవ్వలేను నాయనా" అన్నది.

"అమ్మా.. నీవెప్పుడూ మా సీతమ్మ తల్లివేనమ్మా.."అటూ ఆమె చుట్టూ కలియ చూశాడు. ఆమె పక్కగా కేతకి తన పరివారములో నిలబడివుంది. వారంతా అక్కడ జరుగుతున్న సంభాషణకు ఆర్ద్రతకు లోనై స్థాణువుల్లా నిలబడిపోయారు.

"ఓహూ.. రాక్షసులు అంతమైనా ఇంకా నిన్ను భయపెట్టి.. రావణుడికి లొంగమని నిన్ను ప్రలోభపెట్టిన ఈ రాక్షస కాంతలు ఇంకా బ్రతికే వున్నారా" అంటూ హూంకరించి గద పైకెత్తి వారి మీదకు దూకబోయాడు. ఆయన కళ్ళు పెద్దవి అయ్యాయి.. ఆవేశంతో వూగిపోతున్నాడు.. బలంగా పెదవులను బిగించాడు.. చేతులపై, వక్షస్థలంపైన కండలు వుబికి వస్తున్నాయి.

అతని భీకరాకారం చూసి పరిచారికలంతా భయంతో చెల్లాచెదురయ్యారు. ఎటు దిక్కు వారు అటు పరుగులు తీశారు. కేతకి ఒక్కతే అక్కడ నిలబడిపోయింది. నిశ్చలంగా, నిర్భయంగా.. హనుమంతుడి రౌద్ర రూపాన్ని మనసారా ఆస్వాదిస్తూ పరిసరాలను మర్చిపోయి వుంది.

"హనుమా ఆగు ఆగు నాయనా.." అంటూ సీత ఆపింది అతడిని. "వీరంతా విభీషణుడి కూతురు త్రిజట పంపించగా నన్ను అలంకరించేందుకు వచ్చారు. వీరే పాపము ఎరుగరు.. అయినా నన్ను బాధించిన రాక్షస కాంతలు సైతం వారి రాజు ఆజ్ఞనే కదా పాటించారు.." అంటూ సర్ది చెప్పింది.

కేతకి తేరుకొని హఠాత్తుగా ముందుకు వంగి హనుమంతుడి పాదాలపై పడి నమస్కరించింది. హనుమంతుడు ఆమెను లేవనెత్తి–

"నా రౌద్ర రూపం చూసి మహామహులే భయకంపితులౌతారు..

నీవు చూస్తే పదహారేళ్ళు దాటని పసి పిల్లవి.. నీవు నన్ను చూసి అంత ధైర్యంగా ఎలా నిలబడ్డావు.." అన్నాడు మారుతి.

"స్వామీ.. నేను పుట్టిన దగ్గరనుంచి లంకా నగర ఖ్యాతిని, రావణ పరివార వీరత్వాన్ని మాత్రమే విన్నాను. ఆ వీరులను సంభ్రమాశ్చర్యాలతో చూచాను.. అటువంటి వీరులనందరినీ ఒక్క చేతితో మట్టి కరిపించిన మీ వీరత్వానికి ముగ్ధురాలనైనాను.. మిమ్మల్నే ఆరాధించాను.. పూజించాను.. మీరు నా దైవం.. అందుకే నాకు భయం వెయ్యలేదు.. ఈ లంకా నగర ఖ్యాతిని సమూలంగా నాశనం చేసిన మీ వీరత్వం.. మహా బలశాలురైన రాక్షసులను దునిమిన మీ రౌద్రం దర్శించుకునే భాగ్యం కలిగినందుకు ధన్యురాలనైనాను.." అంటూ నమస్కరించింది కేతకి.

"పిచ్చి దానా.. ఎంతటి అమాయకురాలవమ్మా? ఈ రాక్షస సంహారం చేసింది మా కోతిమూక అనుకున్నావా? ఇదంతా నా ప్రజ్ఞే అనుకున్నావా.. రాక్షసులను తుదముట్టించినది రామ నామమనే అస్త్రాలు. ఈ లంకను నాశనం చేసింది, నా తోకకి పెట్టిన నిప్పు అనుకుంటున్నావేమో.. అది కాదు.. ఇదుగో ఈ సీతమ్మతల్లి కార్చిన కన్నీరు లంకా దహనం గావించింది.. అటువంటి ఈ సీతారాములను ధ్యానించు నీకు తప్పక శుభం కలుగుతుంది" అంటూ వెనుతిరిగాడు హనుమంతుడు.

కేతకి మనసులోనే సీతారాముల్ని ధ్యానించింది.

(కౌముది అంతర్జాల పత్రిక, సెప్టెంబరు 2009)

చిలక రాయబారం

"పలకవేమే"? రెట్టించింది ప్రియ.

ఏమిటన్నట్లు చూసింది చిలక.

''నాకొక సాయంచేసిపెడతావా? నేను ఒక ఉత్తరం రాసిస్తా ఆయనకిస్తావా?" అడిగింది ప్రియ.

ఇస్తానన్నట్లు తలాడించింది చిలక.

ఆ అంగీకారమే చాలు.. ప్రియ ఎంత హడావిడి చేసిందో.. వెతికి వెతికి ఎర్రటి గులాబీ రంగు కాగితం తెచ్చింది. చిక్కని రంగుతో రాసే కలాన్ని అందుకుంది. కావ్య కన్యలా మంచం మీద పడుకొని ఉత్తరం రాసింది. ఉత్తరం నిండా ఎంత ప్రేమో, ఎంత విరహమో, ఎన్ని అలకలో, ఎన్నెన్ని కలతలో..!! రెండుసార్లు ఆ ఉత్తరాన్ని ఆప్యాయంగా చూసుకొని, మురిసిపోయి, ముసిముసిగా నవ్వుకొని ఎంతో జాగ్రత్తగా మడిచింది.

"ఇస్తావుగా చిలకమ్మా? శరత్ చేతికే ఇవ్వు..! మర్చిపోవుగా..?" అంటూ పదే పదే చిలకకి చెప్పింది ప్రియ.

ఆ కాగితం అందగానే రివ్వున వెళ్ళిపోయింది చిలుక.

❖ ❖ ❖

శరత్ ఆ ఉత్తరం అందుకోగానే ఆనందంతో పరవశుడయ్యాడు. ఎంతకాలమైంది ఇలా ఉత్తరాలు వ్రాసుకొని.. అదీ ఇలా చిలకతో పంపుతుందని వూహించలేదు. కళ్లతోనే చిలకకు కృతజ్ఞతలు చెప్పుకున్నాడు. ఉత్తరాన్ని పొదివి పట్టుకున్నాడు. పసిపిల్లని తాకినట్లు ముద్దుగా తాకాడు. గులాబి రంగు కాగితం నుంచి గులాబీల గుభాళింపు. ప్రియ ఎప్పుడూ ఇంతే.. ప్రేమలో పడి మునిగి తేలినప్పుడు ఇంతే.. ఉత్తరం వ్రాసిందంటే ఇలాగే మత్తెక్కించే మల్లెల పరిమళాలో, గుభాళించే

గులాబీల సువాసనలో.. సరే సరే.. ఇదంతా ఆలోచిస్తూ కూర్చుంటే ఇక ఉత్తరం చదివినట్లే.. పైగా నిద్రముంచుకొస్తోంది.

ఉత్తరం తెరిచాడు.

"నా శరత్ కాలమా.."

ప్రియకి ఎంత భావుకత. ప్రతి ఉత్తరం ఇంతందంగా మొదలుపెడుతుంది. అంతకంటే అందంగా వ్రాస్తుంది. ఇలాగే వ్రాయాలని ఎన్నిసార్లు ప్రయత్నించినా తన వల్ల కాలేదు...

"నా శరత్ కాలమా...

ఎన్నాళ్ళైంది నిన్ను చూసి.. నవ్వకు. నాకు తెలుసు మూడు రోజులే అని. కానీ క్యాలెండర్‌లో ఒక్క గడి నుంచి మరో గడికి మధ్య ఎంత దూరముందో నువ్వెప్పుడైనా కొలిచావా? మారిన తేదీలు కాదు అవి మారడానికి పట్టే గంటలు, నిమిషాలు, క్షణాలు గుర్తించావా? ఆ క్షణాల బరువెంతో ఎప్పుడైనా అడిగావా?

నిన్ను చూడాలని ఎంతగా అనిపిస్తోందో తెలుసా? ఒక్కసారి కనిపించి పోరాదూ.. ఆ ఒక్కసారి నిన్ను చూసుకొని ఆ జ్ఞాపకంతో ఎన్ని వేల క్షణాలైనా ఆనందంగా ఈదేస్తాను..

నాకు తెలుసు నువ్వేమంటావో.. నన్ను చూడాలనిపిస్తే అన్ని వదిలేసి నా దగ్గరకే రా.. అంటావు.. అంతే కదా.. ?? మన కోసం, మన ప్రేమ కోసం అలాగే అన్ని వదిలేసి నీతో కలిసి రాలేదూ?? ఇప్పుడు మాత్రం ఏం చెయ్యగలం చెప్పు.. మనమంతట మనమే గాజు గోడల గదుల మధ్య ఇరుక్కుపోయాం.. మన కోసం కాకపోయినా మనకి పుట్టబోయే బిడ్డకోసమైనా మరికొంత కాలం.. ఓహ్.. చెప్పేశానా? నువ్వు కలిసినప్పుడు చెప్పాలనుకున్నా.. అది విన్నప్పుడు నీ కళ్ళల్లో ఆశ్చర్యంతోనో, ఆనందంతోనో వచ్చే మెరుపు చూడాలనుకున్నా.. ప్చ్.. అయినా ఇప్పుడు నీ ఆనందాన్ని నేను వూహించుకోగలనులే.. అదిగో ఇప్పుడు నీ చిరునవ్వు నాకు కనిపిస్తోంది.. ఈ వాక్యం చదివాక మరికొంచెం పెద్దదైన నీ నవ్వు నాకు వినిపిస్తూనే వుంది...

మరో మూడు రోజులు.. నువ్వు వచ్చేస్తావు కదూ...??

నీ

ప్రియ

(ఈ విషయమంతా నీకు ఫోన్ చేసి చెప్పొచ్చు.. కానీ నేను ఎప్పుడు ఫోన్ చేసినా నువ్వు బిజీగా వున్నానంటావు.. లేదా నిద్రవస్తోంది అంటావు.. అదిగో ఇప్పుడు కూడా

ఆవులిస్తున్నావు కదూ.. సరే ఇక వుంటాను.. హాయిగా నిద్రపో..)

చదువుతూనే నిద్రపోయాడు శరత్.

❖ ❖ ❖

ప్రియా..

నేను వచ్చాను.. నిజంగా వచ్చాను. నువ్వు మంచి నిద్రలో వున్నావప్పుడు. నా గురించే కలలు కంటున్నట్లున్నావు...లేకపోతే మనకి పుట్టబోయే పాప గురించి తలచుకుంటున్నట్లున్నావు.. నిద్రలో చిన్నగా నవ్వుతున్నావు. అబ్బా.. ఎంత బాగుందో తెలుసా నిన్ను అలా చూస్తుంటే..! అందుకే అలానే చూస్తూ వుండిపోయాను.. నీలో కొత్తగా వచ్చిన మార్పు వల్లేమో.. ఇంకా అందంగా కనిపిస్తున్నావు. ఒక్కసారి నిద్రలేపి పలకరిద్దామనుకున్నాను.. కానీ, ఎందుకో అలాగే బాగుందనిపించింది... ఇష్టం లేకపోయినా అక్కడి నుంచి వెళ్లక తప్పలేదు.. ఎక్కడ నిద్రపోయానో గుర్తు లేదు. లేచి చూసే సరికి నువ్వు లేవు.. ఇంకా రెండు రోజులు ఆగాలి మనం కలవడానికి... రెండు రోజులు..!! ఎదురుచూస్తూ..

శరత్

(నీలాగ నేను కవిత్వం వ్రాయలేకపోయినా, ఉత్తరాలు వ్రాయటం నిన్ను ప్రేమించిన తర్వాతే నేర్చుకున్నాను.. ఫోన్ చెయ్యకు.. ఇదే బాగుంది.)

చిలక ఇచ్చిన ఉత్తరం చదివి ప్రియ చిన్నగా నవ్వుకుంది. కాగితాన్ని మడిచి తన నీలం రంగు డైరీలో పెట్టుకుంది. పక్కనే ఎర్రరంగు డైరీ.. శరత్‌ది. అందులో ఆమె వ్రాసిన ఉత్తరాలు.. రంగు రంగులవి. ఒకసారి తీసి చూద్దామనుకుంది.. అంతలోనే వద్దనుకుంది. వేరే పచ్చటి కాగితం తీసుకొని శరత్ ఉత్తరానికి జవాబు మొదలుపెట్టింది.

శరత్‌వెన్నెలా..

నువ్వు వచ్చిన సంగతి నాకు తెలియకుండా ఎందుకు వుంటుంది? నీ రాక నా మనసులో వెయ్యి వీణలై మోగదూ.. నిద్రలో కూడా నువ్వొచ్చావని తెలిసే నవ్వుకున్నానేమో.. అలా నువ్వు నన్ను చూస్తూ వుంటే బాగుందనే నాకు మెలకువ రాలేదేమో..? నేను కూడా నిన్ను చూశాను తెలుసా? అవును.. నువ్వు నిద్రపోగానే నేను లేచాను.. నిన్నుచూసాను.. ప్రశాంతంగా నిద్రపోతున్నావు.. కలలో నేనో మరి మన బాబో.. (అవును.. నువ్వన్నట్లు పాప కాదు... బాబు.. నీ పోలికలతో మన బాబు..). నీ లాగా

నేనూ అలాగే చూస్తూ వుండలేకపోయాను.. లేపాలని చూశాను.. మగత కళ్లతో చూసినట్లున్నావు కూడా.. మరి చూశావో లేదో.. మళ్లీ నిద్రలోకి.. సరే ఇక్కడే ఆపేస్తున్నా.. మన చిలక తొందరపెడుతోంది..

రేపేగా ఆదివారం.. మనం కలిసే రోజు.. ఈ రేపటి కోసం వారం కాదు ఎన్నియుగాలైనా వేచివుంటాను..

రేపటి కోసం

ప్రియ

అప్పటికే వెళ్లిపోబోతున్న చిలకని బ్రతిమిలాడి ఆపి ఉత్తరం ఇచ్చింది ప్రియ.

"ఇస్తావు కదూ.." ?? అంది.

"ఇస్తానమ్మా.. అయినా విచిత్రం కాకపోతే ఒకే ఇంట్లో వుండే మొగుడూ పెళ్లాలు ఇట్టాగ ఉత్తరాలు వ్రాసుకోవడమేంది..? పోనీ అయ్యగారూ మీరూ ఇద్దరూ పగలూ రేయి కాకుండా ఒకటే షిఫ్ట్ ఉద్యోగాలు చూసుకోకూడదూ..?" అంటూ నవ్వింది చిలకమ్మ అనే ఆ పనిమనిషి.

(ఆదివారం ఆంధ్రజ్యోతి, 6 జూన్ 2010)

మబ్బుతునక

"వా"సంతీ... నాకు నిజంగా పిచ్చి పట్టిందా?" అడిగాను నేను. ఆమె నిర్దయగా నవ్వింది.

"ఈ ప్రపంచానికే పిచ్చి పట్టింది. అందుకే నిన్ను పిచ్చి వాడు అంటోంది" అలా అంటూనే నేల చూపులు చూస్తోంది వాసంతి.

"పోనీలే, నువ్వన్నా నమ్ముతున్నావు. నా పిచ్చి లోకంలో నేను బాగానే వున్నాను కదా? అయినా ఈ జనానికి వచ్చిన బాధేంటి?"

"మన లోకానికీ, ఈ లోకానికీ చాలా తేడా వుంది విశ్వం. అదే వాళ్ల బాధ..." చెప్పింది నవ్వుతూ...

"కాఫీ కలపనా?" అడిగాను.

"వద్దు అలా బయటికి వెళ్లి నడుద్దాం పద..." చెప్పింది.

"ఇంత రాత్రా?" అన్నాను. ఆమె సమాధానం చెప్పకుండా లేచి బయటికి అడుగులేసింది. నేను అనుసరించాను.

బయట వూరంతా వెన్నెలలో తడుస్తోంది. వాసంతి మబ్బుతునకలా ముందుకు నడుస్తోంది. నేను చల్లగాలిలా ఆమె వెనకాల.

"ఎందుకు అంత తొందర... ఇద్దరం కలిసి నడుద్దాం..." అన్నాను.

"అవును నిజమే... ఇద్దరం కలిసి నడుద్దాం అనుకున్నాం... కానీ నీ దారి వేరు నా దారి వేరు అయిపోయాయి కదా?" అంది అడుగులు నిదానించకుండానే.

"అది అప్పుడు... ఇప్పుడు నేనూ నీ దారిలోకి వచ్చేశాను కదా?"

"నువ్వు వచ్చే సరికి నేను నీ కన్నా చాలా ముందుకి వెళ్లిపోయాను కదా..." అంది. నాకు ఆమెను అందుకోవడం కష్టంగానే వుంది.

"సరే ఆ పార్కులో కూర్చుందామా" అడిగాను. ఇలా నడవటం కన్నా ఒక చోట కూర్చుంటే సుళువనిపించింది.

పార్కు నిశ్శబ్దంగా వుంది. పూలమొక్కలన్నీ కొత్త అతిథుల్ని నిద్ర కళ్లతో ఆహ్వానిస్తున్నట్లు తలలూపాయి. ఇద్దరం ఒక సిమెంటు బెంచి మీద కూర్చున్నాం.

"ఏదైనా పాట పాడు..." అడిగింది వాసంతి. నేను గట్టిగా నవ్వేశాను.

"నేను పాటలు పాడి ఎన్ని సంవత్సరాలు అయిపోయిందో... అప్పుడు కాలేజీ రోజుల్లో..."

"అదే... అప్పుడు క్యాంటీన్‌లో నన్ను చూసి పాడావు చూడు – "తూ మెరీ జిందగీ హై... తూ మెరీ హర్ ఖుషీహై..." ఆ పాట పాడు" ఆ జ్ఞాపకం ఒక్కసారి వెండి వెలుగులా ఆమె ముఖంలో మెరిసింది.

"లిరిక్స్ గుర్తులేవు..." ఏదో ఒక సాకు.

"నాకు గుర్తున్నాయిగా... నేను అందిస్తాలే... పాడవూ ప్లీజ్..."

పాట మొదలైంది.

"సపనోమే ఆనేవాలీ బాహోమే కబ్ ఆయేగీ..." అన్నప్పుడు గట్టిగా నవ్వేసింది వాసంతి. పాట ఆగిపోయింది.

"ఎందుకు ఆపావు??" ఆమెకి ఎప్పుడూ రాని కోపం నటించింది.

"పాడమని అడిగి అలా నవ్వితే ఎలా పాడను? ముందే చెప్పాను పాటలు పాడి చాలా రోజులైందని"

"నేను నవ్వింది అందుకు కాదు... అప్పుడు కాలేజీలో ఈ లైన్లు పాడినప్పుడు ఏం జరిగిందో గుర్తులేదా?" అంటూ మళ్లీ నవ్వింది.

"గుర్తుంది... వున్నట్టుండి వచ్చి నన్ను కౌగిలించుకున్నావు..." నవ్వొచ్చింది. సిగ్గేసింది. అంత అందమైన అమ్మాయి అప్పుడెప్పుడో కాలేజీ క్యాంటీన్‌లో అందరి ముందు కౌగిలించుకున్నప్పుడు కలిగిన గర్వం మళ్లీ నా కళ్లలోకి వచ్చింది. వాసంతి నవ్వుతూనే నా వొళ్లో పడుకుంది.

"అంత సంతోషం మళ్లీ మన జీవితంలోకి రాలేదు కదా విశ్వం..." అడిగింది ఆమె. అప్పటిదాకా నవ్విన చంద్రుణ్ణి దిగులు మబ్బులు కమ్మేశాయి.

"అలా ఎందుకు అనుకుంటావు వాసంతీ... మన పెళ్లిరోజు, మొదటిరాత్రి... మర్చిపోయావా?"

సరదాగా మాట్లాడాననుకున్నాను. ఆమె ముఖంలో విషాదం పెరిగింది.

"మన తల్లిదండ్రులు లేకుండా పెళ్లి చేసుకోవటంలో లోటు తప్ప సంతోషం లేదు విశ్వం... మొదటిరాత్రి కూడా గుర్తుంది... ముందు ముందు భార్యాభర్తలుగా ఎలా బ్రతకాలో, సంసారమనే నదిపైన డబ్బుల తెప్ప ఎలా పరచాలో అని చర్చించుకొని నిద్రపట్టక ఏ తెల్లవారుఝామునో చేసిన శృంగారం..."

"ఎందుకలా అంటావు... అది జీవితంలో కొత్త మలుపు... ముందు దారిలో పూలు వుంటాయో, ముళ్లు వుంటాయో అన్న భయం, ఆందోళన..."

"మన సంసారం మొత్తం ముళ్లు ఏరి పడెయ్యడానికే సరిపోయింది. పూలు వున్న దారులు పక్కనే వున్నా ముళ్లు ఏరే పనిలో ఆ దారుల్ని గుర్తించనేలేదు మనం."

"ఏం చెప్పినా మళ్లీ అక్కడికే వస్తావు నువ్వు... సరే ఆ విషయాన్ని వదిలెయ్... నువ్వు రాసిన కథలన్నీ నా దగ్గరే వున్నాయి. పుస్తకంగా వేద్దామనుకుకుంటున్నాను" అడిగాను మాట మార్చే ప్రయత్నంలో...

"వద్దు... ఆ కథలన్నీ మెలాంకలిక్‌గా కనిపిస్తాయి నాకు... అలాంటివి వుంచడమే దండగ. రేపు మొత్తం తగలబెట్టేసెయ్..." చెప్పింది ఆమె నా వొళ్లో నుంచి లేస్తూ...

"నిజంగా చెప్తున్నావా... నువ్వు అంత కష్టపడి రాసిన కథలు..."

"కథకి విలువ ఎంత కష్టపడి రాసామని కాకుండా, ఆ కథ ఏం చెప్తోంది అన్నదాని మీద ఆధారపడి వుంటుంది... వద్దు... తగలబెట్టేసెయ్..." గట్టిగానే అరిచింది.

"సరే... నువ్వు చెప్పినట్లే చేస్తాగా..." నేను కూడా కాస్త గట్టిగానే చెప్పాల్సి వచ్చింది. ఇద్దరి మధ్య మౌనగీతం మోస్తూ చల్లగాలి తిరుగుతోంది. మళ్లీ నేను మాట్లాడాను.

"నీకు నచ్చవేమో కానీ, నీ కథలు నాకు బాగా నచ్చుతాయి..."

"అబద్ధాలు చెప్పకు విశ్వం..." అంది ఆమె. "నేను రాసినప్పుడల్లా నీకు వినిపించేదాన్ని... ఆఫీసుకు వెళ్లే హడావిడిలోనో, మంచం ఎక్కే తొందరలోనే వినేసి, "బాగుంది" అని ఒక్క మాటతో సర్టిఫికెట్ ఇచ్చేవాడివి... ఆ తరువాత ఎప్పటికో ఏదో పత్రికలో వచ్చేది. ఏదో ఒక ఆదివారం నీ చేత బలవంతంగా చదివిస్తే చదివి... "ఇదెప్పుడు రాసావు, నాకు గుర్తులేదే" అనేవాడివి..." అంతా కళ్ల ముందు జరుగుతున్నట్లు చెప్తోంది వాసంతి.

"అప్పుడు నా వుద్యోగం... కార్పొరేట్ ప్రపంచం... టార్గెట్‌లు... ప్రజంటేషన్లు... ఆ హడావిడిలో పడిపోయి అలా..." చెప్తున్న మాటలు మధ్యలోనే ఆగిపోయాయి. తప్పు చేసినప్పుడు కన్నా తప్పు చెప్పుకునేటప్పుడు చూపులు నేలరాల్తాయి.

"ఆ జంజాటాన్ని వదిలేసి రమ్మని ఎన్నిసార్లు చెప్పాను..? అలాంటి బతుకు వద్దని ఎంత వేడుకున్నాను..." తల్చుకొని మరీ బాధపడింది వాసంతి.

"వచ్చేశాను కదా... ఇప్పుడు అవన్నీ ఏవీ లేవు... నువ్వు చెప్పినట్లే అన్నీ వదిలేశాను..." అంటున్నప్పుడు నా కళ్లలో ఆశ. ఆమె కళ్లలో అదే నిరాశ.

"ఇప్పుడా..? చేతులు కాలిన తరువాత ఏం చేసి మాత్రం ఏం ప్రయోజనం... జరగాల్సినవన్నీ జరిగిపోయాక నువ్వు ఎన్ని విమానాలు ఎక్కి వస్తే మాత్రం ఏమిటి లాభం..?" ప్రశ్న సూటిగా వాడిగా తగిలింది. నా దగ్గర సమాధానం లేదు.

"నీకు గుర్తుందా విశ్వం? ఆ రోజు మార్చి ముప్పై ఒకటి... నువ్వు అందీ అందని టార్గెట్ల వెనక పరుగులుపెడుతూ ఆఫీసులో వుండిపోయావు... నేను రోజంతా నీకు ఫోన్ చేస్తూనే వున్నాను... నువ్వు ఎత్తలేదు" ఆమె చెప్తుంటే మధ్యలో ఆపాను.

"గుర్తుంది... ఆ రోజే అంత వరకూ కంపెనీలో ఎవ్వరూ చెయ్యనంత బిజినెస్ చేశాను... లక్షల్లో బోనస్, ప్రమోషన్... అయినా నీ ఫోన్ ఎత్తలేదని అనకు ఒకసారి మాట్లాడాను..." సమర్థించుకున్నాను.

"అవును ఫోన్ ఎత్తి... "ఏమైనా అర్జంటా? నేను పనిలో వున్నాను" అన్నావు... నువ్వు తండ్రివి కాబోతున్నావని అంత హడావిడిగా చెప్పడం నాకు ఇష్టం లేక పెట్టేశాను..."

"అవును ఆ రోజు రాత్రి బాగా ఏడ్చేవు కూడా..." అంటూ దగ్గరకు తీసుకొని గుండెలకి హత్తుకున్నాను నేను.

"ఆ రోజు మాత్రమే కాదు... ఆ రోజు నుంచీ ఏడుస్తూనే వున్నాను..."

"అలా అనకు వాసంతీ... అభినవ్ పుట్టినప్పుడు శలవు పెట్టి నీ దగ్గరే వున్నాను కదా?"

"వున్నావు... తరువాత అమర్ పుట్టినప్పుడు? ఢిల్లీలో నువ్వు మొదలుపెట్టబోయే వ్యాపారానికి సంబంధించి ఇన్వెస్టర్స్‌తో మీటింగ్స్ అన్నావు... నేను ఒక్కదాన్నే నొప్పులు పడుతూ ఆటోలో హాస్పిటల్‌కి వెళ్లాను. ఆ క్షణంలో నాకేమనిపించిందో తెలుసా? అలా

అనాధలా బతకడం కన్నా చచ్చిపోవడం మేలనిపించింది" ఆమె చెంపలపైన జారిన కన్నీళ్లు నా చేతి మీద పడుతున్నాయి.

"ఏడవకు వాసూ... నిజమే... అప్పుడు తెలియలేదు. సక్సెస్ ఇచ్చే మత్తు అది... ఒక్కొక్క మెట్టు ఎక్కుతున్నానన్న సంతోషంలో కిందెక్కడో మిమ్మల్ని వదిలేశానన్న నిజం వెనక్కి తిరిగి చూసినప్పుడే కదా తెలిసింది..." నా కళ్లలో కూడా నీళ్లు తిరుగుతున్నాయి. వాసంతి నా గుండెల మీద నుంచి లేచి, కన్నీళ్లు తుడుచుకొని నిటారుగా కూర్చుంది. చేతులు రెండూ రెండు కాళ్ల మధ్యలో పెట్టుకొని వస్తున్న ఏడుపును దిగమింగుకుంటోంది.

"వెనక్కి తిరిగి చూసుకోమని చాలాసార్లు నీకు చెప్పాను... నువ్వు ఈ రోజు తిరిగి చూసుకునేసరికి నువ్వు కోల్పోవలసింది కోల్పోయావు... మన వయసు, మన సంతోషం, మన కుటుంబం అన్నీ కోల్పోయావు... చివరికి నన్ను కూడా...!!" చెప్పి కూర్చున్న చోట నుంచి లేచింది వాసంతి. ఆ ముఖంలో ఇప్పుడు సంతోషంలేదు, దుఃఖం లేదు. ఒక స్థిరమైన మొండితనం మాత్రమే వుంది.

"వెళ్తున్నావా?" అడిగాను వినవలసిన జవాబు ఇష్టం లేకపోయినా.

"అవును"

"రేపు కలుస్తావుగా?"

"ఊఁ"

వాసంతి వెళ్లిపోయింది.

❖ ❖ ❖

"అన్నయ్యా... నేను అమర్‌ని మాట్లాడుతున్నాను" నా చిన్న కొడుకు పెద్దవాడితో మాట్లాడుతున్నాడు. నాకు వినపడకూడదనేమో వరండాలోకి వెళ్లి చిన్నగా అంటున్నాడు. వినపడ్డా వినపడనట్లే వున్నాను నేను.

"రాత్రి మళ్లీ వెళ్లి పార్కులో కూర్చున్నాడీయన... చెప్తే వినడు... పైగా నన్ను ఉద్యోగం మానేసి, ఎక్కడైనా టీచింగ్ చెయ్యమంటాడు. మళ్లీ మొదటికొచ్చిందన్నయ్యా..." వాడు చెప్తూనే వున్నాడు. తప్పేముంది? నేను చేసిన తప్పే వాడు చేస్తున్నాడని నా బాధ. వాడు ఫోన్‌కి చెయ్యడ్డం పెట్టుకొని మాట్లాడుతున్నాడు.

"పొద్దున్న అమ్మ పుస్తకాలన్నీ తీసి తగలబెట్టబోయాడు... ఏమన్నా అంటే మీ అమ్మే చెప్పింది అంటాడు... నాన్నకి పిచ్చి ఎక్కువైనట్లుంది అన్నయ్యా... అమ్మ చనిపోయిన దగ్గర్నుంచి ఇదే వరస .... మొన్న డాక్టర్ అంకుల్ నాన్నకి నిజం చెప్పేశాడు. అమ్మ ఆత్మహత్య చేసుకుందని... అప్పటి నుంచి ఇలాగే ప్రవర్తిస్తున్నాడు... అక్కడ ఏదైనా మంచి వైద్యం దొరికే అవకాశం వుంటే చెప్పు అన్నయ్యా... పంపించేస్తాను... ఇంక ఈయన పిచ్చి పనులు తట్టుకునే శక్తి నాకు లేదు.."

"పిచ్చట... నాకు పిచ్చి... విన్నావా వాసంతీ... నువ్వు చచ్చిపోయావని నేను పిచ్చివాణ్ణి అయిపోయానట... విన్నావా? విన్నావా..?" విరగబడి నవ్వుతున్నాను.

"ఫర్లేదులే విశ్వం... నేను చెప్పాగా... ఈ ప్రపంచానికే పిచ్చి పట్టింది... అందుకే నిన్ను పిచ్చివాడు అంటోంది" అంది నాకు తప్ప ఇంకెవరికి కనపడని, వినపడని వాసంతి.

(రచన మాసపత్రిక, నవంబర్ 2012)

ఈరేశంగాడి ముచ్చట..!!

మా ఈరేశం గురించి చెప్పాలంటే ఎవరికైనా నవ్వొచ్చేస్తుంది. మరదేంటోగాని ఆణ్ణి చూసినోళ్ళంతా నవ్వుకోవాల్సిందే. ఆడికి బట్టలు కుట్టే టైలరు కొలతలు తీసుకునేకాడ తెగ ఐరానా పడిపోతాడని చెప్పుకుంటాంటారు సరదాగా మా వూరోళ్ళు..! ఆడి కర్రినలుపు, బట్టపుర్రె, బానబొజ్జ గురించి కాదుగానీ ఇంకోటి జెప్తాను నేను... ఇనండి.!!

ఆడికి నాకు సిన్నప్పట్నుంచి స్నేగం. బడెగ్గొట్టే కాడ నుంచి బస్సెనకాల లగెత్తేదాక ఇద్దరం కలిసే సేసేవాళ్ళం. ఆడుపట్నంబోయి నాలుగేళ్ళు తెగ సదివేసి పశువుల డాక్టరు కాంపౌండరి అయిపోయి నాడు. నేనూ ఇంకా ఐనోళ్ళం గలిసి పెళ్ళి గుదిర్చినాము.. సక్కని పిల్ల ఆడికి ఆలైంది. అదంటే ఆడికి పేనం. బాగా జూసుకుంటాడు...! పూలెడతాడు.. పళ్లెడతాడు.. పండగలకి పబ్బాలకి చీరకొనెడతాడు. అంతాబాగానే వుంటది గాని ఒక్కసోట సిక్కొస్తది. అది ఇప్పుడో అప్పుడో సిరంజీవి సినిమా వచ్చినప్పుడు గారంగా "పొయ్యొద్దాం మామా.." అంటది. ఈడు గైమంటూ లేత్తాడు..!!

ఆడెందుకంత కోపం జేత్తాడో సీలచ్చికి అర్థమయ్యేది కాదు..! (సీలచ్చంటే ఆడి పెళ్ళామన్నమాట..!) అసలు సంగతేందంటే – ఈడు అది కలిసి సినిమాకి బోతే 'కాకి– దొండపండు' సామెత గుర్తొచ్చేస్తది ఎవరికైనా..! సీలచ్చి బంగారంలాగుంటే ఈడేమో బొంగరం లాగుంటాడు. ఆడికీ పాపం సిగ్గుగానే వుండేది మరి..! అందుకే దాన్ని బయటికి తీస్కెళ్ళేవాడుగాదు. ఇదంతా ఆడు పట్నంలో వున్నప్పటి ముచ్చట...! అట్టాటి ఈరేశం కొన్నాళ్ళకి బదిలీ సేపించుకొని మళ్ళా మా వూరికొచ్చేసినాడు. ఇక్కడ గొడ్లాసుపత్రిలో కాంపౌండరిగా జేరాడు. మా

బోటి వూర్లో కాంపౌండరి అంటే డాట్టరైపోయినట్లే..! అసలు డాట్టరే మా పక్కూరినించి రావాల..! ఆయన ఏ కాలునొప్పో, కన్ను నొప్పో చెప్పి సెలవలెడతావుంటాడు. ఇక గొడ్లకు కడుపొచ్చినా కష్టమొచ్చినా కాంపౌండరీ ఈరేశంగాడే డాట్టరు..!

సరే..! అసలు సంగతేందంటే, ఆడు ఆసుపత్రి పక్కనే ఇల్లేసుకొని సీలచ్చితో కాపురమెట్టాడు. నిజం జెప్పద్దూ..! సీలచ్చికి సినిమాలమీద యావ ఎక్కువే..! అది సంజేళ సింగారించుకొని 'సినిమాకి పోదామా' అనేది. ఈడు మళ్ళీ గైమంటాలేసేవాడు. అట్టాగని ఇద్దరూ అరుసుకుంటారనుకుంటే తప్పే..! లచ్చికి ఇదంతా అలవాటవడం మూలాన గమ్మునే వుండేది.

రోజూ సీలచ్చి మద్దేనం పూట మంచి వంటలన్నీ వండి గిన్నెల్లో సర్ది తెచ్చిపెట్టేది. అదేటోగాని అది రాగానే ఆసుపత్రి తలుపులేసేవాడు ఈరేశం. అసలు దాని మొగం ఊర్లో ఎవరూ సూన్నెలేదంటే సత్యం...! అట్లాగ దాచుకునేవాడు ఈరిగాడు.

ఇట్టాగనే సానా రోజులు గడిచినాయి. ఒక యాళ సాయంపూట ఈరేశంగాడు, సీలచ్చిని యెంటేసుకొని సినిమాకొచ్చాడు. ఇద్దరూ దర్జాగా ఈదెమ్మటి వత్తావుంటే నేను సూసి నోరెళ్ళబెట్టినా..! లచ్చి సినిమా అంటనే 'నీరేత్తా.. చంపేత్తా'.. అని సిందులేసి ఈరంగంజేసే ఈరిగాడేంది, ఇంత ఇదిగా మారిపోయాడని అనుకున్నాను.

ఇక్కడ మా సినిమా హాలు గురించి కొంత చెప్పుకోవాల.

మాదొక టూరింగు టాకీసు..! పట్నంలో హాలుకి ఒకటే ఇశ్రాంతైతే మాకు నాలుగుంటాయి..! నల్లులు, సీమలు సుర్రు, సుర్రున కుడతాంటే నా సామిరంగ సినిమాలు భలేగుంటాయి..! అసలు సినిమా బొమ్మ సరింగా పడదు.. బొమ్మపడితే ఇనపడదు..! "సిరంజీవి భలే యాక్టింగు సేసినాడురోయ్.." అంటే, "సెత్.. ఎదవ.. ఆడు బెమ్మానందంగాడు.." అంటాడు పక్కనోడు. ఈ లోపల కాళ్ళ కింద కుక్క దూరిపోద్ది. అదే ఆడొళ్ళైతే కెవ్వున కేకేత్తంటారు..! బీడీల వాసన గుప్పు గుప్పు మంటది.. ఆడ, ఈడ తుపుక్కు.. తపుక్కున వూసేత్తుంటారు. నాకే సిరాకేసి మద్దెలో లేచొత్తుంటా.. అది యంటీవోడి సినిమా ఐయినా సరే..!

మరి పట్నంలో ఏసీ హాలుకే దీస్కెల్లని ఈరేశంగాడు ఇట్టాటి టాకీసుకి సీలచ్చిని దీస్కొచ్చాడు. ఇసిత్రమే గదా..! ఇదే ఇసిత్రమైతే.. ఆ యాళనుంచి బొమ్మ మారినప్పుడల్లా సీలచ్చితో వచ్చేవాడు. 'ఇదేందిరా నాయనా..' అనుకొని నేను ఒక రోజు సల్లగా యిశయం అడిగా..!

ఆడు ముందు సెప్పలేదు..! నేనొదుల్తానేటి...? "అరే మనం స్నేగితులం.. సిన్నప్పుడు గోలీలాడినాం.. గిల్లీలాడినాం.." అన్నా. "నీ పెళ్ళినే గుదిర్చినా.." నన్నా.

"అవు" నన్నాడు.

ఆ మాటా ఈ మాటా జెప్పి ఇశయం జెప్పరా అన్నా..! ఆడు సెప్పేశాడు..!! అదేంటో మీకు జెప్తా ఇనండి–

ఓ నాడు డాట్టరుబాబు రాలేదు.. (వత్తే గదా సెప్పాల్సిన ఇశయం) నేనూ, ఈరేశంగాడు కూకోని కబుర్లు చెప్పుకుంటండాం..! ఓ రైతొచ్చినాడు.

"ఏందిరా సాములు ఇట్టోచ్చినావు..?" అన్నాన్నేను

"నువ్వుండెశె.." అని ఈరేశంగాడితో– "బాబు ఇట్టా సూడండి.." అన్నాడు.

అంటానే ముందుకు వంగి నాలుగు కాళ్ళ మీద నిలబడ్డాడు. నాలక బయట పెట్టి, గుడ్లు తేలేసి ముందుకీ ఎనక్కీ వూగటం మొదలుపెట్టాడు.

"ఒరేయ్.. సాములు ఏమైందిరా.. ఇప్పటిదాకా బానేవుండావుగదా.." అని నేను ఈరిగాడు ఖంగారుగా నిలబడ్డాం.

సాములుగాడు వూగడం ఆపి...

"నా గొడ్డు ఇట్ట కొట్టుకుంటందయ్యా.." అన్నాడు

"దానికి నువ్వు కొట్టుకొని సూపించాలట్రా... సెప్తే సాలదూ" అన్నాడు ఈరిగాడు.

"వోర్నీ.. అదే కానుపైతే ఎట్టా సూపించేవాడివిరా..." అన్నాన్నేను.

"సరే డాక్టరుబాబు లేడుగాని... ఇదో ఈ మందు కుడితిలో కలిపెట్టు తగ్గిపోద్ది." అన్నాడు ఈరిగాడు.

సాములు ఆ మందుతీసుకున్నోడు గొడ్డుకేమైందో అని లగెత్తాలా? వూహు.. మాతోపాటే కూకొని బీడీ ముట్టించాడు. "ఏందిరా ఇంకా కూకున్నావు. అవతల గొడ్డుకట్టావుంటే..?"

"కాదులే మామా.. ఈరేశంగోరిని ఒక ఇశయం అడగాల.."

"ఏందది?" అడిగాడు ఈరేశం.

"తమరేటి అనుకోకూడదు మరి.."

"సెప్పేహే.. సొద బెట్టకుండా.."

"బాబుగోరు ఎవర్నో సెటప్పుజేసినట్టున్నారు.. ఎవరు బాబూ ఆ పిల్ల..?" అన్నాడు వాడు.

"ఏందిరా సాములు.. నేనేంది సెటప్పేందిరా..?" ఈరిగాడన్నాడు.

"కాదు బాబూ.. మన రైల్వేటేసను మాట్టరు లేడూ.. అదే రమణయ్య.. ఆరు కనుక్కురమ్మన్నారు.."

"ఏం కనుక్కురమ్మన్నారురా.." నేనడిగా. వాడు నాతో పలక్కుండా ఈరిగాడితో అన్నాడు–

"కాదు బాబూ.. మొన్న ఎవతో పిల్ల మీ ఆసుపత్రిలో దూరడం సూసాడట. పిల్ల భలేగుంది.. ఎవరా పిల్లా? ఏంటి కథ? కనుక్కోమన్నాడు.."

ఈరేశం కోపంతో వూగిపోయాడు. "రేయ్.. ఎదవ నాయాల.. అది నా పెళ్ళంరా.."

"వూరుకోండి బాబూ.. పెళ్ళమైతే దర్జాగా రాదా దర్జాగా పోదా.. ఇట్టా సాటుగా రావడమెందుకు.. అదిరాగానే మీరు తలుపైయ్యడమేంది.. సెప్పండి బాబు ఎవత్తది.."

"సెండాలు తీత్తా నాయాల.. నా పెళ్ళం గురించి తప్పుడుకూతలు కూత్తావట్రా.." అంటూ వాణ్ణి పట్టుకొని చావమోదాడు. నేను అడ్డం పోయి ఈరిగాణ్ణి పట్టుకున్నానో లేదో సాములుగాడు దొరికిందే సందు నారాయణా అని లగెత్తాడు.

"మీరు సెప్పకపోతే నేను కనుక్కోలేననుకున్నారా.. సూడండి కనిపెట్టేత్తా.." అంటూ లగెత్తాడు వాడు.

ఈరిగాడు ఈ కథంతా సెప్పగానే నేనడిగాను – "అవున్రా.. నేనూ అక్కడే వున్నా కదా.. దానికి సినిమాకి సంబంధం ఏందని.."

"ఏముంది మామా.. సీలచ్చి అందరికి కనపడకపోవటం వల్లే కద అందరూ ఇట్టాగనుకుంటున్నారు... నేను ఎవ్వరికీ కనపడకుండా దాచటం వల్ల కదా ఈ సాములులాటోళ్ళు రంకు అనుకుంటున్నారు.."

"అవును.. ఐతే"

"ఇంక ఐతే గీతే యేందిరా.. నా పెళ్ళం అందరికీ కనిపించాల.. అది నా పెళ్ళమని అందరికీ తెలియాల.. అందుకే వారం వారం సినిమాకి దాన్నేసుకొని వచ్చేది.."

"వోర్ని భలేటోడివిరా.. సరేలే సాములుగాడి పున్నెమా అని మా సీలచ్చి ఎంతో సంబరపడిపోతోంది.. అది సాలు" అనుకున్నా నేను మనసులో.

(విద్యుల్లత, ఆగష్టు 1998)

ఓపెన్ టైప్

కొంచెం దూరంగా తన కొలీగ్స్‌తో భోజనం చేస్తూ కనపడిందామె. చటుక్కున తల తిప్పుకున్నాను.

"ఉష లాగా వుందే..!! లాగా వుండటం ఏమిటి ఉషే... కొంచెం వొళ్ళు చేసినట్లుంది..!! నన్ను చూసిందా? గుర్తు పట్టిందా? ఏమో.. గుర్తు పట్టకపోతే బాగుండు..!!" అనుకుంటూ మళ్ళీ అటు చూడకుండా భోజనం వడ్డించుకున్నాను.

నాకు ఆ కంపెనీలో అదే మొదటిరోజు. ఇండక్షన్ ట్రైనింగ్ జరుగుతోంది. మూడేళ్ళ వుద్యోగానుభవం వున్నా కొత్త కంపెనీ, కొత్త ఇండస్ట్రీ కావటంతో నాకు అంతా కొత్తగా వుంది. అప్పుడే పరిచయమైన కొత్త మిత్రులతో కలిసి క్యాంటీన్‌లో వున్నాను.

"హేయ్.. రమణా ఈజ్ దట్ యూ?" వినిపించి వెనక్కి చూశాను. ఉష..!!

"ఉష.. హాయ్... ఏంటి ఇక్కడ" అన్నాను ఆశ్చర్యం నటిస్తూ.

"అవును ఇక్కడే.. బిజినెస్ ఎక్సలెన్స్ టీంలో వున్నాను.. సో.. నువ్వు ఇక్కడే చేరావన్నమాట.. ఏ డిపార్ట్‌మెంట్" అడిగింది నా మెళ్ళో వున్న ట్రైనీ టాగ్ చూసి.

"ఎలయన్సెస్" చెప్పాను క్లుప్తంగా. తను నవ్వింది.. ఐదు సంవత్సరాల క్రితం నన్ను కట్టిపడేసిన అదే నవ్వు..!!

"ఎలయెన్సెస్.. ఎవరెవరికి..?" అంటూ మళ్ళీ నవ్వింది. నేనూ చిన్నగా నవ్వాను.

"నన్ను చూసి ఎక్సైట్ అవుతావనుకున్నాను.. అలాంటిదేమీ లేదే?.. సర్లే నాతో రా" అంటూ చెయ్యి పట్టుకుంది.

"ఫ్రెండ్స్ వున్నారు.. ట్రైనింగ్ మధ్యలో లంచ్ బ్రేక్ ఇచ్చారు త్వరగా వెళ్ళాలి" అన్నాను

"ఓకే.. ట్రైనింగ్ అయిపోగానే నాకు రింగ్ చెయ్యి.. కలుద్దాం" అనేసి వెళ్ళిపోయింది.

లంచ్ చేసి, ఫ్రెండ్స్‌తో కిందకి వెళ్ళి సిగరెట్ వెలిగించగానే ఉష కూడా అక్కడికి వచ్చింది.

"ఓ నువ్వు కూడా మొదలెట్టావన్నా మాట.. ఏదీ నాకూ ఒకటి ఇవ్వు" అడిగింది. ఆడవాళ్ళు సిగరెట్ తాగడం నాకేమి కొత్తకాదు.. కాని ఉష సిగరెట్ కాలుస్తుందా?

"ఒక్కటే వుంది.." చెప్పాను.

"ఫర్లేదు.. వీ కెన్ షేర్" అంటూ నా చేతిలో సిగిరెట్ అందుకుంది. గట్టిగా రెండు దమ్ములు లాగి తిరిగి నా చేతిలో పెట్టింది. ఉష పెదవులను తాకిన సిగిరెట్ నా పెదవుల మీదకి... ఆ వూహే నాకు గిలిగింత పెట్టింది. అదీ నా కొలీగ్స్ ఆశ్చర్యంగా చూస్తున్నారని తెలిసినప్పుడు ఇంకా గమ్మత్తుగా వుంది. ఇద్దరం కలిసి సిగరెట్ పూర్తి చేశాం.

"మర్చిపోవద్దు.. ట్రైనింగ్ అవ్వగానే కలుద్దాం" అని మళ్ళీ చెప్పి తను వెళ్ళిపోయింది.

"ఎవరు రమణా ఆ అమ్మాయి?" అడిగాడు ట్రైనింగ్ రూంలో నా పక్కనే కూర్చున్న హేమేంద్ర.

"కాలేజిలో నా సీనియర్.. ఉష" చెప్పాను నేను టూకీగా. "సీనియర్" అనగానే అతను వూహించుకున్నదంతా తప్పు అనుకున్నాడేమో మళ్ళీ మాట్లాడలేదు. కాని అతను వూహించుకున్న దానికన్నా ఎక్కువే జరిగిందని అతనికి తెలియదు.

❖ ❖ ❖

నేను ఎంబీయే కాలేజిలో చేరిన మొదటిరోజే ఉష పరిచయమైంది. భయం భయంగా నడుస్తున్న నన్ను సీనియర్స్ గ్యాంగ్ ఒకటి పిలిచింది. నాకిప్పటికీ గుర్తు.. అందరూ లైబ్రరీ మెట్లమీద కూర్చోని వున్నారు. అందరి మధ్యలో ఉష...

బ్లాక్ జీన్స్ పైన ఎర్రటి స్లీవ్లెస్ టాప్.

"పేరు" ఎవరో అడిగారు.

"రమణ సార్"

“పూర్తి పేరు చెప్పు”

“ ”

“చెప్పు”

“వద్దు సార్ మీరు వెక్కిరిస్తారు”

“అంత వెక్కిరించే పేరా.. అయితే చెప్పాల్సిందే”

“హటకేశ్వరం ఇందీవర వెంకటరమణ”

ఉష వెంటనే నవ్వింది.. మిగతా వాళ్ళకి అర్థమవ్వలేదు. తను నిలబడి–

“అంటే ఎచ్.ఐ.వి. రమణ అన్న మాట” అన్నది నవ్వుతూనే. అందరూ ఘొల్లుమన్నారు.

“అందుకే మేడం పేరు చెప్పను అన్నది..” అన్నాను ఆమె వైపు చూస్తూ.

“ఏయ్.. మేడం ముందు కళ్ళలో కళ్ళు పెట్టి చూస్తావా? దించు.. చూపు దించు..” అన్నాడు పక్కనే వున్న మరో సీనియర్. నేను కొంచెం తల దించాను. పూర్తిగా దించలేదని ఆమెకి కోపం వచ్చింది.

“కిందకు దించు అంటే ఎక్కడరా చూస్తున్నావు.. ఇక్కడేనా చూస్తున్నావూ?” అన్నది గుండెమీద చెయ్యేస్తూ. నేను భయంగా తలెత్తాను..

“ఏంటి నచ్చిందా? చూడు అయితే.. చూడు..” అంటూ చేతులు వెనక్కి విరిచి ముందుకొచ్చింది. అప్పుడు నేను పరుగెత్తిన పరుగు క్లాస్‌రూంకి వెళ్ళేదాకా ఆపలేదు. వెనకాల అందరూ నవ్వుతున్నారు. అందరూ నవ్వుతున్నారు. ట్రైనర్ నా వైపే చూస్తున్నాడు.

❖ ❖ ❖

“విల్ యు ప్లీజ్ ఆన్సర్ మై క్వశ్చన్.” అన్నాడు కోపంగా

“సారీ సార్.. మీరు చెప్పింది వినలేదు.” చెప్పాను నేను నిజాయితీగా.

“ఇది కాలేజ్ కాదు.. ట్రై టు బి ప్రొఫెషనల్..!!” అన్నాడు కోపంగా. నేను తల వూపాను. కాని మనసు ఉష చుట్టే తిరుగుతుంటే ఆలోచనలని ఎలా ఆపగలను?

ఎలాగైనా ఈ రోజు కలవకుండా తప్పించుకోవాలి. ట్రైనింగ్ అయిపోగానే గెస్ట్‌హౌస్‌కి

వెళ్ళిపోవాలి అనుకున్నాను. 'ఉష అంటే ఎందుకంత భయం..' అంతలోనే అనిపించింది. తనతో నాకు వున్న ఇంటిమసీ వేరే ఎవ్వరికీ వుండేది కాదు.. అప్పుడు నేను చేసిన తప్పుకి ఇప్పుడు గిల్టీగా ఫీలౌతున్నానా? ఏమో అర్థం కావటంలేదు. కాని ఉష మాత్రం ఏమీ మారినట్టులేదు. అదే రెక్లెస్‌నస్ అదే ఓపెన్ టాక్..!!

ట్రైనింగ్ పూర్తైపోయింది. మిగిలిన వారు ఏవో జాయినింగ్ ఫార్మాలిటీస్ పూర్తి చెయ్యాలని ఆగిపోయారు. నేను మాత్రం వెంటనే టాక్సీ ఎక్కి గెస్ట్‌హౌస్‌కి వెళ్ళమని చెప్పి, నిర్లిప్తంగా కిటికీలోనించి బయటకు చూస్తున్నాను.

ఉష నా కోసం ఎదురు చూస్తుంటుందా? అసలు ఎందుకు వుండమంది? కాలేజిలో నా రాగింగ్ ప్రహసనం విన్న తరువాత నా క్లాస్‌మేట్స్ చెప్పింది గుర్తుకు వచ్చింది.

"ఆ అమ్మాయి పేరు ఉష.. చాలా ఓఓఓపెన్" అన్నాడు మాధుర్ చివరి పదాన్ని సాగదీస్తూ.

"అంటే"

"అంటే ఏముంది బ్రదర్.. షీ ఈజ్ ఆల్వేస్ విల్లింగ్.. నెవర్ సే నో.. ఇంట్రెస్ట్ వుంటే ప్రయత్నించు" చెప్పాడు వాడు. అది విన్న తరువాత నాకెందుకో ఆమె అంటే మంచి అభిప్రాయం కలుగలేదు. కాని ఇప్పుడు..!! ఇప్పుడున్న అభిప్రాయమే వేరు..!!

టాక్సీ ఏదో సిగ్నల్ దగ్గర ఆగింది. ఒక పిల్లాడు చేతిలో రకరకాల మేనేజిమెంట్ పుస్తకాలు అమ్ముతున్నాడు. ప్రత్యేకించి రెండు పుస్తకాలు నన్ను ఆకర్షించాయి– "రాబర్ట్ కియోసాకి–రిచ్ డాడ్ పూర్ డాడ్" దాని పక్కనే "రాబిన్ శర్మ – ద మాంక్ హూ సోల్డ్ హిస్ ఫెరారి". అవే పుస్తకాలు.. కాలేజిలో ఉషతో నాకు పరిచయాన్ని, ఆ తరువాత చనువుని పెంచినవి....

నా చేతిలో "రిచ్ డాడ్.." పుస్తకం చూసి అడిగింది.

"నచ్చిందా?" అని

"ఏమిటి?"

"అదే ఆ బుక్"

"బాగానే వుంది.."

"ఏంటి బాగుండేది.. ఇట్స్ కంప్లీట్‌లీ మెటీరియలిస్టిక్.. రీడ్ రాబిన్ శర్మ.. అతను మెటీరియల్ ప్లజర్స్ అనుభవించి వాటికి అతీతంగా వుండాలని వ్రాసిన పుస్తకం" చెప్పింది.

"మెటీరియలిజం అంటే మీకు ఇష్టం లేదా?" అంటే ఆ అమ్మాయి నవ్వింది.

"నీ గర్ల్‌ఫ్రెండ్‌తో సెక్స్ తరువాత ఆమెకి వెయ్యి రూపాయలు ఇస్తే ఆమె ఏమంటుంది" అడిగింది కాజువల్‌గా. వూహించని ప్రశ్నకి ఖంగు తిన్నాను. తడబాటును కప్పిపుచ్చుకొని–

"నాకు గర్ల్‌ఫ్రెండ్స్ లేరు.." అన్నాను.

ఉష గట్టిగా నవ్వి "చో చ్వీట్.." అంటూ నా తలపై చేత్తో చిన్నగా కదిపింది.. "ఎనివేయ్.. నేను చెప్పాలనుకున్నది నీకు అర్థమైందని నాకు తెలుసు" అంటూ కన్ను గీటింది.

"అలా ఎలా తెలుస్తుంది?" అడిగాను.

తను నాకు దగ్గరగా వచ్చి అన్నది– "అదే కాదు.. గర్ల్‌ఫ్రెండ్‌తో సెక్స్ అనగానే నీ ఖంగారు చూస్తే నువ్వు వర్జిన్ అని కూడా తెలిసిపోయింది.."

నా గుండె కొట్టుకుంటున్న వేగం మెదడుదాకా తెలుస్తోంది. ఈమె నిజంగానే ఆ టైపా? చూడటానికి చక్కగానే వుందే...! ఏమైనా ఈమెకి దూరంగా వుండాలి అనుకున్నాను.

"ఈవినింగ్ ఇంటికిరా ఆ పుస్తకం ఇస్తాను.. డోంట్ ఫర్గెట్.." అనేసి వెళ్ళబోయి మళ్ళీ వెనక్కి తిరిగి తల మీద చెయ్యి పెట్టి అన్నది– "చో స్వీట్.."అని.

"సార్! బాంద్రా గెస్ట్‌హౌస్" అన్నాడు టాక్సీ డ్రైవర్.

నేను తేరుకొని డబ్బులిచ్చి నా రూంలోకి వడివడిగా వెళ్ళిపోయాను. రూంలో బాత్ టబ్ వుంది. దాని నిండా గోరువెచ్చటి నీళ్ళు నింపుకొని అందులో దిగాను. మళ్ళీ ఉ ష గురించే ఆలోచన. ఇప్పుడు ఎక్కడ వుంటుంది. నా కోసం ఎదురుచూస్తూ ఆఫీస్‌లోనే వుంటుందా? లేకపోతే తన గురించి మర్చిపోయి ఇంటికి వెళ్ళిపోయి వుంటుందా? పెళ్ళైందో లేదో..!!

అప్పుడు కాలేజిలోనూ అలాగే చేశాను.. తను రమ్మన్నా నేను ఆమె ఇంటికి వెళ్ళలేదు.

"నువ్వు వస్తావని ఎంతసేపు వెయిట్ చేశానో తెలుసా? ఇంట్లో ఎవ్వరూ లేరు.. నాకు బోరు కొడుతూ వుండింది. నువ్వొస్తే ఎంత బాగుండేది" అన్నది

"మార్కెటింగ్ ప్రాజెక్ట్ గురించి ప్రొఫెసర్‌తో..."చెప్తుండగానే మధ్యలో అందుకుంది.

"స్టాపిట్ యార్.. ఒక అమ్మాయి పిలిస్తే రాకపోవడానికి చాలా సిల్లీ రీజన్ అది.. వేరే ఏదైనా అమ్మాయితో కలిసి పార్క్‌కి వెళ్ళాను అనో డేట్‌కి వెళ్ళాననో చెప్పు కొంచెం బాగుంటుంది" అన్నది.

"ఛ.. ఛ.. అలాంటిదేమీ లేదు"

"ఛ.. ఛ.. ఏమిటి.. అదేదో చెయ్యకూడని తప్పు చేసినట్టు.. నేనైతే తప్పు చేసినా ఛ ఛ అనుకోను తెలుసా?" కన్ను గీటింది.

ఏమిటీ అమ్మాయి.. ఎందుకలా మాట్లాడుతోంది..??

"ఈ రోజైనా వస్తావా..?" అడిగింది

"వస్తాను" చెప్పాను.

నా క్లోజ్ ఫ్రెండ్ శేఖర్‌కి జరిగింది చెప్పాను. పక్కన మాధుర్ కూడా వున్నాతడు.

"నాకు తెలిసి ఆ అమ్మాయి గ్రీన్ సిగ్నల్ ఇస్తోంది.. గో ఎహెడ్ బ్రదర్.." అన్నాడు శేఖర్.

"అవును.. మంచి ఛాన్స్.. నేను ముందే చెప్పానుగా.. ఆల్వేస్ విల్లింగ్.. ఎంజోయ్ రమణ" అన్నడు మాధుర్.

"ఛ..ఛ.. అలాంటిదేమిలేదు.. పుస్తకం ఇవ్వటానికే.." అన్నాను నేను తడబాటుగా.

"పుస్తకం ఇవ్వాలంటే తనే తెచ్చి ఇవ్వచ్చుగా.. ఇంటికి రమ్మనడం ఎందుకూ" శేఖర్ అడిగాడు.

"అవును.. అది కూడా ఇంట్లో ఎవరూ లేరు అని చెప్పడం ఎందుకూ? అనుమానమే లేదు..." మాధుర్ వంతపాడాడు.

"నాకు ఇలాంటివేమీ తెలియదురా.. ఫస్ట్ టైం" అంటుంటేనే నాకు గుండెల్లో దడ పెరుగుతోంది.

"ఫర్లేదులేరా.. ఆ అమ్మాయికి అంతా తెలిసే వుంటుంది...తీసుకెళ్ళాల్సినవి మర్చిపోకు" అన్నాడు కన్ను గీటుతూ.

"ఛ.." అన్నాను మనసులో మరోరకంగా ఆలోచిస్తూ.

ఆ రోజు సాయంత్రం రూంలో స్నానం చేసి నీటుగా తయారయ్యాను. మాధుర్ తన సెంట్ బాటిల్ ఇచ్చి "వాడరా.. బాగుంటుంది" అన్నాడు. శేఖర్ తన బైక్ ఇచ్చాడు. కొత్త పెళ్ళికొడుకుని శోభనానికి తయారు చేసినట్లు ముస్తాబు చేశారు ఇద్దరూ. మధ్య మధ్యలో ఆ టైపు జోకులు.. చివరికీ "విజయీభవ" అంటూ ఆశీర్వదించి పంపించారు.

నేను ఉష ఇంటికి వెళ్ళాను. గుండె చప్పుడు చెవుల్లో కొడుతున్నట్టు వినపడుతోంది. నుదిటి మీద చమట తుడుచుకున్నాను. ఎన్నిసార్లు కాలింగ్ బెల్ మీద చెయ్యిపెట్టి మళ్ళీ వద్దనుకున్నానో లెక్కే లేదు. చివరికి స్థిరంగా నిర్ణయించుకొని కాలింగ్ బెల్ కొట్టాను.

❖ ❖ ❖

గణ గణ మోగింది ఫోను. అలా ఎంతసేపు బాత్‌టబ్బులో వున్నానో నాకు తెలియనే లేదు. చటుక్కున లేచి టవల్ చుట్టుకొని ఫోన్ ఎత్తాను. అవతల రిసెప్షనిష్ట్.

"సార్ మీకు ఎవరో ఫోన్ చేశారు..!! కనెక్ట్ చెయ్యమంటారా" అడిగిందామె.

"సరే ఇవ్వండి" అన్నాను. అది ఖచ్చితంగా ఉషే అని అనిపించింది. నా ఆలోచన తప్పుకాదు.

"ఏమైంది.. నన్ను కలవమన్నాను కదా"

"ఏం లేదు.. కొంచెం ఫ్రెష్ అయ్యి వద్దామని రూంకి వచ్చాను" అబద్ధం చెప్పాను.

"ఏంటి సంగతి.. ఫ్రెష్‌గా వచ్చి ఏం చేద్దామని.." అంటుంటే ఆమె గొంతులోనే చిలిపితనం వినపడుతోంది.

"నువ్వేం మారలేదు ఉషా" అన్నాను నేను.

"అవును.. మారే వుద్దేశ్యాలు కూడా లేవు.. నాతోపాటు వస్తే నీకే తెలుస్తుంది.."

"ఎక్కడికి?"

"హవాయన్ షాక్స్.." అంటూ అడ్రస్ చెప్పింది.

నేను ఫోను పెట్టేసి బయలుదేరాను. అక్కడికి చేరుకునే సరికి ఆమె అక్కడే వుంది. చెయ్యి పట్టుకొని లోపలికి లాక్కెళ్ళింది. లోపల వాతావరణం అర్థమవ్వటానికి రెండు నిమిషాలు పట్టింది. అది ఒక పబ్.

"ఏం తీసుకుంటావు?"

"నువ్వు తాగుతావా?"

"ఏం నువ్వు తాగవా?"

"ఎప్పుడన్నా"

"ఇప్పుడే ఆ ఎప్పుడన్నా.. చెప్పు"

"విస్కీ విత్ షోడా.."

తను ఆర్డర్ ఇచ్చింది. తనకేమో లాంగ్ ఐలాండ్ చెప్పింది. తను మందు తాగుతుందని నేను వూహించనే లేదు.

చిన్న పడవ గోడలో నుంచి దూసుకొచ్చినట్లు వుంది ఆ కౌంటర్. మిగిలిన భాగమంతా తక్కువ కుర్చీలతో ఎక్కువ శాతం డాన్స్‌చెయ్యడానికి అనువుగా వుంది. చాలా ఇరుకుగా వుంది. అయినా చాలా మంది వున్నారక్కడ.. ఇంకా వస్తూనే వున్నారు. రంగు రంగుల లైట్లు దారి తప్పినట్లు ఎటంటే అటు తిరుగుతూ వున్నాయి.

నా గ్లాస్ నాకిచ్చి, తను కాక్‌టైల్ పట్టుకొని చిన్నగా డాన్స్ చెయ్యడం ప్రారంభించింది. నన్ను కూడా డాన్స్ చెయ్యమంది. "నా వల్ల కాద"న్నాను. అసలు ఒకరి మాటలు ఒకరికి వినపడకుండా మోతగా వున్న ఆ పాటలే నాకు రుచించట్లేదు. ఉష నన్ను పట్టుకొని గట్టిగా ముందుకు లాగింది. తుళ్ళిపడబోయి తమాయించుకున్నాను. నా చేతిలో విస్కీ ఆమె మీద కొద్దిగా వొలికింది. "ఫర్లేదు" అన్నట్టు నాలుక చిత్రంగా బయట పెట్టి నా నడుం మీద చెయ్యివేసింది. మరో చెయ్యి భుజం మీద పడింది. నేనూ డాన్స్ చెయ్యడం మొదలుపెట్టాను.

ఆ రోజు ఇలాగే ఇంతే దగ్గరగా.. పుస్తకం తీసుకోడానికి వెళ్ళి ఎంత సేపు వున్నానో నాకే గుర్తు లేదు. అటకమీద పుస్తకాలు దించేందుకు చిన్న స్టూల్ వేసుకొని ఎక్కింది. నేను స్టూల్ పట్టుకొని, ఆమె చేతులు పైకెత్తి పుస్తకాలందుకుంటుంటే నేను అలాగే ఆమె "స్ట్రెచ్డ్" శరీరాన్ని చూస్తూ వుండిపోయాను. స్టూల్ ఎప్పుడు వదిలేశానో నాకే తెలియలేదు.

తను నా మీద పడింది. ఇద్దరం మంచం మీద పడ్డాం. అది ఆమె కావాలనే చేసిందా, లేక యాదృచ్ఛికంగానే జరిగిందా ఆలోచించే స్థితిలో లేను. ఆ దగ్గరతనం.. ఆ స్పర్శ మాధుర్యంలో ఎప్పుడు కరిగిపోయానో నాకే తెలియదు. కొద్దిగా ముందుకు వంగి ఆమె పెదవుల మీద...

❖ ❖ ❖

"ఏయ్ ఏమైంది నీకు... ఎక్కడ ఆలోచిస్తున్నావ్? కమాన్ డాన్స్.. ఇదే ఆఖరు పాట" చెప్పిందామె.

అప్పటికే ఆమె నాలుగు గ్లాసులు నేను నాలుగు గ్లాసులు తాగేశాము.

పబ్‌లో డాన్స్ అయిపోగానే తన ఇంటికి రమ్మన్నది ఉష.

"వద్దు ఉషా.. బాగుండదు.."అన్నాను.

"ఏ కాలంలో వున్నావ్ రమణా.. ఇది ముంబై... నువ్వు రావటమేకాదు.. నాతో కాపురం చేసి నలుగుర్ని కన్నా కనీసం పక్కింటోళ్ళకి కూడా తెలియదు.." చెప్పిందామె.

ఇద్దరం ఆమె కార్లో బయలుదేరాము.

"ఉషా.. పెళ్ళి చేసుకున్నావా?"

"ఈ ప్రశ్న నాతో డాన్స్ చెయ్యక ముందు అడగాల్సిందేమో కదా.." అంటూ నవ్వేసి "అయ్యింది.. ఖంగారు పడకు ఆయన ఇంట్లో లేదులే. మేం విడిపోయాం." చెప్పింది.

నేను ఆమె వైపు ఎంతసేపు చూశానో, ఎందుకు చూశానో కూడా గుర్తులేదు.

ఇంట్లోకి అడుగుపెట్టగానే సిగరెట్ వాసన గుప్పుమంది.

"కూర్చో.. ఫ్రెష్ అయ్యి వస్తాను.." అంటూ వెళ్ళబోయి మళ్ళీ ఆగి "ఫ్రిజ్‌లైన విస్కీ వుంది.. ఫ్రిజ్‌లో సోడా.. నాక్కూడా ఒకటి కలిపి వుంచు" కన్ను గీటి వెళ్ళిపోయింది.

నేను లేచి ఫ్రిజ్ వైపు నడిచాను.

❖ ❖ ❖

విస్కీ గ్లాసులో సోడా కలపగానే మాధుర్ వెంటనే పైకెత్తాడు...

"చీర్స్.. చీర్స్" అరిచాడు వుత్సాహంగా

"ఇంతకీ పార్టీ ఎందుకో చెప్పనే లేదు.." అడిగాడు శేఖర్.

"ఇంకెందుకురా.. మనవాడు నిన్న వెళ్ళిన పని దిగ్విజయంగా పూర్తిచేశాడు." మాధుర్ అన్నాడు.

నాకేదో ఇబ్బందిగా వుంది.

"ఏరా నిజమేనా? మరి చెప్పనే లేదు? ఏంటి వర్కవుట్ అయ్యిందా"

"ఊ" అన్నాను నేను.

"దానికి సిగ్గెందుకోయ్.. బీ లైక్ ఏ మాన్.. ఇంతకీ ఎలా జరిగిందో చెప్పు"

"చెప్పేదేముంది.. వి డిడ్ ఇట్.."

"అదే రా ఎలా.. ఐ మీన్ ఎలా మొదలైంది.. ఎవరెవరు ఏం చేశారు"

"నోరు ముయ్యి.. అదంతా ఇక్కడా.. రూంకి వెళ్ళాక చెప్తా.. ఇందాకే మాధుర్ గాడికి చెప్పాను.."

"అవునురా.. డిటైల్డ్‌గా చెప్పాడు.. నేను చెప్తాగా" అన్నాడు మాధుర్ కన్నుగొడుతూ.

నేను ఆలోచిస్తూ వుండిపోయాను.

❖ ❖ ❖

"ఏంటి ఎప్పుడూ ఏదో ఒకటి ఆలోచిస్తుంటావు.." ఉష అడిగింది. తెల్లటి నైట్ డ్రస్ వేసుకొని వుందామె.

"ఏమీలేదు.." అన్న తరువాత చాలాసేపు మాట్లాడుకోలేదు. తర్వాత నేనే అడిగాను "ఎందుకు విడిపోయారు.." అని ఆమె సూటిగా చూసింది.

"ఈ ప్రశ్న ఇంకెవరన్నా వేస్తే నీకెందుకు అనేదాన్ని.. నీతో అలా అనలేను.. వాడు నా గురించి పూర్తిగా తెలిసే పెళ్ళి చేసుకున్నాడు. నీకు తెలుసుగా నేను మాట్లాడే తీరు.. అవతలి వాడు ఏమనుకుంటాడో ఆలోచించకుండానే డబల్ మీనింగ్ డైలాగులు.. ఒక్కోసారి డైరెక్ట్ మీనింగ్ డైలాగులు.. మొదట్లో అతనికీ ఇలా వుండటం నచ్చింది కాని తరువాత తరువాత అతనితోనే అలా వుండమనే వాడు. మిగతా మొగవాళ్ళతో అలా మాట్లాడకూడదన్నాడు. నేను అలా వుండలేనన్నాను.. అలా మా ఇద్దరి మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి.. అంతే విడిపోయాము.." చెప్పింది.

"అంతేనా...? అడిగాను.

"అసలు బేసిక్ కారణం అదే.. కాకపోతే.. నాకు వేరే ఎవరితోనో సంబంధం వుందని అతనికి ఎవరో చెప్పారు. జోక్ చెప్పనా ఆ సంబంధం ఎవరితోనో కాదు.. నీతోనే వుందట.. దట్ వాజ్ ద లాస్ట్ నైల్".

నేను అదిరిపడ్డాను. ఉషకి నాకు అఫైర్... నా వల్లే ఉష ఆమె భర్త విడిపోయారు...!

"హలో.. అంత ఆలోచించాల్సిన పనిలేదు.. ఆ మనిషే అంత... నువ్వు కాకపోతే ఏ పోస్ట్‌మానుకో, పాలవాడికో అంటగట్టేవాడు... కాలేజిలో మనిద్దరి గురించి ఏం మాట్లాడుకునేవారో నీకు తెలుసుగా.. అదే ఎవరో వాడికి చెప్పారు. దాంతో వాడికి ఒక పేరు దొరికింది అంతే.. పోస్ట్‌మెన్, పాలవాడికన్నా నువ్వే బెటర్ అని అక్కడే సంబంధం తెంచేసుకున్నాను.. నువ్వేం దిగాలుగా ముఖం పెట్టాల్సిన పనిలేదు." అన్న దామె మరో పెగ్గు కలుపుకుంటూ.

ఆ తరువాత ఇద్దరం ఏమి మాట్లాడలేదు.

❖ ❖ ❖

ఆమె ఏమీ మాట్లాడలేదు.

మంచం మీద అలాగే వున్నాం.. నేను కొంచెం దగ్గరగా జరిగి ఆమె పెదవుల మీదకు వంగాను. ఆమె చట్టుకున తేరుకొని గట్టిగా నన్ను తోసేసింది. లేచి మంచం దిగి–

"ఫర్లేదే.. మంచి స్పీడు మీదే వున్నావు.." అంది.

జరిగిన దానికి నేను తత్తరపడ్డాను. "అయితే నీ కవ్వింపులు దీనికోసం కాదా" అని అడగబోయాను. కాదని తెలుస్తూనే వుంటే ఇంకా అడగటం ఎందుకని తల దించుకొని "అయాం సారీ" అన్నాను.

ఆమె గట్టిగా నవ్వి– "దట్స్ ఓకే.. ఫర్లేదు.. నన్ను చూసిన ప్రతివాళ్ళూ ఇలాగే అనుకుంటారు. నేను ఓపెన్‌గా మాట్లాడటం వల్లే అందరూ అలా అనుకుంటారు అనుకుంటా.. అయినా నేను ఇంతే నా నేచరే అంత.. నిన్ను చూస్తే ఎందుకో నా గురించి అలా అనుకోవట్లేదు అనిపించింది... అందుకే ఇంకొంచెం చొరవగా వున్నాను... ఇంకెప్పుడూ నా గురించి ఇలా ఆలోచించకు... లెట్స్ బీ గుడ్ ఫ్రెండ్స్.." చెప్పిందామె.

నేను తలవూపాను.

❖ ❖ ❖

"ఏమిటి మళ్ళీ ఆలోచిస్తున్నావు?" అడిగింది ఉష.

"అదే మన గురించి అలా ఎవరు చెప్పారో అని.." అన్నాను.

"ఎవరో మా ఆయన కొలీగ్... మన క్యాంపస్‌లోనే చదివాడట... ఎవరో మథురో మాథురో...

నాకు వూహించని షాక్..!!

అప్పుడేదో యవ్వనోత్సాహంలో జరగనిది జరిగినట్లు నా ఫ్రెండ్స్ దగ్గర కోతలు కోసాను..!! దాని పర్యవసానం ఇంత దారుణంగా వుంటుందా? నాకెందుకో గిల్టీ ఫీలింగ్ ఎక్కువౌతూ వుంది.

"హలో మాష్టారూ... అది గెస్ట్ బెడ్‌రూం.. వెళ్ళి అక్కడ పడుకొని తీరిగ్గా ఆలోచించుకోండి..." చెప్పిందామె.

నాకెందుకో ఆమెకి జరిగింది చెప్పి క్షమించమని అడగాలని వుంది. కాని మనసుకు మాటకు మధ్య ఏదో అడ్డం పడుతోంది. నేను లేచి ఆ బెడ్‌రూం వైపు అడుగులు వేశాను.

ఉషకి ఆ విషయం ఇప్పటికీ చెప్పలేదు..!!

(పొద్దు, అంతర్జాల పత్రిక మే 2010)

మేరా భారత్ మహాన్

"భారత స్వాతంత్ర్య దినోత్సవం"

"అంటే?"

"అదేరా ఇండిపెండెన్స్ డే"

"అయితే?"

"అందుకని మన కంపెనీలో ప్రత్యేకంగా ఫాన్సీ డ్రస్ కాంపిటీషన్" చెప్పాడు రాజు

"ఫ్యాషన్ షోనా?" తన అమాయకత్వం వెలిబుచ్చాడు సుందరం.

'ఫ్యాషన్ షో కాదురా..ఫాన్సీ డ్రస్.. అదీ మన స్వాతంత్ర సమర యోధుల గెటప్పుల్లో రావాలట"

"బాగానే వుంది... అయితే నేను ఎన్టీ రామారావు గెటప్పులో వస్తా.."

"ఓరేయ్.. స్వాతంత్ర సమరయోధుడంటే ఎన్టీ రామారావు.. అక్కినేని నాగేశ్వరరావు కాదు..!"

"మరి?"

"అంటే గాంధీ నెహ్రూ... ఇలాగన్న మాట"

"అయితే నేను నెహ్రు.."

"అలా కాదు.. మన ఆఫీసులో అన్ని రాష్ట్రాల వాళ్ళు వున్నారు కదా.. ఏ రాష్ట్రం వాళ్ళు ఆ రాష్ట్రం నాయకుడి గెటప్పులో రావాలి.."

"అంటే?"

"అంటే మన శుక్లాజీ వున్నారు కదా.. ఆయనదేమో యూపీ..! అందుకని ఆయన నెహ్రూ గెటప్పులో వస్తాడట.."

"అయితే మన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ నుంచి ఎవరి గెటప్పులో వస్తే బాగుంటుంది?"

"అదే ఆలోచిస్తున్నా.. మన సరళ లేదూ.. ఆవిడేమో సరోజినీ నాయుడు గెటప్పులో వస్తుందట.. నేను టంగుటూరి ప్రకాశం గెటప్పులో వద్దామని..."

"తూచ్.. నేనొప్పుకోను..నేను ప్రకాశం గెటప్పులో వద్దామనుకుంటుంటే.."

"అహా.. కుదరదు.. నేను ముందే చెప్పేశాను.."

"పోనీ ఇంకెవరైనా వుంటే చెప్పు.."

"పింగళి వెంకయ్య?"

"ఆయనెవరు?"

"వురేయ్.. మన జాతీయ పతాకం రూపొందించిన వ్యక్తి.."

"ఆయన ఎలా వుంటాడో తెలియదే..!!"

"అవును నిజమే.. పోనీ భోగరాజు పట్టాభిసీతారామయ్య?"

"ఈయనెవర్రా బాబు? అసలు తెలియనే తెలియదే..!"

"ఏమోరా.. నాకు ఇంకెవరూ గుర్తులేరు.."

"పోనీ శ్రీశ్రీ?"

"శ్రీశ్రీ, ఆత్రేయ, చంద్రబోసు.. వీళ్ళు దేశనాయకులు కాదురా.."

"ఆ గుర్తొచ్చింది.. చంద్రబోస్.. సుభాష్ చంద్రబోస్.. సుభాష్ చంద్రబోస్"

"చంద్రబోస్ ఒరిస్సాలో పుట్టిన బెంగాలీ... తెలుగువాడు కాదుగా..?"

"మరి వెంకటేష్ సినిమాలో వేషం వేశాడుగా"

"ఆ చంద్రబోస్.. ఈ చంద్రబోసు ఒకళ్ళు కాదురా"

"సరే! నేనేదో ఆలోచిస్తాలే.."

"సరే! రేపు కలుద్దాం"

"బై"

"బై"

❖ ❖ ❖

"ఇడుగడుగో.. ఇడుగడుగో.. ఆకాశం భళ్ళున తెల్లారి వస్తున్నాడిడిగో అగ్గిపిడుగు అల్లూరి.." పాడుకుంటూ వచ్చాడు సుందరం

"వురేయ్ ఏమిటిరా ఈ గెటప్పు" అడిగాడు ప్రకాశం పంతులు గెటప్పులో వున్న రాజు.

"ఏం.. ఇదికూడ తెలియదా... సూపర్ స్టార్ కృష్ణగారు.. అన్నగారు వేసిన గెటప్పు.. అల్లూరి సీతారామరాజు"

"అది సరే... ఈ చొక్కా లేకుండా ఈ బాణాలేమిటి? ఈ గడ్డం ఏమిటి?"

"మరి అల్లూరి అంటే క్లీన్ షేవింగ్ చేసుకోని.. జీన్స్ ప్యాంట్ వేసుకుంటాడా? కరెక్ట్‌గానే వుందిగా"

"వుంది సరే.. ఇలా ఆఫీసుకి చొక్కా లేకుండా వస్తే ఎట్టారా?"

"మరి అల్లూరి సీతారామరాజు చొక్కా వేసుకోడు కదా?"

"కరెక్టే.. అప్పుడు వేరే ఏదైనా గెటప్పు వేసుకోవచ్చుగా?"

"నాకు ఇంకెవ్వరూ గుర్తు రావటంలేదురా.. శ్రీహరి సినిమా హనుమంతు గుర్తుకొచ్చింది కాని మళ్ళీ అది నిజం కాదంటావని ఇదుగో ఇలా.."

"అదుగో బాసు వస్తున్నాడు.."

"ఏమిటి సుందరం ఈ గెటప్పు..??" ఇంగ్లీషులో అడిగాడు భగత్‌సింగ్ గెటప్పులో వున్న జస్‌ప్రీత్.

"మీకేమి సార్.. మీ భగత్‌సింగ్‌కి చొక్కావుంది.. మా అల్లూరి గెటప్పు ఇంతే మరి"

"అయితే వేరే ఏదైనా గెటప్పులో రావాలి.. ఇలా చొక్కా లేకుండా ఆఫీసుకు వస్తారా? ఇప్పుడు మన ప్రొప్రైటర్‌గారు వచ్చారంటే ఏం సమాధానం చెప్పాలి?"

"అదుగో ప్రొప్రైటర్ కారు వచ్చింది" చెప్పాడు రవీంద్రనాథ్ ఠాగూర్ గెటప్పులో వున్న సుబేంద్రు రాయ్.

అందరూ అలెర్ట్ అయిపోయారు. మన సుందరం గుండె గడబిడ గడబిడ అని కొట్టుకుంటోంది..!!

అంతలో అక్కడ కారులోనించి చిన్న పంచెతో పైన మరో చిన్న గుడ్డతో, చేతిలో కర్రతో దిగాడు బట్టతల ప్రొప్రైటర్ – జిగ్నేష్ భాయ్..

(అముద్రితం)

పద్మావతీ శ్రీనివాసం

అలమేలుమంగమ్మకి అలసటగా అనిపించింది. మగతకళ్ళను నలుపుకోని, "ఇంకా రాడేం నా నామాలస్వామి" అంటూ పలవరించింది. ఆ రోజు శుక్రవారం కావటంతో, ఆమెకీ భక్తుల తాకిడి ఎక్కువగానే వుంది.నిద్ర ముంచుకొస్తోంది. అయినా మునుపు ఏడుకొండలవాడు వచ్చినప్పుడు శుక్రవారం తప్పక వస్తానని చేసిన ప్రమాణం గుర్తుంది. అందుకే ఈ ఎదురుచూపులు. బద్ధకంగా లేచి నాలుగు అడుగులు వేసి గుమ్మందాకా వచ్చింది ఆ తల్లి. కనుచూపు సాగినంతవరకు పరికించి ఏడుకొండలవైపు చూసింది. ఏముంది.. ఆయన జాడ లేదు సరికదా, ఇసుకేస్తే రాలనట్లు జనం కనిపించారు. ఇంకా వస్తున్నారు.. బస్సుల్లో, కార్లలో, కాలినడకన.. జనం జనం జనం. ఒక పక్క ఒక గుంపు "గోవిందా... గోవిందా" అని అరిస్తే, అటువైపు వున్నాడేమో అని చూసింది. ఇంతలో మరోవైపు "ఏడుకొండలవాడా వేంకటరమణ.." అని మరో భక్తసమూహం కేకపెడితే, పోనీ అటువైపు కానీ వెళ్ళాడా అని చూసింది. ఎక్కడా ఆయన జాడే లేదు.

అలమేలుమంగమ్మ మరికాస్త పరికించి, తిరుమల కొండపైన దృష్టి సారించింది. ఇంకా పవళింపు సేవకి టికెట్లు ఇస్తున్నారు. "నారాయణా... ఇంకా సేవలు వున్నాయా? భక్తపక్షపాతం కాకపోతే ఎప్పుడూ వాళ్ళ సేవలేకానీ, మిమ్మల్ని సేవించి తరించే అవకాశం నాకు ఇవ్వవు కదా.." అంటూ నిట్టూర్చింది.

చేసేదిలేక భారంగా అడుగులేసుకుంటూ లోపలికి వచ్చింది. ఆమె శ్రీవారు వస్తే అలంకరించాలనుకున్న వజ్రాలపతకం, పట్టుపీతాంబరం ఆ పక్కనే తిరునామం తీర్చిదిద్దడానికి సర్దుకున్న సరంజామా అన్నింటినీ ఒక్కసారి చూసుకుంది.

"ఏం లాభం.. రావటమే ఆలస్యం.. ఇంక వీటన్నింటికీ తీరికేది? అసలు ఆయన సక్రమంగా భోజనం చేసి ఎన్నాళ్ళైందో.." అనుకున్నది. ఆలోచన రాగానే, ఆయన కోసం ఏర్పాటు చేసిన భోజనాల సంగతి గుర్తొచ్చింది. అయ్యో గోవిందా.. అన్నీ చల్లంగా చల్లారిపోయి వుంటాయి... అంటూ ఒక్కొక్క పాత్రపైన మూత తీసి చూసింది. పులిహోర, చక్కర పొంగలి, దద్దోజనం, పాయసం ఇవికాక సాధకాలు, భక్ష్యాలు అన్నీ స్వహస్తాలతో ప్రేమ రంగరించి మరీ చేసింది ఆ తల్లి.

"అలిసిపోయి వస్తాడు... ఇక రుచిపచి కూడా తెలియదైపోయే... ఇంకా అందులో రంగరించిన ప్రేమని ఎక్కడ గుర్తిస్తాడు?" అనుకుంది పద్మావతి. వంటకాల సువాసనలు ఆఘ్రాణించిన తరువాత అమ్మ కడుపులో ఆకలి రెండింతలైంది. "మధుసూదనా... త్వరగా రావయ్యా స్వామీ..." అంటూ చనువుగా అంది అక్కడే కూర్చుంటూ. "అంజనాద్రి వరకైనా వచ్చాడో లేక ఇంకా మాడవీధులైనా దాటలేదో..." అనుకుంటూ, ఆలోచిస్తూ క్రమంగా నిద్రలోకి జారుకుంది ఆ అన్నులమిన్న.

❖ ❖ ❖

స్వామి పరుగులమీద వున్నాడు. అప్పుడెప్పుడో గజేంద్రుడు పిలిచినప్పుడు ఇలా పరిగెత్తాడు. ఈ మధ్య దాదాపు ప్రతిరోజు ఇదే జరుగుతోంది. అప్పుడన్నా నయం, వచ్చిన దారి సులువైన గగనమార్గం.. వద్దన్నా వెంట పరుగెత్తిన పరివారం. మరి ఇప్పుడో... కఠినమైన గుట్టలు, రాళ్ళు నిండిన కొండ దారి. ఇక పరివారమా? అంతా గుళ్ళోనే జోగుతున్నారు. పైగా స్వామి వెళ్ళేది దేవేరి దగ్గరకేనని వాళ్ళకీ తెలుసు. అందుకే వెంట వస్తామని కూడా అనరు.

"పోనీ నేను రానా స్వామీ?" అంది కౌమోదకి అనే గద నిద్రకళ్ళతోనే.

"నువ్వొస్తే నాకు మోత బరువు తప్ప ఉపయోగం ఏముంది? ఆ గరుత్మంతుడు వస్తే ఉపయోగం కానీ" అన్నాడు ఒక మూల నిద్రపోతున్న గరుత్మంతుణ్ణి చూసి.

"పాపం అలసిపోయాడు స్వామీ" అంది కౌమోదకి.

తప్పేముంది. దేవేరికి ఇచ్చిన మాట... ఆ మాట జవదాటి అలమేలుకి అలక వస్తే ఆ అలక తీర్చేందుకు ఎన్ని పారిజాతాలు కావాలో, ఏమేమి సేవలు చెయ్యాలో.

"సరే నేను బయలుదేరుతున్నా.. గుడి జాగ్రత్త.." అన్నాడు ద్వారపాలకులని చూస్తూ.

"అలాగే స్వామీ" అన్నారు జయవిజయులు ద్వారబంధం పక్కనే కూలబడుతూ.

స్వామి వడివడిగా నడవసాగాడు.

❖ ❖ ❖

పద్మావతీవల్లభుడు తిరుచానూరులో గుడికి చేసేసరికి అంతా చీకట్లు కమ్ముకున్నాయి. దేదీప్యమానమైన వెలుగులతో, అంతకు రెండింతలు వెలిగే చంద్రబింబంలాంటి ముఖంతో అలమేలుమంగ ఎదురొస్తుందని వూహించిన శ్రీనివాసుడు హతాశుడయ్యాడు.

"ఈ చీకట్లకు కారణం దేవేరి అలక కాదుకదా?" అంటూ సందేహించాడు. అడుగులు వడివడిగా వేస్తూ, గుడి గడపలు దూకుతూ లోపలికి అడుగుపెట్టాడు. వేంకటేశ్వర పట్టపురాణి కఠినమైన రాతిపై వళ్ళు తెలియక నిద్రపోయింది. ఆయన రాకతో పాటే లోపలికి ప్రవేశించిన సుగంధ వీచికలను ఆఘ్రాణించి చటుక్కున లేచి కూర్చున్నది అలమేలుమంగమ్మ.

"వచ్చారా స్వామీ... ఏమిటింత ఆలస్యం? చూడండి మీ కోసం వండినవన్నీ చల్లారిపోయాయి" అంది ఆమె నిద్రతో చెదిరిన సింధూరాన్ని సర్దుకుంటూ.

"వాటి సంగతి సరే... ముందు కాస్త స్థిమితపడనీ.." అంటూ అక్కడే వున్న ఒక రాతి స్థంభాన్ని ఆనుకొని కూర్చున్నాడు దేవదేవుడు.

"అయ్యో... అక్కడ కూర్చున్నారేమండీ... అవునులే పగలంతా నిలబడే వుంటారయ్యే... కాళ్ళు నొప్పులు పుట్టాయెమో..." అంటూ పాంకోళ్ళను తొలగించింది.

"పైగా నీ కోసం పరుగులుపెట్టి వచ్చాను కదా..." అన్నాడు ఆయన. ఆమె తన కోమల హస్తాలతో సుతారంగా ఆయన పాదాలను నొక్కజూసింది.

శ్రీనివాసుడు ఆమెను వారించి–"వద్దు దేవీ, కొత్త పట్టుబట్టలు కట్టారు, అవి కొంచెం గరుకుగా వున్నాయి, నీ చేతులు కందేనేమో.." అన్నాడు.

జలజాక్షి మనోహరంగా నవ్వి – "ఇదంతా ప్రేమే.." అంది సిగ్గుపడుతూ. శ్రీనివాసుడూ నవ్వాడు. ఆలయమంతా వెలుగు పరుచుకుంది.

ఇంతలో గుమ్మం దగ్గర అలికిడి.. ఎవరదీ.. అన్నాడు గోవిందుడు. – "నేను చూస్తానుండండి... ఇంత రాత్రివేళ ఎవరో..." అంటూ గబగబా గర్భాలయం వెలుపలికి వచ్చింది ఆమె. ఎవరో నలుగురు సాధువులు.

"ఏమిటయ్యా ఇంత రాత్రివేళ?" అంది కోపంగా

"నీకు తెలియనిదేముంది తల్లీ... పైన స్వామివారి దర్శనం దుర్లభమైపోతోంది.. క్షణకాల దర్శనం.. చూసినా చూడనట్టే వుంటోంది... ఒక్కసారి తనివితీరా చూద్దామని సాయంత్రం నుంచీ ఇక్కడే వేచి వున్నాము.." అన్నాడొక సాధువు భక్తితో.

"ఓరి అసాధ్యులారా... ఇక్కడికీ దాపురించారా? మాకిద్దరికీ ఏకాంతమనేది ఒకటి వుండనిస్తారా లేదా?" అంది నిష్ఠూరంగా.

"తప్పే అమ్మా... కానీ ఏం చెయ్యగలం? స్వామివారితో నిముషం గడపాలంటేనే ఎంతో డబ్బు కావాలి... సాధువులం... సామాన్యులం.. మా దగ్గర అంతంత డబ్బు ఎక్కడ వుంటుంది.." అంటూ ప్రాధేయపడుతూ నమస్కరించారు.

"మరి... ఆయనేమన్నా సామాన్యుడా.. కాసులులేనిది వడ్డీకాసులవాడు ఎలా అనిపిస్తాడు..." అంటూ వాళ్ళని పంపించే ప్రయత్నంలో వుండగా, వారి ముఖంలో కనిపించిన భక్తితాదాత్మ్యత చూసి ఆగిపోయింది. వెనకకు తిరిగి చూస్తే వెనకే వెంకటేశ్వరుడు.

"దేవదేవా... ఆపద్భాందవా... మీ దర్శనం కోరిన ఈ అల్పులకు సతీసమేతంగా దర్శనమిచ్చావా స్వామీ... గోవిందా.. గోవిందా..." అంటూ నమస్కరించారు. స్వామి చిరునవ్వు నవ్వి, అభయహస్తం చూపించారు.

"సరే.. చూశారుగా.. ఇక అష్టోత్తరశతనామాలు చదవక కదలండి... లేదంటే తెల్లారిపోగలదు.." అంటూ స్వామి హస్తాన్ని అందుకొని లోపలికి నడిచింది పద్మావతి.

"ఏమిటి స్వామీ మీరు... నేను పంపిస్తున్నా... అసలు మీరు ఇంట్లో లేరని చెప్పాలనుకుంటుంటే ఇంతలోనే మీరు వచ్చి నిలబడ్డారు...

"పోనీలే దేవీ, పాపం సాధువులు.."

"బాగానే వుంది... నేను కాబట్టి సరిపోయింది... ఒకప్పుడు మీరిలాగే సాధువని, ఋషి అనీ ఒకాయన కాళ్ళుపడితే లక్ష్మీదేవి ఏం చేసిందో గుర్తులేదా?" అంది అటువైపు తిరుగుతూ.

"అది తెలుసు కనుకే ఇంత ధైర్యం.." అన్నాడు స్వామి. ఆ మాటకు ఆమె సంతోషపడి, ఆయన వైపు తిరుగుతూ–

"అయ్యో స్వామీ... మాటల్లో పడి మీ భోజనం సంగతే మర్చిపోయాను.. రండి తిందురుగానీ.." అంది.

"నీకు చెప్పనేలేదు కదూ పద్మా... నా భోజనం తిరుమలలోనే అయ్యింది... ఇంత రాత్రివేళ తింటే కష్టమనీ అక్కడే కానిచ్చాను.." అంటూ పొట్ట నిమురుకున్నాడు గోవిందుడు.

"అంతేలెండి... ఇక్కడ ఇంతింత నెయ్యిపోసి మీకిష్టమని చక్కరపొంగలి, పాయసాలు చేస్తే ఇవి మీకెందుకు నచ్చుతాయి... ఆపైన మిషన్లు చేసిన లడ్లు తిని వస్తారు.." అంది ఆమె కోపంగా. తిరుమలేశునికి తిరిగి సమాధానం చెప్పడానికి ఏ సాకు దొరకలేదు. ఇంతలోనే అలమేలుమంగ దగ్గరగా వచ్చి–

"ఇదంతా ఎందుకు స్వామీ.... మీరు సంపాదనలో పడ్డ తరువాత.. క్షణం తీరిక దొరుకుతోందా... మనం ఏకాంతంగా అలా వాహ్యాళికి వెళ్ళి ఎన్ని రోజులైంది? కనీసం కడుపారా సమయానికి భోజనం చేసి ఎన్ని రోజులైంది? చెప్పండి" అంది కించిత్ బాధపడుతూ.

"నువ్వు చెప్పిన మాటా నిజమే మంగా... నాడు వకుళమ్మ ఇంటిలో పేదవాడిగా వున్నప్పుడు పొందిన సుఖం, సంతోషం, ఆనందం మళ్ళీ పొందలేదు" అన్నాడాయన సాలోచనగా.

"మనం మళ్ళీ ఆ రోజులకి వెళ్ళిపోదామండీ.." అంది ఆమె ఆశగా.

"ఆ రోజు మీ నాన్న ఆకాశరాజు డబ్బులేని నన్ను కాదంటాడనే కదా ఈ జంజాటంలో పడ్డాను... ఇప్పుడు మనం వద్దనుకున్నా వదులుకోలేను.. వదులుకున్న మరుక్షణం కుబేరుడు తగులుకుంటాడు.."

"హూ.. ఇంకా తీరలేదా ఆ అప్పు..." అంది ఆమె కోపంగా.

''నేనేమైనా సొంతానికి వాడుకున్నానా.. మన పెళ్ళికి చేసినదే కదా...'' నచ్చచెప్పబోయాడు వడ్డీకాసులవాడు.

"ఎన్ని యుగాలనాటి పెళ్ళి.. ఎన్ని లక్షలకోట్లమంది నిలువుదోపిడీలు... ఇంకా తీరలేదే... ఈ సుడిగుండం నుంచి బయటపడి మనం సుఖంగా వుండే రోజే లేదా.. కలియుగ దైవమై కూడా ఈ సమస్యకు పరిష్కారం కనిపెట్టలేరా స్వామీ..." అంది ఆమె.

"నువ్వే చెప్పావుగా కలియుగదైవాన్నని. ఈ కలియుగ ధర్మం పాటించక తప్పుతుందా... ఈ యుగంలో వుండేదంతా మానవులు... మానవుడే సర్వశక్తిమంతుడు... అందువల్ల ఈ సమస్యకి పరిష్కారం కనిపెట్టే బాధ్యతని కూడా మానవులకే వదిలేశాను... ఆ కారణంగానే వారందరినీ ఇలాంటి చట్రంలోనే ఇరికించాను... రోజల్లా చాకిరీ చెయ్యాల్సిన కార్పొరేట్ వుద్యోగాలు ఇచ్చాను, ఎంత కట్టినా తీరని హోం లోన్, పర్సనల్ లోన్, క్రెడిట్ కార్డు ఇచ్చాను.. ఎక్కడైనా ఏ ఒక్కరైనా ఈ అప్పుల సుడిగుండాలని దాటి బయటపడతాడేమోనని ఆశగా చూస్తున్నాను... అందరూ చేసిన అప్పుల కిస్తు కట్టడానికి చాకిరీలు చేస్తున్నారే తప్ప దాన్ని దాటి ఒక్కడైనా రావటం లేదు... అంతా మనలాగే ఇబ్బంది పడుతున్నారే తప్ప పరిష్కారం కనుక్కోలేకపోయారు..." అని ఆయన చెప్తుండగా కొండపై నుంచి మేలుకొలుపుగా పాడే సుప్రభాతం వినపడింది.

ఇక తప్పదన్నట్లు శ్రీనివాసుడు అలిపిరి వైపు అడుగులేశాడు. అలమేలుమంగ నిరాశగా చూసింది.

(ఆదివారం ఆంధ్రజ్యోతి, 11 డిసెంబర్ 2011)

మంచినీళ్ల బావి

ఎన్నో ఏళ్ళ క్రిందటి మాట. మా వూరి మధ్యలో శివాలయాన్ని ఆనుకొని ఒక పెద్ద మంచినీళ్ళ బావి ఉండేది. ఎప్పుడో రాజుల హయాంలో కట్టించిన ఆ బావి దాదాపు వూరు మొత్తానికి నీళ్ళు అందించేది. నాలుగు వైపులా నాలుగు గిలకలు రోజంతా కిలకిలమంటూ కళకళలాడుతుండేది. తెల్లవారుఝామున ఏ నాలుగింటికో శివాలయం పూజారి దక్షిణామూర్తిగారు బావిని నిద్రలేపి చన్నీళ్ళ స్నానం చేసి, తడిగుడ్డతో నాలుగు బిందెలు మడి నీళ్ళు పట్టుకొని రుద్ర నమకం చదువుకుంటూ గుళ్ళోకి నీళ్ళు మోసుకెళ్ళేవారు. అప్పటికే అక్కడికి చేరుకున్న బ్రాహ్మణవీధి ఆడవాళ్ళంతా దక్షిణామూర్తిగారి స్నానం అయ్యేదాక ఆగి, ఆ తరువాత ఏ వచనరామాయణమో పాడుకుంటూ బావికి పసుపు అద్ది, బొట్లు పెట్టి, గిలకల మీద చేదలేసేవారు. ఇక అక్కడినించి ఆ బావి చలివేంద్రంలా రోజంతా జలదానం చేస్తూనే వుండేది.

కొంచెం తెలవారుతుండగా ఆడవాళ్ళ వరస మొదలయ్యేది. కులం ప్రాతిపదికన వేళల్లో మార్పులుండేవిగాని ఫలానా కులం వాళ్ళు నీళ్ళు పట్టుకోకూడదని ఎవ్వరూ అనేవారు కాదు. అప్పుడే నిఖా అయ్యి మా వూరు వచ్చిన నూర్‌జహాన్, బిందెతో అక్కడికి వచ్చి నీళ్ళు తోడుకోడానికి వెనకా ముందు ఆడుతుంటే సెట్టెమ్మగారు చూసి–

"ఏమ్మా కొత్త కోడలా.. అట్టా ఒక అడుగు ముందుకి రెండడుగులు వెనక్కి వేస్తే ఇంక ఇంటికి నీళ్ళు చేర్చినట్టే..రా, నేను తోడి పెడతాను.." అంటూ వద్దన్నా వినకుండా బిందె నిండా తను తోడుకున్న నీళ్ళు పోసి పంపేది. "కొత్త కోడలు కదా నీళ్ళబావి దగ్గర ఎక్కువసేపు వుంటే ఆ అత్తగారు ఏం సాధిస్తుందో.. పోనీలే పాపం ఒక్క బిందె నీళ్ళిస్తే మాత్రం ఏం పోతుంది" అనేది మిగతా ఆడవాళ్ళతో. బావిలో నీళ్ళు నవ్వుతూ

సుడులు తిరిగేవి. తెల్లగా తెల్లారాక చివరగా నీళ్ళు తోడుకున్నవాళ్ళు ఎవరైనా సరే ఒక చేద నీళ్ళు తోడి గట్టుమీద పెట్టి వెళ్ళేవాళ్ళు.

ఆ పక్కనే పోతున్న వాళ్ళెవరైనా దాహం వేస్తే, అక్కడికి వెళ్ళి నాలుగు దోసిళ్ళు ముఖాన కొట్టుకోని, చేద ఎత్తి గటగటా నీళ్ళు తాగేవాళ్ళు. మళ్ళీ మర్చిపోకుండా నీళ్ళు తోడి, గట్టు మీద పెట్టి వెళ్ళేవాళ్ళు. ఎవరైనా మర్చిపోయినా అక్కడే పెద్ద బాడిసె పెట్టుకొని కూర్చున్న సాంబయ్యో, గట్టు పక్కన బండపైన పులి జూదం ఆడుతున్న బసవయ్యో ఒక చురకేసేవాళ్ళు–

"ఏరా.. ఇంకొకళ్ళు తోడిన నీళ్ళు తాగినోడివి.. నీ తరవాత వచ్చే వాళ్ళకి ఒక చేద తోడి పెట్లేవంట్రా.. ఒక్క చేదకేమైనా నీ ఒళ్ళు అరిగిపోతుందా" అనేవాళ్ళు.

చాలాకాలం ఇలాగే ఒకళ్ళకొకళ్ళు సాయం చేసుకుంటూ వుండే వూరిజనం మధ్య, నెమ్మదిగా గొడవలు మొదలయ్యాయి. అప్పటిదాకా అక్కచెల్లెళ్ళలా కలిసి నీళ్ళు తోడుకునే ఆడవాళ్ళు ఆడపడుచుల్లా గిల్లి కజ్జాలు పెట్టుకోసాగారు. తెల్లవారుఝామునే వచ్చే ఆడవాళ్ళు ఎప్పుడన్నా ఆలస్యంగా వచ్చి మణ్ణీళ్ళు తోడుకోవాలంటే మిగిలిన వాళ్ళు అడ్డు తప్పుకునేవాళ్ళు కారు.

"నీ వేళలో నువ్వు రాకుండా మమ్మల్ని తప్పుకోమంటావేంది?" అనేవారు.

నువ్వెంత అంటే నువ్వెంత అని అనుకున్నారు.మాట మాటా పెరిగినాయి.

"ఇది శివాలయం బావి.. బ్రాహ్మల బజారులో వుంది.. మిగిలిన వాళ్ళు ఎవరూ ఇక్కడ నీళ్ళు తీసుకోను వీల్లే"దని తీర్మానం చేశారు.

"బావులు, నీళ్ళు ఒకళ్ళ సొత్తవడానికి వీల్లేద"ని మిగిలిన జనం తిరగబడ్డారు. ఆ తరువాత కొంత గొడవ జరిగి ఇట్లా తేలేది కాదని వూరికి మరో పక్క పోలేరమ్మ చెట్టు దగ్గర ఇంకో బావి తొవ్వించారు. మిగిలిన కులస్తులంతా అక్కడికి వెళ్ళి నీళ్ళు తోడుకోవడం మొదలెట్టారు. ఆ తరువాత చిత్రంగా శివాలయం బావి నీళ్ళ రుచి మారటం మొదలైంది. చెరకురసంలా తియ్యగా వుండే నీళ్ళు చప్పంగా మారిపోయాయి.. కొంచెం కొంచెంగా ఉప్పెక్కడం మొదలైంది. అయినా అక్కడి పెద్ద కులాల ఆడవాళ్ళంతా అవే నీళ్ళతో కాలం గడుపుతున్నారు. అక్కడి నీళ్ళు తాగడానికి చాలా మంది వెనకాడటంతో నీళ్ళు తోడిపెట్టే పని తప్పింది జనానికి. పెద్ద బాడిసెతో పెద్ద పని

జరగట్లేదని సాంబయ్య అక్కడే ఒక సోడా కొట్టు పెట్టుకున్నాడు. ఆ బావి మాత్రం పెద్ద బొట్టు పెట్టుకున్న ముత్తైదువులా చేతనైనంతవరకు జలదానం చేసేది.

ఇక్కడ పోలేరమ్మ చెట్టు దగ్గర కొత్తగా కట్టిన వొరల బావేమో అప్పుడే చీరకట్టడం నేర్చిన కుర్ర పిల్లలా వుండేది. అక్కడ నీళ్ళు చెరకురసంలా కాకపోయినా చక్కెరనీళ్ళలాగా బాగుండేవి. బావి గట్టున చెట్టు మీద కొన్ని పావురాళ్ళు కాపురం వుండేవి. ఆడంగులు నీళ్ళు తోడుకొని వెళ్ళిపోయాక అవి చిన్నగా దిగి వచ్చి, గట్టు మీద బిందెలు పెట్టి పెట్టి పడ్డ గుంటల్లో నీళ్ళు నిలిస్తే ఆ నీళ్ళు తాగుతూ కువ కువ కబుర్లు చెప్పుకునేవి. కొంతకాలం అట్లా గడిచింది.

ఒకరోజు పోలేరమ్మ బావి దగ్గరా ముసలం పుట్టింది. "నేను ముందు నీళ్ళు తోడుకుంటుంటే కోపంతో నీళ్ళల్లో చెన్నమ్మ వుమ్మేసింది" అని నూకాలు అన్నది.

"ముందొచ్చింది నేను.. నువ్వెట్టా తోడుకుంటావే.. నీళ్ళు.." అని చెన్నమ్మ అరిచింది.

నూకాలుకి మా చెడ్డ కోపం వచ్చింది. చెన్నమ్మ జుట్టు పట్టుకొని వంచి బిందెతో బాదింది. ఇద్దరూ కిందపడి దొర్లారు.. బూతులు తిట్టుకున్నారు, దుమ్మెత్తి పోసుకున్నారు. విషయం తెలుసుకుని ఆ ఇద్దరి మొగుళ్ళు కర్రలతో కొట్టుకున్నారు. ఇద్దరి రక్తం బావి గట్టు మీది గుంటల్లో పడింది. అది చూసిన పావురాళ్ళు ఆ వూరు వదిలి వలసెళ్ళిపోయాయి. చాలా మంది ఆ రోజు నీళ్ళు తోడుకోకుండానే ఇంటికెళ్ళిపోయారు. వలసెళ్ళిన పావురాళ్ళు తిరిగిరాలేదు.

కొన్ని రోజులకి ఏదో మంత్రం వేసినట్టు పోలేరమ్మ చెట్టు ఎండిపోయింది. ఆ చెట్టు ఎండిపోయిన నాలుగు రోజులకే ఆ బావిలో పురుగు పడింది. గుర్రపు డెక్క ఆకువేస్తే నీళ్ళు బాగుపడతాయని ఎవరో అంటే అందులో ఆ ఆకు వేశారు. అది పెరిగి పెరిగి బాగా పాకింది. బావి ఒరల గోడలకి నాచు పట్టింది. ఆ నీళ్ళు కూడా తాగడానికి పనికిరాకుండా పోయాయి. దాంతో వూరంతటికీ మంచినీళ్ళ బావి లేకుండాపోయింది. వూర్లో ఆడవాళ్ళంతా బిందెలు చంకన పెట్టుకొని నాలుగు మైళ్ళు నడిచివెళ్ళి వాగులో నీళ్ళు నింపుకొచ్చేవాళ్ళు. సోడా కొట్టు సాంబయ్య తమ్ముడు రాములు కావిడి కట్టి వూర్లోకి నీళ్ళు మోసుకొచ్చేవాడు. బిందెకు రూపాయి చొప్పున తీసుకునేవాడు. సాంబయ్య వ్యాపారం కూడా వూపందుకుంది. అప్పుడే బస్సు దిగిన పొరుగూ రోళ్ళు, శివాలయం చూడటానికి వచ్చే భక్తులు బావిలో వుప్పు నీళ్ళు తాగలేక సాంబడి సోడాలతోనే సేదతీరేవారు. కొంతకాలానికి సాంబయ్య సోడా మిషను కూడా పెట్టాడు.

కొన్నేళ్ళు ఇలాగే గడిచాయి. వూర్లో డబ్బున్నవాళ్ళు మంచినీటి ఎద్దడి తట్టుకోవాలని శతవిధాల ప్రయత్నించారు. బావులు తవ్వినా బండలు అడ్డంపడుతున్నాయే కానీ నీళ్ళు పడటంలేదు. పట్నం నించి బోరు లారీలని పిలిపించి ఇళ్ళలో బోర్లు వేయించాలని కూడా చూశారు. ఎక్కడ వేసినా ఉప్పు నీళ్ళేకాని మంచి నీళ్ళు తగలట్లేదు. శివాలయంలో శివుడికి వుప్పునీళ్ళ అభిషేకమే చేసేవారు దక్షిణామూర్తిగారు.

"శివుడి ఆజ్ఞ లేదు... ఆ గంగమ్మను వదలటంలేదు.. ఏ భగీరథుడో మళ్ళీ రావాలి.." అనుకునేవాడు ఆయన.

❖ ❖ ❖

గోపాలయ్య అనీ, శివాలయం పక్క వీధిలోనే వుండేవాడు. వూరిలో వచ్చిన మంచినీటి కరువు చూసి చాలా బాధపడ్డాడు. శివాలయంలో శివుడికి దణ్ణం పెట్టి–

"పరమేశ్వరా ఏదైనా మార్గం చూపించు స్వామీ.." అంటూ మొక్కాడు.

ఇంటికి తిరిగి వస్తూ దారిలో నీళ్ళ బిందెలు మోస్తున్న ఆడవాళ్ళని చూసి వుస్సురని నిట్టూర్చాడు. ఆయన ఇంట్లోకి రాగానే జానకమ్మగారు ఎదురొచ్చి చేతిలో సంచీ, భుజం మీద కండువా అందుకుంది. తీరిగ్గా కూర్చోపెట్టి మంచినీళ్ళు ఇచ్చాక చెప్పుకొచ్చింది–

"మన ఇంటికి ఎలాగూ ప్రహరీ కట్టించాలని అనుకుంటున్నాము కదా.. ఆ ఆగ్నేయం మూల, స్థలం ఎట్లాగూ వదిలిపెట్టాలి.. ప్రహరీ అవతల పోనీ ఒక బావి తొవ్వించే ప్రయత్నం చెయ్యకూడదూ...నీళ్ళు పడితే వూరికి మంచి చేసిన వాళ్ళమౌతాము.. పది మందికి మంచి నీళ్ళు ఇచ్చిన పుణ్యం ఎన్ని దేవుళ్ళకు మొక్కితే వస్తుంది చెప్పండి.." అంది.

జానకమ్మగారి ఆలోచన వినగానే సంతోషంతో ఆయన ముఖం వెలిగిపోయింది. చటుక్కున లేచి.. ఆమె చేతిని గట్టిగా పట్టుకొని, చిన్నగా నొక్కి, ఒక చిరునవ్వు నవ్వాడు. ఆమె కండువా చేతికిచ్చింది. అంత ఎండనూ లెక్కచెయ్యకుండా గోపాలయ్య కరణంగారింటికి బయలుదేరాడు. ప్రహరీ సంగతి పక్కన పెట్టి, ముందు బావి తొవ్వించాలని సంకల్పించాడు గోపాలయ్య. మంచి నీళ్ళు ఎక్కడపడతాయో మంత్రం వేసి చెప్పగలిగిన కేశవాచార్యులు పెదవి విరిచి –

"లాభం లేదయ్యా.. వుత్త బండ తప్ప అసలు నీళ్ళు పడే మార్గమే లేదు" అంటూ తేల్చేశాడు. దాంతో పంచాయితీ పెద్దలు డబ్బు సాయం చెయ్యమన్నారు. గోపాలయ్య నీరసపడి ఇంటికొచ్చాడు. ఆ రాత్రి జరిగింది విని జానకమ్మ ఎంతో నొచ్చుకుంది. "బండే పడుతుందో.. గంగే పడుతుందో.. ప్రయత్నిస్తే తప్పేముంది..? వాళ్ళేమనుకుంటే మనకెందుకు, మన స్థలం అది. మనం అనుకున్నట్టే చేద్దాం" అని ప్రహరీ ఖర్చుకి తీసిపెట్టిన డబ్బులు గోపాలం చేతిలో పోసింది.

మర్నాడే పని ప్రారంభమైంది. జానకమ్మ, గోపాలయ్య అందరు దేవుళ్ళకి మొక్కుకొని నలుగురు కూలీలతో తొవ్వడం మొదలు పెట్టారు. వూర్లో జనమంతా గోపాలయ్యని పిచ్చివాడన్నారు.

"మన కేశవాచారి నీళ్ళు పడవంటుంటే.. ఎందుకురా నీకీ పిచ్చి ఆరాటం.." అని ఎద్దేవా చేశారు. వాళ్ళిద్దరు మాత్రం ఏ మాత్రం వెరవలేదు. ఒక కూలి ఖర్చు మిగిలినా మిగిలినట్టే అని గోపాలయ్య కూడా ఒక పలుగు పట్టాడు. జానకమ్మ కూలివాళ్ళందరికి అన్నం వండి వార్చేది. చల్లటి మజ్జిగ ఇచ్చేది.. ధనియాల కాఫీ పెట్టేది. ఖాళీ వుంటే మట్టి తట్టలు అందుకునేది. పది రోజులు తొవ్వారు. ఎక్కడా నీటి జాడ కనపడలేదు. ఆ రోజు రాత్రి గోపాలయ్య చాలా మథనపడ్డాడు.

"పరమేశ్వరా.. ఇంక నా చేతిలో చిల్లిగవ్వలేదు.. ఊరికి మంచి చేద్దామని ప్రయత్నం చేస్తున్నాను. ఇక నీదే భారం" అనుకున్నాడు. జానకమ్మ నవ్వుతూ తన నగలు తెచ్చి ఇచ్చింది.

మరి జానకమ్మ మంచితనం చూసి కరిగాడో, గోపాలయ్య మొరనే విన్నాడో, ఆ పరమేశ్వరుడు గంగను వదిలిపెట్టాడు. తెల్లవారేసరికి బావిలో నీళ్ళు..!! నీళ్ళంటే నీళ్ళుకాదు.. లేత కొబ్బరిపాలు వున్నట్టున్నాయి..!! వూరంతా వరదలా పరుగెత్తుకొచ్చారు. ఆ నీళ్ళు తాగారు.. ఒకరి మీద ఒకరు చల్లుకున్నారు.. ఆ వూరికి జలదానం చేసిన గోపాలయ్యకు, జానకమ్మకు దణ్ణాలు పెట్టారు. అప్పటి నుంచి అది జానకమ్మగారి బావి అయ్యింది.

వూరి జనమంతా మళ్ళీ ఒకే బావిలో నీళ్ళు తోడుకోవడం మొదలు పెట్టారు.కావడి రాములు ఈ బావి నీళ్ళే తీసుకొని వూరిలో పెద్దవాళ్ళకి పోసేవాడు. రూపాయికి రూపాయి ఎక్కువడిగినా కాదనేవాళ్ళు కాదు. గోపాలయ్య ఇంట్లోకి వస్తూ పోతూ గిలక చప్పుడు విని వేదమంత్రం విన్నట్లు తలవూపేవాడు. జానకమ్మ బావి పక్కనే

తులసి చెట్టు నాటింది.. ఆ పక్కనే ఒక వేపచెట్టు, రావి చెట్టు కలిసి పుట్టుకొచ్చాయి. ఆ చెట్లకు నీళ్ళు తోడి పోసి బిడ్డల్లా పెంచుకుంది.

కాలం తిరిగింది. జానకమ్మ పురుడు పోసుకోడానికి పుట్టింటికి వెళ్ళింది. వెళ్తూ వెళ్తూ వూరందరికీ తులసి కోటలో చెంబెడు నీళ్ళు పొయ్యమని చెప్పింది. పండంటి మగబిడ్డని కన్న తరువాత, చూడవచ్చిన గోపాలయ్యతో "బారసాల మనింట్లోనే జరగా" లని పట్టుబట్టింది. అన్నట్టుగానే ఇరవై రోజుల పిల్లాడిని తీసుకొని ఎడ్లబండి కట్టించుకొని తిరిగివచ్చింది. రామచంద్రుడని పేరు పెట్టుకున్నారు. సాయంత్రం వుయ్యాలలో వేసేముందు బావికి పూజ చేసింది. ప్రేమగా ఆ బావిని నిమిరింది. పసుపు గుండ్రంగా రాసి, కుంకుమ బొట్లు పెట్టింది. రావి, వేప చెట్ల చుట్టూ తిరిగింది. తులసి చెట్టు పాదులో నీళ్ళుపోసి " అమ్మా! నా పసుపు కుంకుమలు పదికాలాలపాటు నిలుపు తల్లీ" అంటూ మొక్కుకుంది.

ఆ మర్నాడు గోపాలయ్య చెట్లపాదులు సవరిస్తూ పైకి చూస్తే రావి చెట్టు మీద రెండు పావురాలు కనిపించాయి. ఆయన జానకమ్మను కేకేస్తే ఆమె బయటకు వచ్చి వాటిని చూసి, బావి దగ్గరకు వెళ్ళి ఒక చేదెడు నీళ్ళు తోడి అక్కడ పెట్టింది. ఇద్దరూ ఇంట్లోకి వెళ్ళినట్లే వెళ్ళి తలుపుచాటు నించి తొంగి చూసారు. రెండు పావురాళ్ళు బావి గట్టు చేరి ఆ నీళ్ళు తాగి కువ కువల కబుర్లు మొదలు పెట్టాయి. ఇద్దరూ ఒకళ్ళనొకళ్ళు చూసుకొని తృప్తిగా నవ్వుకున్నారు.

❖ ❖ ❖

రామచంద్రుడు పెరిగి పెద్దవాడౌతున్న కొద్దీ ఆ వూరు నీటి ఎద్దడి సంగతి మర్చిపోయింది. జానకమ్మగారి బావి మినహాయించి ఆ వూరిలో ఏ బావిలోనూ మంచి నీళ్ళు పడనేలేదు. ఒకవేళ పడ్డా ఆ రుచి మరిగిన వాళ్ళు తాగడానికి మాత్రం జానకమ్మగారి బావినుంచే నీళ్ళు తెచ్చుకునేవాళ్ళు. ఎండాకాలం వస్తే నాలుగు మైళ్ళ అవతలున్న వాగుతో సహా అన్ని చోట్లా నీళ్ళు ఎండిపోయేవి. శివాలయం బావికూడా అందుకు మినహాయింపు కాదు. దక్షిణామూర్తిగారు తూర్పు వాకిలి నుంచి నీళ్ళు తేవడం మానేసి వుత్తర గోపురం గుండా వెళ్ళి జానకమ్మగారి బావి నుంచే నీళ్ళు తెచ్చేవాడు. సోడా కొట్టు సాంబడు వయసు మీదపడ్డాక కొట్టు మూసేసి పట్నంలో తన కొడుకు దగ్గరకు వెళ్ళిపోయాడు. కావిడి రాములు ముసలివాడై నీళ్ళు మొయ్యలేక ఇంటి పట్టునే వుంటున్నాడు. కొన్నేళ్ళు అలా గడిచాయి. రామచంద్రుడికి పన్నెండేళ్ళ వయసులో జానకమ్మ గారికి జబ్బు చేసింది. గోపాలయ్య అహర్నిశలు దగ్గరుండి ఆమెకు సపర్యలు చేసాడు. అయినా

ఫలితం లేకపోయింది. మరో రెండేళ్ళకి ఆమె కన్ను మూసింది. ఉన్నా లేకపోయినా ఆమెను వూరంతా దేవతలానే చూసింది. ఆఖరి చూపులకి కులం మతం తేడాలేకుండా అందరూ వచ్చి కన్నీళ్ళు పెట్టుకున్నారు. బావి గట్టునే ఆమెకు స్నానం చేయించి, నిండు ముత్తైదువలా అలంకరించి సాగనంపారు. గోపాలయ్యకు మరో పదేళ్ళ వయసు మీదపడ్డట్టైంది. అయినా బాధను దిగమింగుకొని రామచంద్రుణ్ణి పెద్దవాడిని చేశాడు. రామచంద్రుడు అదే వూర్లో డైరీలో వుద్యోగంలో చేరి గోపాలయ్య కళ్ళెదుటే వున్నాడు.

ఒకరోజు పట్నంలో వ్యాపారం చేసుకుంటున్న సోడా సాంబయ్య కొడుకు కుమారస్వామి ఆ వూర్లో దిగబడ్డాడు. నేరుగా డైరీకి వెళ్ళి రామచంద్రుడితో మంతనాలు జరిపాడు. ఇద్దరి మధ్యా ఏం మాటలు జరిగాయో తెలియదుగాని మరో రెండు రోజులకి రామచంద్రుడు జానకమ్మ బావిలో మోటరు బిగించాడు.

"నాయనా రాముడూ.. ఎందుకురా ఈ మోటరు అదీ.. బావి ఎప్పుడో వూరికిచ్చేశాము.. వాళ్ళే చూసుకుంటారు" అన్నాడు గోపాలయ్య.

"ఈ బావి వూరిదికాదు.. ఆ స్థలం మనది, బావి మనది.. మీరు అనవసరంగా కల్పించుకోవద్దు.." అన్నాడు రాముడు దురుసుగా. అంతేకాని అసలు సంగతి చెప్పనేలేదు.

మర్నాడు తెల్లవారుఝామునే పట్నం నుంచి నాలుగు ట్యాంకరు లారీలు వచ్చాయి. వాటి హారను మోతలకి వూరంతా వులిక్కిపడి లేచింది. మోటరు గిర్రున తిరిగింది.. వచ్చిన నీళ్ళను ట్యాంకర్లకు పట్టుకున్నారు. ఆ మోటారు చప్పుడుకి రావిచెట్టుమీద వున్న పావురాలు చప్పుడు చేసుకుంటూ ఎగిరిపోయాయి. నీళ్ళు నింపుకున్న ట్యాంకర్లు చల్లగా వూరుదాటాయి.

గోపాలయ్య ఎంతో బాధపడ్డాడు. వూరంతా ఇంటి ముందు చేరి రాముడికి నచ్చ చెప్పాలని చూశారు. వాడు ససేమీరా అన్నాడు..

"ఏమిటండీ మీ అజమాయిషీ.. ఇది మా బావి.. మా ఇష్టం.. ఒక్కొక్క ట్యాంకరుకి ఆరొందలు ఇస్తారు.. ఎంత లేదన్నా నెలకి వేలల్లో లాభం.. వూరకొచ్చే డబ్బు.. నేనొదులుకోను" అన్నాడు.

"మోటర్లతో లాగితే నీళ్ళు తగ్గుతాయి.. వూర్లో వారందరికీ కరువొస్తుంది" అన్నాడొక పెద్దమనిషి.

"అసలు మా బావిలో మీరు నీళ్ళు తోడుకోవడం ఏమిటి.. పట్నంలో నీళ్ళతో ఇంత వ్యాపారం జరుగుతుంటే వూరందరికీ వూరికే నీళ్ళు ఇవ్వడానికి నేనేమైనా పిచ్చోడినా? అసలు మీరెవ్వరూ రేపటి నుంచి నీళ్ళు తోడుకోవడానికి లేదు. ఈ రోజే బావిపైన ఇనపగేటు వేయించి తాళం వేస్తాను.." అన్నాడు. అన్నంత పనీ చేశాడు వాడు.

గోపాలయ్య ఎంతో మథనపడ్డాడు.

"పది మందికి మంచినీళ్ళు ఇస్తే ఆ పుణ్యం ఎన్ని దేవుళ్ళకు మొక్కినా రాదురా.. ఆ బావి తొవ్వడానికి మీ అమ్మ తన నగ నట్రా కూడా ఇవ్వడానికి సిద్ధపడింది.." అంటూ బ్రతిమిలాడాడు.

''ఇప్పుడు మాత్రం ఏమైంది.. పట్నంలో ఎంతమందికి మన నీళ్ళు వుపయోగపడుతున్నాయి.. వాళ్ళు ఇవ్వగలరు కాబట్టి డబ్బులు తీసుకుంటున్నాము.. ఇందులో మాత్రం పుణ్యం రాదని ఎవరన్నారు.." అంటూ వితండవాదం చేశాడు రాముడు.

ఆ రోజునించి ట్యాంకర్లు వస్తూనే వున్నాయి. వూరి జనమంతా మళ్ళీ వాగు వైపు నడకసాగించారు. ఏ అమ్మలక్కలు ఒక చోట చేరినా "అట్టాంటి మంచి మనసున్న జానకమ్మకి ఇట్టాంటి కొడుకు పుట్టాడే" అని చెప్పుకున్నారు.

ఎక్కడ నలుగురు మొగవాళ్ళు చేరినా "నలుగురి మంచి ఆలోచించే గోపాలయ్య ఎక్కడ? ఈ రామచంద్రుడు ఎక్కడ?" అని తిట్టుకున్నారు.

గోపాలయ్య చెవిన ఇవన్నీ పడ్డాయి. బాధతో కుమిలిపోయాడు.. మంచాన పడ్డాడు.. నిద్రలోనూ, మెలకువలోనూ జానకమ్మను పలవరించాడు.

ఒకరాత్రి వోపిక చేసుకొని బావి దగ్గరకు వెళ్ళాడు. బావి చుట్టూ తిరిగాడు, రావి చెట్టును నిమిరాడు. తులసి చెట్టుకు నీళ్ళు పోద్దామంటే బావి దగ్గర చేదలేదు. చేద వేసేందుకు అవకాశం లేకుండా ఇనుప వూచలు అడ్డంపెట్టివున్నాయి. తన బలమంతా వుపయోగించి లాగాడు. కొద్దిగా కదిలింది. ఇంట్లో రాముడు దాచిపెట్టిన తాళంచెవి తెచ్చి తెరిచాడు. కష్టపడి చేద దించాడు. నీళ్ళు తోడాడు.. తులసి మొదట్లో నీళ్ళు పోసాడు.

నీళ్ళు బురద బురదగా వున్నాయి. రుచి చూసాడు... మునుపటి రుచి లేదు. ఇంతలో చేద గిలక మీదనించి జారింది. ఆయనా కూలబడ్డాడు. ఇరుసు విరిగి గిలక ఒక

పక్కకి వొరిగిపోయి చెరిగిన తిలకంలా వుండిపోయింది. గోపాలయ్య కూడా అలాగే వొరిగిపోయాడు.. మళ్ళీ లేవలేదు.

తెల్లవారాక ట్యాంకర్లు వచ్చాయి. నీళ్ళు పట్టాలని మోటరెయ్యడానికి లేచిన రాముడు గోపాలయ్యను చూశాడు. వూరంతా వార్త గుప్పుమంది. అందరూ వచ్చారు..

"ఆయన కూడా పోయాడు.. ఇక నీ ఇష్టం వచ్చినట్టు చేసుకో.." అంటూ నిష్ఠూరమాడారు. విరిగిన గిలకని, ఆయన చేతిలో వున్న చేదను చూస్తే అందరి మనసు చివుక్కుమంది.

చేదతీయబోతే అందులో మురికి నీళ్ళు కనపడ్డాయి. బావిలోకి తొంగి చూశారు–

"బావిలో నీళ్ళు లేవు.." ఎవరో అరిచారు..

"జానకమ్మగారి బావి ఇంకిపోయింది." వూరంతా చెప్పుకున్నారు.

"ఇన్ని సంవత్సరాలుగా చూస్తున్నాం.. ఎంతటి ఎండలొచ్చినా ఏ నాడైనా ఇంకిపోయిందా?" అన్నారెవరో శివాలయంలో.

"ఇంకిపోయింది నీళ్ళుకాదు.. పదిమందికి సాయంచేసే మంచితనం.." అంటూ శివాలయంలోకి వెళ్ళిపోయారు దక్షిణామూర్తిగారు.

(అంతర్జాల పత్రిక పొద్దు మే 26, 2009)

కలిసివచ్చిన ఇల్లు

అమ్మకి ఫోన్ చెయ్యగానే ఆమె అడిగిన మొదటి మాట – "ఏం తేల్చుకున్నారే?" అని. ఏమని చెప్పేది? ఇంకా ఏం తేలనిదే. గత నెల రోజులుగా దాదాపు ప్రతి రోజూ నాకూ ఆయనకీ మధ్య ఈ విషయమై చర్చ జరుగుతూనే వుంది. అయినా ఒక నిర్ణయానికి రాలేకపోయాము. మీకు చెప్తే నవ్వుతారేమో కాని విషయం మాత్రం చిన్నదే. ఇల్లు కొందామని నిర్ణయించుకున్న తరువాత, నేను రవి ఊరంతా తిరిగి, దాదాపు ఓ ఇరవై ఇళ్లు చూసాము. తరువాత ఆ జాబితాను రెండు ఇళ్ళకు కుదించి, ఈ రెండింటిలో ఒకటి మన ఇల్లే అనుకున్నాం. కానీ సమస్యంతా అక్కడే వచ్చింది. నాకు, రవికి చెరొక ఇల్లు నచ్చింది. నచ్చటం అంటే నిజానికి నాకు రెండు ఇళ్ళూ నచ్చాయి. కాకపోతే అందులో ఒకటి వాస్తు ప్రకారం సరిగా లేదు. అదే మాట రవితో అంటే నవ్వేశాడు. "చదువుకున్న దానివి.. ఇంకా వాస్తు జాతకాలు అంటే ఎలాగే.." అన్నాడు.

"అవును చదువుకున్న దాన్ని కాబట్టే ఆ వాస్తు పుస్తకాల్లో వ్రాసింది చదివి చెప్తున్నాను.. ఆ ఇంటి వాస్తు బాగోలేదు.. అందుకే వద్దు.. అంతే" తేల్చేశాను నేను.

"ఇల్లు కొనేటప్పుడు చూసుకోవాల్సింది ఆఫీసులకి ఎంత దూరం, పిల్లల స్కూల్‌కి ఎంత దూరం అని కానీ, ఆగ్నేయాలు వాయవ్యాలు కాదు.. పైగా నువ్వు చెప్పే ఇంటికి ఇంకో నాలుగు లక్షలు ఎక్కువ పెట్టాలి.. నా వల్ల కాదు.." అన్నాడు రవి మొండిగా.

"అక్కడికి ఏదో అన్ని లక్షలు నువ్వే తెస్తున్నట్టు చెప్పద్దు. ఏదైనా బ్యాంక్ లోనే కదా.." అన్నాను నేను జగమొండిగా.

“అది కాదు ప్రియంవదా.. నాలుగు లక్షలు తేవడం కష్టం కాదు, తీర్చడం కష్టంకాదు.. పైగా నీకు నచ్చిన ఇల్లు కాబట్టి నాకూ ఇష్టమే.. వాస్తు సరిగా లేదని ఒకే కారణంతో మంచి ఇల్లు వదులుకోవడం ఎందుకు అని.. ఆలోచించు..” బ్రతిమిలాడాడు.

“నాకు తెలుసు బాబూ.. ప్రియ అని కాకుండా ప్రియంవదా అని పూర్తి పేరు పిలిచినప్పుడే తెలుసు ఇలాంటి లాజిక్ ఏదో చెప్తావని.. సరే అయితే ఇప్పుడు వాస్తు గురించి నిన్ను నమ్మించాలి అంతేనా?”

“ఇదుగో.. నేనేమి వాస్తుని నమ్మడంలేదని చెప్పానా? వాస్తు కన్నా ముఖ్యమైనవి వేరే వున్నాయని అంటున్నాను..” రవి సర్ది చెప్పాలని ప్రయత్నం చేస్తున్నాడు.

“వుండచ్చు కానీ మూడేళ్ళ క్రితం మనం ఆ రావుగారి ఇంటిలో వున్నప్పుడు మీ వుద్యోగం పోయి.. ఎంత ఇబ్బంది పడ్డాం. గుర్తు లేదా?”

“ఆ వుద్యోగం పోయింది అమెరికాలో రిసెషన్ వల్ల.. ఇక్కడెక్కడో నేను వున్న ఇల్లు వాస్తు కారణంగానే అమెరికాలో రిసెషన్ వచ్చిందంటావా?” నవ్వుతూ అడిగాడు రవి.

“నవ్వండి నవ్వండి.. ఆ తరువాత అంత అద్దె కట్టలేక ఊరి చివరి చిన్న ఇంటికి వెళ్ళాం అదైనా గుర్తుందా?”

“గుర్తులేకేం ప్రియా.. అది కూడా వాస్తు బాగాలేదని సణిగావు.. కానీ ఏమైంది?”

“ఏమైంది గుర్తులేదా? మీరు బీపీవో మొదలుపెట్టి.. క్లైంట్స్ దొరక్క బిజినెస్ అవ్వక ఎంత కష్టపడాల్సి వచ్చింది..”

“అవునవును.. ఒకరి మీద, ఒక వుద్యోగం మీద ఆధారపడకుండా సొంతంగా బ్రతకడం నేర్చుకున్నాను.. కొత్త కంపెనీ అంటే ఆ మాత్రం కష్టం వుంటుంది.. కొంచెం ఆర్థికంగా ఇబ్బంది పడ్డా.. అంతా మంచే జరిగింది కదా...”

“మీరు బుద్ధభగవానుడు కాబట్టి కొంచెమే ఇబ్బంది పడ్డారు.. మొన్న మొన్నటి దాకా కనీసం నిద్ర కూడా పట్టలేదు నాకు.. తెలుసా..” అన్నాను కటువుగా. నాకు తెలియకుండానే కళ్ళలో నీళ్ళు తిరిగాయి. అది బ్రహ్మాస్త్రం. చాలాసేపటి వరకు రవి ఏం మాట్లాడలేదు.

“ఎందుకటే అంత పట్టుదల నీకు..?” అడిగాడు చివరిగా.

"ఎందుకంటే నేను ప్రత్యక్షంగా చూశాను కాబట్టి.. నాన్న వాళ్ళు ఉన్న ఇల్లు.. మీకు తెలుసుగా.. ఆ ఇంట్లో వున్నన్నాళ్ళు.. ఎలా కలిసొచ్చింది.. నాన్న ఏ వ్యాపారం చేసినా అందులో లక్షలు సంపాదించారు.. అమ్మకి లోటంటే ఏమిటో తెలిసేది కాదు.. మేము వున్నది నలుగురమైనా ఎప్పుడూ పదికి తక్కువ కాకుండా విస్తరాకులు లేచేవి.. బంధువులు, స్నేహితులు... ఆ వీధి పిల్లలంతా మా ఇంట్లోనే వుండేవాళ్ళు.. ఎంత సందడి.." మైమరచి చెప్తుంటే మధ్యలో ఆపేడు రవి.

"ఇదంతా ఆ ఇంటి వాస్తు వల్లే అంటావు.."

"కాకపోతే ఇంకేవిటి.. అన్నయ్య పెళ్ళి తరువాత ఇల్లు కొనుక్కోడానికి ఆ ఇల్లు అమ్మాడు కానీ, నాన్నైతే అసలు అమ్మేవాడే కాదు.. అమ్మిన తరువాత చూడు నాన్న, అమ్మ పరిస్థితి.. వ్యాపారం అంతా అన్నయ్య తీసేసుకున్నాడు.. నాన్నకి షుగరు, అమ్మకి దాంతోపాటు ఇంకో నాలుగు.. ఏ పని లేకుండా నాన్న ఇంటి చూరు పట్టుకోని వుండాల్సి వచ్చింది.."

"పిచ్చిదానా..ఏ పని లేకుండా ఇంట్లోనే వుండటం సుఖమౌతుంది కానీ.. కష్టమంటావే. పైగా ముసలితనంలో వచ్చే రోగాలు కూడా ఇంటి మహిమేనా?"

"ఇదుగో.. అనవసరమైన లాజిక్కులు చెప్పద్దు నాకు.. నా మాట వినదల్చుకోక పోతే మీకు నచ్చిన ఇంటినే కొనుక్కోండి.." అంటూ వంటింట్లోకి వెళ్ళిపోయాను.

దాదాపు రెండు గంటలు గడిచాయి. ఇద్దరం మాట్లాడుకోలేదు. రవి ఆఫీసుకు తయారయ్యి, నేను డైనింగ్ టేబుల్ మీద పెట్టిన వుప్మా మాట్లాడకుండా తినేసి, వెళ్తూ వెళ్తూ అన్నాడు–

"ఒక పని చేద్దాం ప్రియా.. సాయంత్రం త్వరగా వస్తాను..మనిద్దరం మీ నాన్న పాతింటికి వెళ్దాం... ఇప్పుడు ఆ ఇంట్లో వున్న వాళ్ళు కూడా మీ నాన్న లాగే సుఖంగా, సంతోషంగా వుంటే... నువ్వు చెప్పిన ఇల్లే కొందాం.. లేదంటే నేను చెప్పినట్లే వినాలి." అలా చెప్పి ఇలా ఆఫీసుకు వెళ్ళిపోయాడు, నా సమాధానం వినకుండానే.

❖ ❖ ❖

"మీరు సంతోషంగా వున్నారా అమ్మా" అడిగాను ఫోన్‌లో.

"ఏమిటే ఆ ప్రశ్న.. సంతోషంగా వున్నారా అంటూ..?? రోజూ మాతో మాట్లాడుతూనే వున్నావు కదా.. నీకు తెలియదా మేం సంతోషంగా వున్నామో లేదో.." ఎదురు ప్రశ్న వేసింది అమ్మ.

"అది కాదమ్మా.. ఇది వరకు మనం పాతింట్లో వున్నప్పుడు వున్నంత సంతోషంగా వున్నారా అని అడుగుతున్నా.."

"అదొక రకం.. ఇదొక రకం.. అప్పుడు సంసారం మాది.. బాధ్యతలు మావి.. దేవుడి దయవల్ల అన్నీ సమకూరాయి కాబట్టి బాధ్యతలు నెరవేర్చాం.. పది మందికి సాయం చేశాం.. ఒక సంసారానికి పెద్దలుగా అప్పుడు చేయాల్సినవన్నీ చేయగలిగినందుకు సంతోషం వుండేది.. ఇప్పుడు మేము పెద్దవాళ్ళమయ్యాము... ఇక బాధ్యతలు లేవు.. మేమే ఇంకొకరికి బాధ్యత అయ్యాము.. వాడు, కోడలు ఆ బాధ్యత సక్రమంగానే నెరవేరుస్తున్నారు కాబట్టి.. ఇప్పుడూ సంతోషంగానే వున్నాం.." చెప్పింది అమ్మా.

"అమ్మా.. నువ్వు ఏదైనా పత్రికలకి కథలు వ్రాయవే.. నేను అడిగింది అర్థం చేసుకోకుండా ఏదేదో చెప్తావు.."

"కథలేమిటే కథలు.. అసలు ఆ ప్రశ్న ఎందుకడిగావో చెప్పు.. సమాధానం నేను చెప్తాను.." అంది అమ్మ చిరుకోపంతో.

"ఆయనా నేనూ.. ఈ రోజు సాయంత్రం మన పాతింటికి వెళ్తున్నాం.." చెప్పాను.

"పాతింటికా.. ఎందుకు?" అడిగింది అమ్మ ఒకింత ఆశ్చర్యంతో. నేను జరిగిన విషయం మొత్తం చెప్పాను.

"అదా విషయం.. అయితే వెళ్ళిరండి" అంటూ ఇప్పుడు అక్కడ వుంటున్న వారి వివరాలు, అక్కడికి వెళ్తే కలవాల్సిన వ్యక్తులు గురించి చెప్పింది అమ్మ.

❖ ❖ ❖

పద్మనాభంగారని, నాన్న పాత ఇంటికి రెండు వీధుల అవతల వున్న రెండతస్థుల డాబాలో వుంటారు. వ్యాపారం మొదలు పెట్టక ముందు నాన్న, పద్మనాభంగారు ఒకే ఆఫీసులో పని చేసేవారు. ఇద్దరూ మంచి స్నేహితులు కావటం మూలానేమో ఒకే చోట ఇళ్ళు కొనుకున్నారు. ఇదంతా నాకు వూహ తెలియక ముందు సంగతి. నాకు తెలిసేటప్పటికే నాన్న సొంతగా ట్రాన్స్ పోర్ట్ కంపెనీ మొదలుపెట్టాడు. అయినా ఇద్దరి మధ్య స్నేహం కొనసాగుతూనే వుంది. నేను, అన్నయ్య, పద్మనాభంగారి పిల్లలు ఎప్పుడూ కలిసే ఆడుకునేవాళ్ళం. అమ్మ, పద్మనాభంగారి భార్య సావిత్రత్తయ్య ఎప్పుడూ అక్కచెల్లెళ్ళ మాదిరిగా కలిసి తిరిగేవారు. అందుకే నేను పాత ఇంటికి వెళ్తున్నాని చెప్పగానే అమ్మ ముందు సావిత్రత్తయ్య ఇంటికే వెళ్ళమని చెప్పింది.

వాళ్ళింటికి వెళ్తూనే అత్తయ్య ఎదురొచ్చి– "ఏమ్మా ఇన్నాళ్టికి తీరిందా? మీ పెళ్ళి తరువాత ఇదే చూడటం నిన్ను.." రండి అంటూ నాతో మాట్లాడుతూనే.." మొదటిసారి వచ్చారు నాయనా.. వుండండి ఏదైనా స్వీటు చేసుకొస్తాను.. "అంటూ రవిని పలకరిస్తూ ద్విపాత్రాభినయం చేసేసింది.

"ఏంటత్తయ్యా హడావిడి.. అవన్నీ తరవాత చూడచ్చు ముందు కాస్సేపు కూర్చో.." అంటూ బలవంతంగా కూర్చోపెట్టాల్సి వచ్చింది. కుశలప్రశ్నలు, ఉభయకుశలోపరులు అయ్యాక నెమ్మదిగా విషయం మొదలుపెట్టాను–

"మా ఇంట్లో ఇప్పుడు ఎవరుంటున్నారత్తయ్యా" అడిగాను.

"ఎందుకడుగుతావే అమ్మా.. మీరు ఆ గోవిందరాజులుగారికి అమ్మారా? ఆ తరువాత ఎవరో పరమేశ్వరరావుగారట ఆయన కొన్నాడు.. ఎప్పుడో పేరు వినటం, అప్పుడప్పుడు చూడటమే కానీ ఒక్కసారి కూడా ఈ వీధిలో వాళ్ళతో మాట్లాడగా చూడలేదే.." చెప్పిందామె.

"కొత్తగా వచ్చారు కదా..కొన్ని రోజులాగితే వాళ్ళే కలుస్తారేమో లెండి" అన్నాడు రవి సర్దుబాటుగా. నాకు మాత్రం ఎందుకో అది నిజం కాదని అనిపించింది. అదే మాట అత్తయ్య అంది.

"లేదు బాబూ.. వాళ్ళు వచ్చి కూడా ఆరు నెలలు దాటింది.. మొదట్లో ఒకసారి కొత్తగా వచ్చారు కదా అని పలకరించడానికి వెళ్ళాం... పొడి పొడిగా మాట్లాడి ఇంక వెళ్ళమన్నట్లు చూస్తే ఏం చేస్తాం చెప్పు.. ఆ తరువాత ఎప్పుడు చూసినా తలుపులేసుకోని వుంటారు.. అదో రకం మనుషుల్లే.." అంటూ లేచింది.."కూర్చోండి ఏదన్నా చేసుకొస్తాను.." అంటూ వంటింట్లోకి వెళ్ళింది. నేను రవి వైపు చూశాను.

"మీ సావిత్రి అత్తయ్య ఏదో భారీ ప్రోగ్రాం పెట్టినట్లుంది.. లోపలికి వెళ్ళి వద్దని చెప్పు" అన్నాడు.

"ఆవిడకి నేనన్నా అమ్మన్నా ఆపేక్ష.." అన్నాను నవ్వుతూ.

"ఆపేక్ష అనుభవించేది మనసుతో అయితే ఎంతైనా ఫర్లేదు.. అది పొట్టమీద దాడి చేస్తే కష్టం" అన్నాడు పొట్టమీద చేతితో రుద్దుకుంటూ. నేను నవ్వుకుంటూ లేచానో లేదో గాయత్రి, వనజ వదినా వాళ్ళ పిల్లలతో బిల బిల మంటూ వచ్చేశారు.

"ఏమ్మా ఇదేనా రావటం.. అమ్మా నాన్నని పిల్చుకు రాకపోయావా.. ఈయనేనా మీ ఆయన?ఏదన్నా విశేషమా? ఇంకా ఎప్పుడే.." ఎవరు ఏ ప్రశ్న అడుగుతున్నారో అర్థం అయ్యే లోపలే పది పదిహేను ప్రశ్నలు దూసుకొచ్చాయి. సమాధానాలతో పని లేనట్టుంది వాళ్ళకి. రవిని వాళ్ళకి, వాళ్ళని రవికి పరిచయం చేశాను.

"ఆ ఏదో ఇరుగుపొరుగు అన్నట్టు కాదు రవిగారూ.. మేమంతా వీళ్ళ ఇంటిలోనే వుండేవాళ్ళం.. ఒక్క రోజు రాకపోయినా మీ అత్తగారు వూరుకునేది కాదు.." చెప్పింది వనజొదిన.

"ఇద్దరు ఒకసారి రండే.. నానమ్మ చాలా రోజుల్నించి చూడాలంటోంది.." అంది గాయత్రి. ఆ మాట పూర్తికాక ముందే నానమ్మ నెమ్మదిగా వంగి నడుచుకుంటూ "ఏమే పిల్లా.." అంటూ లోపలికొచ్చింది.

"నువ్వెందుకు నానమ్మా ఇంత కష్టంగా రావటం? మేమే వద్దామనుకుంటే.." అన్నాను నేను.

"ఏమో తల్లీ.. ఈ ముసలమ్మ నీకు గుర్తుందో లేదో.. రాకుండా పోతే మళ్ళీ చూడటానికి వుంటానో లేదో అని ఆత్రపడి వచ్చాను.. నిన్ను చూస్తే మీ అమ్మని చూసినట్టుందే పిల్లా.. కాకపోతే బాగా సన్నబడ్డావు.." అంది ఆప్యాయంగా నెమురుతూ. రవి నవ్వేశాడు.

"ఒకసారి ఆ ఇంటికి వెళ్ళి వస్తామండి.." అన్నాడు జనాంతికంగా.

"ఎవరున్నారని వెళ్తారు.. వీళ్ళు వచ్చిన తరువాత కళే పోయింది.. ఆ బాదం చెట్టు కొట్టేసిన తరువాత ఆ ఇల్లే కొత్తగా వుంది.." అంది గాయత్రి.

"అయ్యో.. చెట్టు కొట్టేశారా?" అన్నాను అప్రయత్నంగా.. ఒక్కసారిగా నా బాల్యం కోల్పోయిన బాధ కలిగింది నాకు.

"ఒక్క చెట్టేమిటే తల్లీ.. మీరు పెట్టిన పాదులు, పూల చెట్లు ఒక్కటి బ్రతకనిచ్చారా. మీ గోరింటాకు చెట్టు ఆకు ఎంత బాగా పండేది గుర్తుందా? దాని ఆకు కోసం అందరూ వస్తున్నారని తెగ సణిగేది ఆ మహా ఇల్లాలు.. ఇప్పుడు ఆ చెట్టు వున్నా ఒకటే లేకపోయినా ఒకటే.. ఒక్క ఆకు లేకుండా ఎప్పుడూ ఎండిపోయి వుంటుంది..." చెప్పింది అత్తయ్య వంటింటిలో నుంచే.

"ఫర్లేదు లెండి.. ఒకసారి వెళ్ళి వెంటనే వచ్చేస్తాం.." అన్నాడు రవి లేస్తూ.

"వెళ్ళిరండి నాయనా.. ఆ అమ్మాయి పుట్టి పెరిగిన ఇల్లు.. చూసుకోవాలని వుండదూ.." అంది నానమ్మ.

"త్వరగా వచ్చేయండి.. మీ మామయ్య వచ్చే వేళకూడా అయ్యింది.. ఒక్కసారే రాత్రికి భోజనం కూడ చేసి వెళ్ళచ్చు.." అంది అత్తయ్య గొంతు వంటింటిలోనించి.

భోజనం మాట వినగానే మేము ఇద్దరం ఒకరినొకరం ఇబ్బందిగా చూసుకొని నవ్వుకోని బయటపడ్డాం.

❖ ❖ ❖

మా పాత ఇంటి కొత్త స్వరూపం చూడగానే బాధగా అనిపించింది. సావిత్రత్తయ్య వాళ్ళు చెప్పింది నిజమే. నేను పుట్టి పెరిగిన ఇల్లు అదే అని చెప్పడానికి ఏ ఆనవాలూ మిగిలినట్టు లేదు. బాదం చెట్టు లేని లోటు ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. బావి మూసేసారు. గేటు ఇంతకు ముందున్న చోటు నుంచి కొంచెం దక్షిణానికి జరిపినట్టున్నారు. మేము ఎంతో ముచ్చటపడి వేయించిన లేత గులాబిరంగుకు బదులుగా మాసిపోయిన తెల్లరంగుతో ఇల్లు వెలవెలబోతోంది.

తలుపు తీసి మమ్మల్ని చూసిన పెద్ద మనిషి ప్రశ్నార్థకం మినహా ఏ భావం పలకకుండా ముఖం పెట్టాడు.

"పరమేశ్వరరావుగారు..??" అడగాలా వద్దన్న సంశయం రవి గొంతులో. ఆయన సమాధానం చెప్పలేదు. చిన్నగా వూపిన తల చూస్తే అది అవును అన్న సమాధానమో.. అయితే ఏంటి అన్న తిరస్కారమో అర్థం కాలేదు.

"ఈ ఇల్లు ఒకప్పుడు మాదేనండి.. నేను పుట్టి పెరిగిన ఇల్లు.. ఒకసారి చూసి వెళ్దామని వచ్చాము.." చెప్పాను నేను.

"రండి.." అనే మాట ఆయన గొంతులో నుంచి తప్పదన్నట్లు వచ్చింది. లోపలికి వెళ్ళి బాగా దుమ్ము పట్టి వున్న కుర్చీలలో కూర్చున్నాం.

"బాదం చెట్టు కొట్టేసినట్లున్నారు...?" అడిగాను ఏమడగాలో తెలియక.

"ఏం చెట్టో.. ఇంటినిండా ఆకులు.. చెత్త.. చెట్టు నిండా పిచుకలు, గూళ్ళు.." అసహ్యంగా ముఖం పెట్టాడు.. "కాయలు కాస్తేచాలు..పిల్లలంతా రాళ్ళు వేయడం, గోడలు దూకటం.. అందుకే కొట్టిచ్చేశాం.." చెప్పాడు. అంతసేపటికి అన్ని మాటలు మాట్లాడినందుకు

సంతోషపడాలో, ప్రతి మాటా గుచ్చుకున్నందుకు బాధపడాలో అర్థం కాలేదు నాకు. బావి గురించో, గోరింటాకు చెట్టు గురించో అడిగే ధైర్యం లేకపోయింది నాకు.

"ఈ ఇల్లు వాళ్ళ నాన్నగారికి బాగా కలిసి వచ్చిందండి.. తను ఎప్పుడూ ఈ ఇంటి గురించే చెప్తుంటుంది.." అన్నాడు రవి. సూటిగా మేము అనుకున్న విషయం రాబట్టడానికే ఆ మాట అన్నాడని నాకు అర్థమైంది. ఆతృతగా పరమేశ్వరరావుగారి వంక చూశాను.

"ఏం కలిసిరావటమో.. ఒక సుఖం లేదు సంతోషం లేదు..ఎందుకు కొనుక్కున్నామా అని అనుకోని రోజు లేదు.." చెప్పాడాయన చప్పరిస్తూ. రవి ఇంకా ఏదో అడగబోతుంటే నేను మధ్యలో అందుకున్నాను–

"చాలా ధాంక్సండి.. వస్తాము.." అంటూ లేచాను. రవి కొంచెం ఆశ్చర్యంగా చూసి తను కూడా లేచి నాతో బయటికి అడుగేశాడు.

"గేటు కూడా మార్చినట్లున్నారు.." అన్నాడు బయటపడుతూ.

"వాస్తు ప్రకారం.." అన్నాడు ఆయన.

మేము సావిత్రి అత్తయ్య ఇంటికి వచ్చేసరికి పద్మనాభం మామయ్య కూడా వచ్చేశాడు. ఆప్యాయంగా పలకరించి అన్ని విషయాలు అడిగాడు. రవి మేము వచ్చిన కారణం వివరించాడు.

"మీ మామగారు వున్నప్పుడు పరిస్థితి వేరు.. వాడికి, వాడి భార్యకి ఎప్పుడూ పది మంది చుట్టూ వుండాలి.. వీధిలో వున్న వాళ్ళందరిని పలకరించేవాడు.. ఎవరికి ఏ సహాయం కావాలన్నా ఇద్దరూ వెనక ముందు చూడకుండా చేసేవాళ్ళు.. పదిమంది మంచి కోరుకుంటే మనకి మంచే జరుగుతుందనడానికి వాడే వుదాహరణ.." చెప్పాడాయన. ఆ రాత్రి భోజనం చెయ్యనిదే ఒప్పుకోలేదు మామయ్య, అత్తయ్య. రాత్రి పది దాకా మమ్మల్ని చూడాలని చుట్టుపక్కలవాళ్ళంతా వచ్చారు. అతి కష్టం మీద పదిన్నరకి బయలుదేరాము.

"ఈ ఏరియాలో మీరెవరైనా ఎలక్షన్లో నిలబడ్డా గెలిచేట్టున్నారు.." అన్నాడు రవి నవ్వుతూ. నేను నవ్వేశాను.

"అంతా నాన్న, అమ్మ గుడ్ విల్" చెప్పాను.

"అది సరే.. ఇంతకీ ఏం నిర్ణయించావు?" అడిగాడు అసలు విషయానికి వస్తూ.

"చెప్తాను.. కానీ మీరు వెక్కిరించకూడదు.. ఆ రెండు ఇళ్ళల్లో.." చెప్పబోతుంటే మధ్యలోనే ఆపేశాడు రవి.

"రెండు కాదు.. మూడు ఇళ్ళలో.. మీ పాతింటిని కొనుక్కుంటే ఎలా వుంటుందా అని ఆలోచిస్తున్నాను.." అన్నాడు.

నేను సమాధానం చెప్పలేదు.

అప్పుడే అమ్మ ఫోన్ చేస్తే తీసుకొని చెప్పాను– "నిర్ణయించుకున్నాం అమ్మా.." అని.

(పొద్దు అంతర్జాల పత్రిక, ఏప్రిల్ 2011)

భూ దేవతమ్మ

"నా వుద్యోగం పోయింది" ఎలాంటి వివరాలు లేకుండా సూటిగా చెప్పేశాను. ఏం చెప్పకపోయినా నా మనసులో వున్నవన్నీ అమ్మకి అర్థమైనట్లేవుంది.

"ఒక్కసారి నాన్నతో మాట్లాడు.." అమ్మ చెప్పింది.

"వద్దమ్మా నువ్వే చెప్పు.." అన్నాను.

"కనీసం ఇలాంటప్పుడైనా ఆయనతో మాట్లాడచ్చు కదా.."

''ఇలాంటప్పుడంటే? ఇప్పుడేదో వుద్యోగం పోయి వీధిన పడ్డాననుకుంటున్నావా? ఒకవేళ అలాంటి పరిస్థితి వచ్చినా ఆయన సహాయం మాత్రం అడగను." కటువుగానైనా సూటిగా చెప్పాను. "రేపొస్తున్నాను" అని చెప్పి ఫోన్ పెట్టేశాను.

చేతిలో వున్న ఫోనువైపే చూస్తూ వుండిపోయాను. ఇరవై ఐదు వేలు ఖరీదు చేసే ఫోను, ఇప్పుడు అమ్మితే రెండు మూడు వేలైనా రావేమో. అంతేలే.. నిన్నటిదాకా నా విలువ నెలకి యాభైవేలు. ఏ బ్యాంకుకి వెళ్ళినా నలభై యాభై లక్షలు తక్కువ కాకుండా లోన్ ఇచ్చే వాళ్ళు. కానీ ఈ రోజు నేను మాజీ వుద్యోగిని. ఏ బ్యాంకు లెక్కల ప్రకారం చూసినా ఏ మాత్రం విలువ చెయ్యనివాణ్ణి.

నా టేబుల్‌పైన వున్న సామానంతా నేను తెచ్చుకున్న బ్యాగ్‌లో సర్దుకున్నాను. ప్రతి సంవత్సరం నాకు కంపెనీ ఇచ్చిన అవార్డులు, రివార్డులూ, సర్టిఫికెట్లూ...! ఒక్క సంవత్సరంలో ప్రపంచంలో జరిగిన మార్పులు నా విలువని ఇంత దిగజార్చేస్తాయని ఏనాడూ వూహించలేదు. అదే ఆఫీస్.. నాలు గేళ్ళుగా నా క్యాబిన్‌లోంచి చూసిన ఆఫీసు.. ఈ రోజు కొత్తగా కనపడుతోంది. సంవత్సరం క్రితం నేనే రిక్రూట్ చేసిన

'నా' టీం ఈ రోజు ఏమీ ఎరగనట్టు తమ పనిలో నిమగ్నమై వున్నారు. నా వుద్యోగం పోతోందన్న జాలికన్నా, తమ వుద్యోగం పోకూడదన్న ఆరాటం ఎక్కువగా కనిపిస్తోంది వాళ్ళలో.

వాళ్ళని మాత్రం అని ఏం ప్రయోజనం? ఇదే ఆఫీసులో.. ఇదే సీట్లో నిన్నటి వరకూ నేనూ ఇలాగే ఆలోచించాను కదా? ఇంతలోనే ఎంత మార్పు? నిన్నటిదాకా నావనుకున్నవి ఏవీ ఈ రోజు నావి కావు. చిన్నప్పుడు ఎప్పుడో మా వూరి రామాలయంలో విన్న భగవద్గీత గుర్తుకు వచ్చింది. జీర్ణమైన శరీరాన్ని వదిలి ఆత్మ కొత్త శరీరాన్ని వెతుక్కుంటుందట. అలాగే ఈ వుద్యోగాలు కూడా.. కాకపోతే ఇక్కడ ఆత్మలు వుండవు. అన్నీ జీవంలేనివే వుద్యోగాలు..!! చిన్నగా నవ్వుకున్నాను. వుద్యోగం పోయిందనగానే వేదాంతం గుర్తుకురావటం.. చిత్రంగానే వుంది మరి. హరిత తలుపు తోసుకోని నా క్యాబిన్‌లోకి వచ్చింది. ఆమె నా కొలీగ్.

"సో వెళ్ళిపోతున్నా వన్నమాట" అన్నది ఏ భావం పలకకుండా, నేను తలాడించాను.

"నీకు కావాలంటే నా ఫ్రెండ్స్ వున్నారు.. నేను రికమెండ్ చేస్తాను. వై డోంట్ యూ ట్రై" అడిగింది. నేను కొత్త వుద్యోగం ఏదీ చూసుకోకుండా మా వూరు వెళ్తున్న విషయం ఆమెకు ఇంతకు ముందే చెప్పాను.

"నేను వూరు వదిలి వెళ్తున్నది నాకు ఇక్కడ వుద్యోగం దొరక కాదు. ప్రస్తుతం ఏ వుద్యోగం చేసేందుకు మనస్కరించక. కొంత కాలం నాకు విశ్రాంతి కావాలి. నేను చేసిన వుద్యోగాన్ని, ఈ కార్పొరేట్ ప్రపంచాన్ని ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకోవాలి. అప్పుడు కూడా నాకు ఈ ప్రపంచం నచ్చితే తిరిగి వస్తాను.. అలా వస్తే నీ సహాయం తప్పకుండా తీసుకుంటాను.." చెప్పాను నేను.

"ఎక్కడికి వెళ్ళినా.. ఏం ఆలోచించినా.. మళ్ళీ ఏదో వుద్యోగం చెయ్యాలి కదా?" అడిగిందామె.

"ఏమో తెలియదు.. అప్పుడు ఆలోచిస్తాను.." చెప్పాను.

"ఎందుకలా మాట్లాడుతున్నావు"

"సారీ.. కొంచెం డిస్టర్బ్‌డ్‌గా వున్నాను. ఈ కార్పొరేట్ ప్రపంచం మీద విరక్తితో వున్నాను"

"నువ్విప్పుడు మాట్లాడేది వుద్యోగం పోయిందన్న బాధతో అనుకుంటాను.. అదే నిజమైతే అందులో నుంచి త్వరగా బయటికి రావడం మంచిది" చెప్పింది

"నా వుద్యోగం పోయిందని కాదు. ఇలా ఎంత మంది వుద్యోగాలు పోయాయో తెలుసా?"

"ఒకరి కంపెనీ మరొకరికి అమ్మేశాక ఆ కొత్త యజమాని అవసరాన్ని బట్టి మనుషుల్ని తీసేయ్యడంలో తప్పేముంది?"

"హరితా.. నాకు తెలుసు నీకు అది సాధారణంగానే కనిపిస్తుందని.. కానీ వుద్యోగస్తులంటే ఏదో ఫర్నీచరులాగా.. ఇష్టం వుంటే వుంచుకోవడం లేకపోతే తీసెయ్యడం న్యాయమేనా? కంపెనీ కొన్నప్పుడు ఆ కంపెనీని వృద్ధిలోకి తెచ్చిన వుద్యోగస్తులు ఆ కంపెనీలో భాగం కాకుండా పోతారా? ఆ వుద్యోగస్తుల్ని అలా ఉన్నట్టుండి వీధిని పడేస్తే వాళ్ళ కుటుంబానికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఆ కంపెనీకి వుండదా?" అంటూ ఆగాను.

హరిత ఆవేశంగా మాట్లాడుతున్న నా వైపే చూస్తూ వుండిపోయింది.

మళ్ళీ నేనే అందుకున్నాను– "చాలా రోజుల్నించి ఇదే ఆలోచన తొలిచేస్తోంది. అందుకే కొన్ని రోజులు ఈ ప్రపంచానికి దూరంగా వుందామనుకుంటున్నాను." చెప్పాను.

"యాజ్ ఆల్వేస్.. నువ్వు నాకు అర్థం కావు.. ఏమైనా నీకు నా బెస్ట్ విషెస్" చెప్పి వెళ్ళిపోయిందామె.

ఆమె మాట తీరులో స్పష్టంగా మార్పు కనపడుతోంది. అయినా నేను ఇప్పుడున్న పరిస్థితిలో ఆమె గురించి ఆలోచించే వుత్సాహం లేదు. అందుకే నేనేమీ మాట్లాడలేదు. నా సామానంతా తీసుకొని బయల్దేరాను. కొంతమంది కొలీగ్స్ మాత్రం వచ్చి సాగనంపారు.

ఆటో ఎక్కబోతుండగా ఫోన్ మోగింది. ఇంటి నుంచి నాన్న చేశాడు.

"ఏరా రామం వుద్యోగం పోయిందట కదా.. అమ్మ చెప్పింది.." అడిగాడు. నేను సమాధానం చెప్పలేదు. చెప్పాలని అనిపించలేదు. నాన్నే కొనసాగించాడు–

"కలో గంజో కలిసే తిందాం.. నాలుగు ఎకరాలు వుంది.. ముగ్గురం బ్రతకలేక పోలేం.. నువ్వు ఇక్కడికి వచ్చెయ్ బాబూ.."

"అమ్మకి ఫోన్ ఇవ్వండి.." అన్నాను నేను. ఆ మాట కటువుగా వచ్చిందని తెలిసినా నేను పెద్దగా పట్టించుకోలేదు.

"ఏమిట్రా.." అమ్మ అంది ఫోను తీసుకొని.

"ఏంటమ్మా ఆయన..నేను వస్తున్నట్లు చెప్పలేదా? ఆ నాలుగు ఎకరాల సంగతి నా ముందు మళ్ళీ ఎత్తవద్దని చెప్పు ఆయనకి. కలో గంజో పెడతాడట.. దేవుడి దయ వల్ల నేను సంపాదించి దాచిపెట్టిన సొమ్ము కనీసం ఆర్నెల్లైనా వస్తుంది.. ముగ్గురం తిన్నా.. ఈ లోగా ఏదో వొక ఏర్పాటు చేసుకుంటానని చెప్పు ఆయనకి.."

"ఎందుకురా అంత మండిపడతావు?" అడిగింది అమ్మ.

"నీకు తెలియదా ఎందుకో.. మళ్ళీ మొదటికి తీసుకురాకు.. రేపొస్తున్నా కదా అప్పుడు మాట్లాడదాం.." చెప్పి ఫోన్ కట్ చేసి ఆటో ఎక్కేసాను.

❖ ❖ ❖

బస్సు మా వూరి వైపు పరుగు తీస్తోంది. వెనక్కి వెళ్తున్నట్లు భ్రమ కలిగిస్తున్న చెట్లను చూస్తుంటే ఎందుకో నా వుద్యోగం గుర్తుకు వచ్చింది. ఇలాగే పరిగెట్టి పరిగెట్టి నాలుగేళ్ళ తరువాత వెనక్కి తిరిగి చూసుకుంటే ముందుకు వెళ్ళలేదనిపిస్తుంది నాకు. ప్రమోషన్లు వచ్చాయి, జీతాలు పెరిగాయి అయినా జీవితంలో ముందుకు వెళ్ళలేదనే భావన. ఇలా ఎందుకనిపిస్తోందో తెలుసుకోడానికే, వేరే వుద్యోగం వెతుక్కోకుండా ఇంటికి వెళు న్నాను.

మా వూరి పొలిమేరలోకి వస్తుంటే అప్రయత్నంగానే నా కళ్ళు మా నాలుగు ఎకరాల పొలం కోసం వెతికాయి. దాదాపు చుట్టు పక్కల వున్న పొలాలన్నీ స్థలాలుగా మారిపోయాయి. వాటిల్లో ప్లాట్లు వేసి అమ్ముతున్నారు. వాటన్నింటి మధ్యలో మా పొలం. ఆ నాలుగెకరాల పొలం వల్లనే నాకూ నాన్నకి పడనిది. చుట్టుపక్కల పొలాలలాగే మా పొలాన్ని రియల్ ఎస్టేట్ వాళ్ళకి అమ్ముదామంటే మా నాన్న ససేమిరా అన్నాడు.

"పోనీ అమ్మిన తరువాత వచ్చిన డబ్బులు మీ దగ్గరే పెట్టుకోండి.. ఈ వయసులో మీకెందుకు శ్రమ. ఆ పొలంలో పోయిన నాలుగేళ్ళలో ఒక్కసారైనా మనం చేసిన ఖర్చుకి గిట్టుబాటు అయ్యిందా?.. ఇంకా దాన్ని పెట్టుకొని ఏం లాభం?" అడిగాను నేను.

"గిట్టుబాటు అంటే ఏమిట్రా? అన్నింటినీ అదే డబ్బుతో కొలవకూడదు.. అది భూదేవతమ్మ.. తల్లితో సమానం.. అట్లాటి తల్లిని ఎలా అమ్మమంటావు చెప్పు" అన్నాడు నాన్న. ఈ విషయమై నాకు నాన్నకి చాలా పెద్ద గొడవే జరిగింది.

ఒకసారి పట్నం నుంచి ఒక రియల్ ఎస్టేట్ ఏజంట్‌ని కూడా తీసుకెళ్ళాను. అతను చెప్పే రేట్లు వింటేనన్నా నాన్న మెత్తబడతాడనుకున్నాను. మంచి ధర చెప్పి అక్కడే రెండు ప్లాట్లు కూడా ఇస్తానన్నాడు. అయినా నాన్న చలించలేదు.

"ఆ పొలం నేను బ్రతికుండగా అమ్మను.. ఇక ఈ విషయంలో వేరే మాట ప్రసక్తే లేదు.." అని తెగేసి చెప్పి అమ్మతో–

"దూరం నించి వచ్చారు.. ఇద్దరికీ అన్నం పెట్టు" అంటూ పొలం వెళ్ళాడు.

ఆ రోజు రాత్రి మా ఇద్దరికీ తీవ్రంగా గొడవైంది–

"ఆ పొలాన్ని ఎందుకమ్మరో నాకు అర్థం కావటంలేదు.. నాకూ ఒక ఇల్లు ఏర్పడుతుంది.. వచ్చిన డబ్బుల్తో హాయిగా వుండచ్చు.. మీరన్నట్టు భూమి దేవతే.. అంటే లక్ష్మీదేవి.. వచ్చే లక్ష్మిని కాదనద్దు.." అన్నాను నేను. నాన్న వొప్పుకోలేదు.

"నువ్వనుకున్నట్లు భూదేవతంటే లక్ష్మీదేవికాదురా.. అన్నపూర్ణ.. పదిమందికి అన్నం పెట్టే తల్లి.. ఈ తేడా అర్థమైతే నేను ఈ పొలం ఎందుకమ్మనో నీకు అర్థమౌతుంది." అన్నాడు. ఆ రోజు నుంచి నాన్నతో మాట్లాడటం మానేశాను. మళ్ళీ ఇదుగో ఇప్పుడు రావటమే మా వూరికి.

❖ ❖ ❖

బస్టాండులో దిగుతూనే "రిక్షాబాబూ" అంటూ వినిపించింది.

"నువ్వు సాములోరి నాగులు కదూ" అడిగాను అతన్ని చూస్తూ.

"తవరా బాబూ.. బాగుండారా?" అన్నాడు నాగులు సామాను అందుకుంటూ.

"బాగున్నాను.. ఈ రిక్షా ఎప్పటినుంచిరా..?" అడిగాను. నాగులు నా కన్నా పెద్దే కానీ చిన్నప్పటి నుంచీ వాణ్ణి అలా పిలవటమే అలవాటు. అతనికి కూడా అదే అలవాటు.

"ఏం చేస్తాం బాబూ.. పొలాలు బొయ్యి ప్లాట్లు అయినాయి. ఇంక మా పాట్లు ఎవరికి పడతాయి.పని బొత్తిగా దొరకడం లేదు. అందరిలాగే వేరే వూరు జేరి కూలిపని జేద్దామంటే ఇంట్లో ముసిలాళ్ళు పిల్లలు వుండారు.. మా రామమ్మిని పంపి నేను బండి లాగతన్నా.." చెప్పాడు

"సరిపోతుందా?" అడిగాను.

"సరిపోకపోతే మాత్రం ఏం జెయ్యగలం బాబూ.. ఏదో మీ అయ్యలాంటి మారాజులు వుండబట్టి గుట్టుగా బ్రతుకుతున్నాం" అన్నాడు బలంగా రిక్షా తొక్కుతూ.

నేను ఇంకేమీ మాట్లాడలేదు. ఇంటి దగ్గర దిగి యాభై రూపాయలు నాగులు చేతిలో పెట్టి చిల్లర తీసుకోకుండా ఇంట్లోకి వెళ్లిపోయాను.

"ఏరా నాయనా వచ్చావా.. రా.. ఇదుగో మంచినీళ్ళు తాగు.." అమ్మ హడావిడిగా వచ్చి స్టీలు కుండ నీళ్ళు గ్లాసుతో ఇచ్చింది. అమ్మతోపాటే వంటింట్లోకి వెళ్ళి కబుర్లు చెప్తూ పీట మీద కూర్చున్నాను. అమ్మ గిన్నెలు తోముతోంది.

"నువ్వెందుకు అంట్లు తోముతున్నావు? రూకమ్మ రావడంలేదా?" అడిగాను.

"ఎక్కడరా.. రూకాలు మొగుడు మునుపు బాడిసె పనులు చేసేవాడు. నాగళ్ళు పోయాక వాడికి పని తగ్గింది. ఇప్పుడు పొలాలే పోతుంటే ఇంక వాడికి పనేమి వుంటుంది చెప్పు? పిల్లా జెల్లాతో పట్నంబోయి బేల్దారి పనులు చేసుకుంటున్నారట.." చెప్పింది అమ్మ చెయ్యి తుడుచుకుటూ.

అప్పటికింకా నాన్న గొంతు వినిపించకపోవడంతో అడిగాను– "ఆయన లేడా?" అని.

"కరణంగారింటికి వెళ్ళారురా.. ఆయన బావమరిది హైద్రాబాద్‌లో పెద్ద కంపెనీలో వుద్యోగమట.. నీకేమైనా చూస్తారేమోనని అడగటానికి.." అమ్మ చెప్తుండగానే నేను అరిచాను–

"అమ్మా.. నాకు వుద్యోగం వెతికిపెట్టమని నేనేమైనా బ్రతిమాలానా? ఆయనకి ఎందుకంట ఇవన్నీ.. నా సంగతి నేను చూసుకోగలను.. అయినా నాకు వుద్యోగానికి గతిలేక ఇక్కడికి రాలేదు.. వీలైతే మన పొలం అమ్మి ఏదైనా వ్యాపారం చేద్దామని అనుకోని వచ్చాను" అన్నాను.

"ఆ పొలం సంగతి ఇంకా వదిలిపెట్టలేదా నువ్వు.. ఎందుకురా నీకు ఇంత పంతం." అడిగిందామె.

"నాకేనా పంతం.. నాన్నకి లేదా?" అంటూ చివాల్న లేచి– "నేను శేషయ్య మామని కలిసి వస్తాను" అంటూ ఇంట్లోనించి బయటపడ్డాను.

❖ ❖ ❖

మర్నాడు కొంచెం ఆలస్యంగా తయారయ్యి ఇంట్లోనించి బయటపడ్డాను. సీతమ్మగారి బావి పక్కనే వున్న సాంబయ్య టీ కొట్టు దగ్గర చేరి పాత మిత్రులతో టీ తాగుతున్నాను.

"దండాలు బాబూ" అంటూ వచ్చాడు వెంకటరెడ్డి.

"ఏం రెడ్డీ బాగున్నావా?" అడిగాను.

"బాగానే వుండాం బాబూ.. తమరేంటి బాబూ చానా కాలానికి కనిపించారు" అడిగాడు కూర్చుంటూ. వాడి వెనకే ట్రాక్టర్ల సాంబశివుడు, బస్తాలు కుట్టే వీరయ్య కూడా వచ్చి ఎదురుగా బల్ల మీద కూర్చున్నారు.

"బాబూ.. పొలం అమ్మేత్తన్నారంటగా?" అడిగాడు వీరయ్య. అప్పుడే ఆ విషయం వాడి దాకా వెళ్ళినందుకు ఆశ్చర్యమేసింది.

"ఏం వీరయ్యా.. నువ్వు కొనుక్కుంటావా?" ఎగతాళిగా అన్నాను

"కొనుక్కోగలిగినా బాగుండు బాబూ.. నాకంత తాహతెక్కడిది?" అన్నాడు వీరయ్య.

సాంబశివుడు ముందుకు జరిగి కుతూహలంగా అడిగాడు– "పెద్దయ్యగారు ఒప్పుకున్నారా బాబూ"

"ఇంకాలేదు సాంబశివుడూ.. ఇవాళో రేపో మాట్లాడతాను" అన్నాను.

"మీలాంటోళ్ళని నమ్ముకున్నాం బాబూ.. మమ్మల్నిట్టా అన్నాయం జెయ్యబాకండి" వెంకటరెడ్డి చేతులు జోడించాడు. అప్పటికి ఇంకొంత మంది అక్కడ చేరారు.

"ఏంటిది.. అందరూ కలిసి నన్ను బెదిరించడానికి వచ్చారా? లాభం వస్తుంటే ఆ పొలాన్ని అమ్ముకోకుండా ఎట్టా వుండమంటార్రా? అయినా మా పొలం అమ్మాలో లేదో మీ సలహా ఎందుకంటా?" కోపంగా అంటూ లేచాను అక్కడి నుంచి కదలడానికి. నాతోటే అందరూ లేచారు. సాంబశివుడు కొంచెం ముందుకొచ్చి అన్నాడు–

"బాబూ ఒక్క మాట ఇనండి.. ఆ పొలం మీదే.. అమ్మాలో వద్దో మీ ఇష్టం... కానీ ఆ పొలం నమ్ముకోని మాలాంటోళ్ళు చాలా మంది వుండారు బాబూ.. మీకు మటికి మీ పొలం మీరు అమ్ముకోని లాభాలు చేసుకోవడమే కనిపిస్తాంది.. ఈ పొలం మీద ఆధారపడ్డ మా బతుకులు కనిపియ్యటంలేదు. ఇంతకాలం ఆ పొలాన్ని దుక్కిదున్ని ఇంత వూడిగం చేసినోళ్ళం, వూరు, పొలం ఇంకెవరికో అమ్మేత్తే పిల్లలతో వీధిన పడతాం.. ఇంతకాలం మాకు అన్నం పెట్టినోళ్ళు ఇప్పుడు మా బతుకులు నాశనమౌతాయంటే సూత్తా వూరుకుంటే న్యాయం కాదు కదయ్యా..? ఆలోచించండి.." చెప్పేసి అందరూ అక్కడి నుంచి వెళ్లిపోయారు..

అతను చెప్పిన మాటలు అర్థమవడానికి కొన్ని క్షణాలు పట్టాయి. అర్థం అయ్యేకొద్దీ ఏదో మంచుతెర వీడి కొత్త పువ్వులు పూసినట్లుగా వుంది. ఇంతకాలం వుద్యోగస్తులను ఫర్నీచరులా చూసే కార్పొరేట్లని విమర్శించినవాణ్ణి, ఇలా పొలంలో పనిచేసే వాళ్ళని అసలు వుద్యోగస్తులుగానే గుర్తించనే లేదు. అలా గుర్తించాకే నా బాధ్యత ఏమిటో అర్థమవుతోంది. అదే ఆలోచనలో ఎంతసేపు నిలబడిపోయానో నాకే తెలియదు. ఎదురుగా నాన్న ముల్లుగర్ర భుజాన వేసుకొని వస్తూ కనిపించాకే తేరుకున్నాను. ఎదురు వెళ్ళి కర్ర అందుకొని అన్నాను–

"నాన్నా.. ఇంక మీరు పొలానికి వెళ్ళనవసరం లేదు.. రేపట్నించి నేనెళ్తాను.."

నాన్న నవ్వేశాడు.

(రచన మాసపత్రిక, జూలై 2012)

కథానుబంధం

జీవితమంటేనే కుటుంబం, సమాజం, బంధాలు, అనుబంధాలు.

రచయితగా సత్యప్రసాద్‌కి కుటుంబమన్నా, కుటంబ సభ్యుల మధ్య సంబంధ బాంధవ్యాలన్నా ఎంతో ఇష్టం. ముఖ్యంగా ఆలుమగల మధ్యన జరిగే సన్నివేశాల్ని సహజంగానూ, ఒకింత ఆర్ద్రతతోనూ తీర్చిదిద్దటంలో ఈయన సిద్ధహస్తుడు. సమాజం మనుగడకి కుటుంబ వ్యవస్థ మూలస్తంభంగా నిలుస్తూ వస్తున్నది. ఆ కుటుంబంలో కూడా భార్యభర్తల మధ్య ఉండే సంబంధం మిగతా అన్ని రకాల మానవ సంబంధాల కంటేనూ భిన్నమైనదీ, ప్రత్యేకమైనదీ. సమస్యలు వస్తాయి, ప్రశ్నలు పుడుతూ ఉంటాయి. ఒక్కోసారి అవతలి మనిషిమీద పీకల్దాకా కోపం వస్తుంది. అయినా మళ్లీ మాట్లాడుకుంటారు. అది కేవలమూ రాజీ పడ్డం కాదు. పరిస్థితుల పట్ల వాస్తవికమైన అవగాహన, అటువైన, పైపై వత్తుడులన్నింటి కిందా పరస్పరమైన ప్రేమ, గౌరవం, అవతలి మనిషిని సంతోషపెట్టాలనే ఆరాటం. చిలుక రాయబారం, తుది బంధం, కలిసి వచ్చిన ఇల్లులా ఇలాంటి కథల్లో ఏదో కథ చదువుతున్నట్టుగా ఉండదు. స్వయంగా మనకు కూడా ఆ సన్నివేశంలో భాగస్వాములం అయినట్టూ, ఆ పాత్రలు మనవాళ్లే అయినట్టూ ఉంటుంది. సంభాషణల రచనలో ఒక బిగువు, ఒక పొదుపరితనము ఉండి ప్రతి సన్నివేశాన్నీ రక్తి కట్టించాయి. గట్టిగా చూస్తే చిలుకరాయబారం కథలో ఉద్యోగ పరిస్థితులవల్ల ఒకరినొకరు చూసుకోలేని ఆధునిక యువజంటకూ, పద్మావతీ శ్రీనివాసం కథలో నిరంతర విరహాన్ని భరించే దైవమిథునానికి ఆట్టే తేడాలేదు. ఆఖరికి అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడూ, ఆయన దేవేరీ కూడా నగటు మధ్యతరగతి భార్యాభర్తల్లాగానే ముచ్చట్లాడుకుంటారు. కష్టం సుఖం కలబోసుకుంటారు. కానీ, సమకాలీన తెలుగు కథల్లో దురదృష్టవశాత్తూ కుటుంబ సంబంధాలు

ఛిద్రమైపోవడం చిత్రించబడినంతగా నిజమైన దంపతులు ఎలా ఉంటున్నారో, ఎలా ఉండాలో సూచించిన కథలు అరుదు. సత్యప్రసాద్ మనుషుల మధ్య సంబంధాల్ని ఎంత జాగ్రత్తగా పరిశీలించారో, అంత ఆర్ద్రతతో అక్షరబద్దం చేశారు. ఈ సంపుటిలోని కథలు చదువుతూ ఉంటే నన్ను బాగా ఆకట్టుకున్న లక్షణం ఇది.

అలాగని అతని దృష్టి కేవలం కుటుంబ పరిధిలోనే ఇమిడిపోలేదు. సమాజంలో జరిగే అవకతవకల్ని ఉతికి ఆరేసే ఆవేశం కూడా మనకి కనిపిస్తుంది. ఐతే ఆ ఆవేశం కత్తులు తుపాకులు పట్టుకుని విప్లవ నినాదాలతో అరిచి కేకలు పెట్టదు. నిశ్శబ్దంగా వచ్చి సమాజాన్ని అద్దంలో చూపిస్తుంది. ఆ అద్దంలో కనబడే ప్రతిబింబంలో ఏదీ తిన్నగా ఉండదు, అన్నీ వంకర టింకరగా ఉంటాయి. ఆ అష్టవంకర్లనీ చూసి ముందు మనకి నవ్వొస్తుంది. కితకితలు పెట్టినట్టుగా ఉంటుంది. కానీ ఎక్కడో కుదుతుంది. కొంచెం నెప్పెడుతుంది. ఎందుకంటే మనకి తెలుసు. ఆ వంకర్లూ అవకరాలూ మనం నిత్యం చూసేవే, అనుభవించేవే. ఈరేశంగాడి ముచ్చట, మంత్రిగారి సమాధి, ఐదు వందల రూపాయల నోటు వంటి కథల్లో రకరకాల రంగుల్లో రూపాల్లో కదలాడుతున్నవి మన నీడలే.

ఇంకో విషయం మీరు గమనించారో లేదో. చాలా కథల్లో సన్నివేశాలు మన ముందు సజీవంగా జరుగుతున్నట్టుగా ఉంటాయి. ఐదు వందల రూపాయలనోటు కథ, చిరాకు రామనాథం కథలో వాతావరణం జాగ్రత్తగా గమనించండి. ఒక ప్రతిభావంతుడైన దర్శకుడు నాటకంలోనో సినిమాలోనో దృశ్యాన్ని తీర్చి దిద్దినట్టుగా ఉంటుంది. ప్రధాన పాత్రలు, వారి మనోభావాలే కాక, చుట్టూతా ఉన్న ఇతర పాత్రలు, రంగాలంకరణ, నేపథ్యంలో వినబడే రణగొణ ధ్వనులు ఇవన్నీ కలిసి, కథ చదువుతున్నట్టుగా కాక, ఆ దృశ్యం మన చుట్టూతా నిజంగా జరుగుతున్నట్టుగా అనుభూతిని కలిగిస్తాయి. తద్వారా పఠనానుభూతి మరింత చిక్కగా ఉంటుంది పాఠకులకి.

ఈ సంపుటిలో నాకు బాగా నచ్చిన లక్షణం కథల్లో వైవిధ్యం. వస్తువుల్లో, కథనంలో, భాషలో, చెప్పే తీరులో ఎన్నో రకాలు, ఐతే ఈ వెరైటీ, మన తెలుగు సినిమా దర్శకులు చేస్తున్నట్టు, కేవలం డిఫరెంట్‌గా ఉండడం కోసం కాక, అక్కడ ఎంచుకున్న కథకి తగినట్టు కథనం, కథనానికి తగిన కథకుని గొంతు, ఆ గొంతుకి తగిన భాష. ఒక చిన్న పోలిక చెప్పుకోవాలంటే ఒక్కొక్క కథా బహు రుచిగా కుదిరిన ఒక్కొక్క వంటకంలా ఉంటే, మొత్తం సంపుటి నిండుగా వడ్డించిన విస్తరిలా ఉంది. చినుకులా రాలి అనే

కథ రాష్ట్రమంతా ప్రాథమిక బడులలో పాఠ్యాంశంగా ఉండవలసిన కథ. మనుషులకే కాదు, ఈ భూమిమీద ప్రాణికోటి మనుగడకి మూలాధారమైన నీటిని మనిషి ఎన్ని రకాలుగా హింసించి బంధించి శాసిస్తున్నాడో ఒక చినుకు ద్వారా చెప్పారు. ఇలా పర్యావరణానికి సంబంధించిన అవగాహనే కాదు, ఈ కథ నడిచే తీరుని జాగ్రత్తగా గమనించండి. అక్కడ, చెల్లి, పిన్ని అని వరసలు పెట్టి పిలుచుకుంటూ అనుబంధాల్ని పెనవేసుకుని పాఠకుల మనసుకి హత్తుకుపోతుంది. పర్యావరణానికీ మానవత్వానికీ ఉన్న అవినాభావ సంబంధాన్ని తరచి చూసిన ఇంకో చక్కటి కథ మంచినీళ్ల బావి.

మనిషికి భూమికీ మధ్య ఉన్న అనుబంధం, ఆడపిల్లకి పుట్టింటితో ఉన్న అనుబంధం, పల్లెల్లోనూ నగరాల్లోనూ మారుతున్న ఆర్థిక సమీకరణాలు, తలకిందులవుతున్న జీవితాలు అనేక సమకాలీన కథల్లో ఉన్న ఈ విషయాలన్నింటినీ సత్యప్రసాద్ కూడా ఈ సంపుటిలో కవర్ చేశారు. నాకిక్కడ నచ్చిందేవిటంటే, ఎక్కడా విషయాన్ని పలుచన చెయ్యడం ఉండదు. అనవసరమైన రొమాంటిసైజేషన్ ఉండదు. హడావుడి పడి అతికీ అతకని నివారణోపాయాలని సూచించడం ఉండదు. ఉండేదల్లా సజీవమైన పాత్రల చిత్రణ, హృద్యమైన సంబంధ బాంధవ్యాల చిత్రణ, మనసునాకట్టుకునే సన్నివేశాల చిత్రణ. వైవిధ్యాన్ని పరిపూర్ణం చేస్తూ ఒక పౌరాణిక ప్రేమకథ (వానర వీరుడు), ఒక మానసిక మార్మిక కథ (మబ్బుతునక) ఈ సంపుటిలో చోటుచేసుకున్నాయి.

ఐతే, ఇవన్నీ ఒకెత్తు, పుస్తకానికి తన పేరిచ్చిన ఊహా చిత్రం కథ ఒకటీ ఒకెత్తు. వాస్తవిక కథణ పరిధిని దాటి అదివాస్తవిక ధోరణిలో ఎగ్జిస్టెన్షియల్ ప్రశ్నలని మన ముందుంచే ప్రయత్నం చేశారు రచయిత ఈ కథలో. ఇది యూరోపియన్ ఆలోచనా ధోరణి అయినా, కథా హృదయం తెలుగుదే. తెలుగు కథంటే అరటిపండు వలిచి నోట్లో పెట్టినట్టు ఉండాలనుకునే పాఠకులకి ఈ కథ అర్థం కాకపోవచ్చును కానీ, సమకాలీన జీవితంలోని సంక్లిష్టతని గుర్తించిన వారికి ఈ కథ విలువ తెలుస్తుంది. ప్రశ్నలు సూటిగానే సంధిస్తాయి గానీ జవాబులు కలలోలాగా అస్పష్టంగా ఉంటాయి. ఎవరికి తోచిన సమాధానం వారు వెతుక్కోవలసిందే!

సత్యప్రసాద్ రచనలు నాకు మొదట తెలుగు బ్లాగులద్వారా పరిచయం. పత్రికలలో కథ పడినప్పుడల్లా తన బ్లాగులో ప్రకటిస్తూ ఉండడంతో ఎప్పటికప్పుడే తాజాగా చదివే అవకాశం చిక్కింది. ప్రవాసంలో ఉన్న నావంటి వారికి కూడా బ్లాగుల వల్ల దొరికిన ఒక గొప్ప అవకాశం ఏంటంటే రచయిత తన రచన ద్వారానే కాక వ్యక్తిగా కూడా

పరిచయమవుతాడు. సత్యప్రసాద్‌తో అలా మొదలైన పరిచయం స్నేహంగా వృద్ధి చెంది, ఈ రోజు అతని కథల గురించి నాలుగు మాటలు మీతో ఇలా ముచ్చటించే అవకాశం నాకిచ్చింది. ఈ సంపుటి కోసం సత్యప్రసాద్ కథలన్నిటినీ తిరిగి చదివినప్పుడు కథకుడిగా అతను సాధించిన పరిణతిని చూసి కించిదాశ్చర్యం, చాలా గర్వం కలుగుతున్నాయి. అతని రచనావ్యాసంగం ఇబ్బడి ముబ్బడిగా సాగాలనీ, తెలుగు సాహిత్యానికి అతను మరిన్ని విలువైన నజరానాలివ్వాలని నాతో పాటు మీరూ ఆశీర్వదిస్తారు కదూ!

ఎస్. నారాయణస్వామి

అమెరికా

ప్రముఖుల మాటల్లో

అరిపిరాల సత్యప్రసాద్ 35 సంవత్సరాల ఆధునిక విద్యాధిక యువకుడు. ఆంగ్ల మాధ్యమానికి ప్రాధాన్యమిచ్చే కార్పొరేట్ వ్యవస్థలో భాగస్థుడు. ఐనా అతడికి తెలుగు భాష మీద పట్టుంది. తెలుగుతనం పట్ల అవగాహన ఉంది. తెలుగు సాహిత్యపు నేపథ్యముంది. తెలుగుకు భాషగా తెలుగునాటనే ఆదరణ లేదనీ, తెలుగు కథనరంగంపట్ల యువతరానికి ఆసక్తి లేదనీ ఇప్పుడు చాలామంది నమ్ముతున్నారు. తెలుగు భాష త్వరలో అంతరించనున్నదన్న అనుమానం అంతర్జాతీయంగా ప్రచారమౌతోంది.అలాంటి నమ్మకాల్నీ, అనుమానాల్నీ నిర్ద్వంద్వంగా తొలగిస్తుంది 'ఊహాచిత్రం'కథా సంపుటి.

ఒక భావుకుని సుందర స్వప్నాల్నీ, ఒక మంచి మనిషి ఆశయం వాంఛల్నీ, నైవిధ్యభరితంగా వెలువరించిన కథానికలు ఇవి. చదివించే గుణంతో పాటు కథ చెప్పే విధానంలో తనదైన నైపుణ్యాన్ని రుజువు చేసుకున్నారు సత్యప్రసాద్. సామాజిక కేంద్రం నుండి సాగిన మానవ సంబంధాల వృత్తాలు ఈ కథాంశాలు. రచయిత అధ్యయన శీలానికి, జీవితానుభవానికీ మాత్రమే కాక, ఒక కథా శిల్పి ప్రయోగశీలతకి కూడా ఇవి నిదర్శనాలు.

- విహారి

యీ కథలు మనలని యాజిటేట్ చెయ్యవ్. యీ కథలు మనల్ని నిద్రపుచ్చవ్. యీ కథలు మనల్ని నిశ్చిత్తంగా వుంచవ్. మనం మన చుట్టూ వున్న మనుష్యులని కంప్లైయింట్లతో కాక అత్మీయంగా అర్థం చేసుకొనే వైపు యీ కథలు నడిపిస్తాయి. అక్షరాలని యే శృతిలో యే రాగంలో అమరిస్తే తను అనుకున్న కథ పల్లవిస్తుందో తెలిసిన కథావిద్వాంసుడు అరిపిరాల సత్యప్రసాద్. మనకి వూహ తెలిసిననాటి నుంచి మనం తెలవారుఝామున వినే చిరపరిచిత స్వరాన్ని యీ కథలు తిరిగి తిరిగి మనలోకి ప్రవహింపచేస్తాయి.

- కుప్పిలి పద్మ

అరిపిరాల సత్యప్రసాద్ ఒక అన్వేషి. అయన కథల్లో ఏదో వెతుకులాట వుంటుంది. సత్యం కోసమో! జీవితానికి అర్థం కోసమో! లేక తనకే తెలియని ఒక జ్ఞాపకం కోసమో! అయన కథలు చదివిన తరువాత మనం కాస్త ఆలోచనలోపడతాం.జీవిత ప్రవాహంలో దారితెన్నూ తెలియకుండా కొట్టుకుపోకుండా ఏదో గడ్డిపోచ కోసం గాలిస్తాం.వాక్యాల సంక్లిష్టత, పదాల గాంభీర్యం లేకుండా సరళంగా సూటిగా చెప్పడం అయన శైలి. అధునిక జీవితంలోని దొల్లతనాన్ని, కపటత్వాన్ని అవిష్కరిస్తూనే మనిషి మనిషిగా బతకడంలోని అనందాన్ని కూడా వివరిస్తాయి ఈ కథలు.

- జి.ఆర్.మహర్షి